PRGI Reg No -"APTEL/26/A1193

నేటి
# శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక

చదవండి..... చదివించండి...
శుభోదయ
ప్రతిక్షణం... ప్రజల కోసం...
www.netishubhodaya.com
96965 71571

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, సంపుటి 01, సంచిక 48, సంపాదకులు : గోంగూర శ్రీనివాసరావు, పేజీలు -8, బుధవారం - 08 - ఏప్రిల్ - 2026 , వెల రూ.5/-

## తెలంగాణ కూతురుగా చెబుతున్నా..!

- కేరళ ప్రజలకు కల్వకుంట్ల కవిత విజ్ఞప్తి
- ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని విశ్వసించవద్దు




- ఎల్డీఎఫ్ కూటమిని గెలిపించాలి

## అమరావతికి రాష్ట్రపతి ఆమోదం ..

### గెజిట్‌పై మంత్రి నారా లోకేశ్ భావోద్వేగ పోస్టు




- ఆంధ్రప్రదేశ్ రాజధానిపై నెలకొన్న అనిశ్చితికి తెరపడింది
- రాష్ట్రపతి ఆమోదం అనంతరం కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ సోమవారం రాత్రి అధికారిక గెజిట్ నోటిఫికేషన్

## ఒక్కరోజే శ్రీవారి హుండీకి కానుకల రూపంలో రూ. 4.75 కోట్ల ఆదాయం



- తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ... శ్రీవారి సర్వదర్శనానికి 6 గంటలే!
- ముందు రోజుతో పోలిస్తే రద్దీ కాస్త తగ్గడంతో భక్తులు త్వరగా స్వామివారిని దర్శించుకోగలుగుతున్నారు




## ఇది భారత్ గర్వించదగిన క్షణం: సీఎం చంద్రబాబు

- దేశ పౌర అణు ప్రస్థానానికి ఇదొక గొప్ప ప్రోత్సాహం
- చరిత్రాత్మక విజయం సాధించిన శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు చంద్రబాబు అభినందనలు
- "భారత అణు కార్యక్రమం రెండో దశలో ఇది ఒక కీలక ముందడుగు
- ఈ పరిణామం దేశ దీర్ఘకాలిక ఇంధన భద్రతకు మార్గాన్ని బలోపేతం చేస్తుంది
- ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ అణు రియాక్టర్ క్రిటికాలిటీని సాధించడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం

# రూ.39,436 కోట్ల ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్

## ఏపీకి పెట్టుబడుల ప్రవాహం...

- సౌర విద్యుత్ హబ్‌గా రాయలసీమ
- ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో ప్రత్యక్షంగా 1,11,278 మందికి ఉద్యోగ అవకాశాలు
- అమరావతి క్వాంటం వ్యాలీలో మూడు ప్రతిష్ఠాత్మక సంస్థల ఏర్పాటుకు కూడా ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్
- ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంపై ప్రత్యేక దృష్టి
- వ్యవసాయ వ్యర్థాల సద్వినియోగం



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామిక ప్రగతి పథంలో పరుగులు పెట్టించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో వివిధ రంగాల్లో మిగతా..2లో



## స్వర్ణాంధ్ర 2047 విజన్ దిశగా రాష్ట్రాన్ని నడిపిద్దాం

- ఆంధ్రప్రదేశ్ ప్రజల దశాబ్ద కాలపు నిరీక్షణకు తెరపడింది
- ఈ విజయం తమ భూములను త్యాగం చేసిన రైతులకు, పట్టుదలతో పోరాడిన ప్రజలకు చెందుతుంది
- అందరం కలిసి ప్రజల రాజధాని అమరావతిని నిర్మించుకుందాం
- అమరావతి నిర్మాణ పనుల్లో మరింత వేగం పుంజుకోనుంది

అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అధికారికంగా ఆమోదం తెలపడంపై ఏపీ ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కల్యాణ్ భావోద్వేగంతో కూడిన హర్షాన్ని వ్యక్తం చేశారు. ఏప్రిల్ 6వ తేదీ ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఒక సువర్ణాధ్యాయంగా నిలిచిపోతుందని ఆయన పేర్కొన్నారు. మిగతా..2లో



## బీఆర్ఎస్ నేతలను నిర్బంధించడంపై కేటీఆర్ ఫైర్..

తమకు అరెస్టులు కొత్త కాదని వ్యాఖ్య!

కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలను ఆయన 'పిరికిపంద చర్యలు'

పరిగి నియోజకవర్గంలో తమ భూములను కాపాడుకోవడానికి పోరాడుతున్న రైతులకు మద్దతు తెలపడం నేరమా?

"అరెస్టులు, జైళ్లు, అక్రమ కేసులు బీఆర్ఎస్ నాయకులకు కొత్తేమీ కాదు

తెలంగాణ ఉద్యమ కాలం నుండి ఇలాంటి ఎన్నో ఆంక్షలను ఎదుర్కొన్నాం

హైదరాబాద్: పరిగి భూసేకరణ బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ నేతల అరెస్టులు, గృహనిర్బంధాలపై ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలను ఆయన 'పిరికిపంద చర్యలు'గా అభివర్ణించారు. పరిగి నియోజకవర్గంలో తమ భూములను మిగతా..2లో

## 'నీ పో, మోనే విజయన్!' అంటూ కేరళం సీఎంకు రేవంత్ కౌంటర్

### సుస్థిరాభివృద్ధిలో తెలంగాణ ఆరో స్థానంలో ఉంది

- ఇది అసంబద్ధ పోలిక అని పేర్కొంటూ, వాస్తవ గణాంకాలతో కూడిన ఆరు పేజీల సుదీర్ఘ లేఖ విడుదల
- విజయన్ తన ఆరోపణలకు వాడుకున్న గణాంకాలు 2023-24కి సంబంధించినవి



హైదరాబాద్: సుస్థిరాభివృద్ధిలో తెలంగాణ ఆరో స్థానంలో ఉందంటూ కేరళం ముఖ్యమంత్రి పినరయి విజయన్ 'ఎక్స్' వేదికగా చేసిన విమర్శలపై సీఎం రేవంత్ రెడ్డి ఘాటుగా స్పందించారు. ఇది అసంబద్ధ పోలిక అని పేర్కొంటూ, వాస్తవ గణాంకాలతో కూడిన ఆరు పేజీల సుదీర్ఘ లేఖను విడుదల చేశారు. విజయన్ చేసిన ఆరోపణలను తిప్పికొడుతూ, మలయాళంలోనే చురక అంటించారు. విజయన్ తన ఆరోపణలకు వాడుకున్న గణాంకాలు 2023-24కి సంబంధించినవని, అవి తెలంగాణలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలన చివరి దశలోనివని రేవంత్ గుర్తుచేశారు. కేరళంలో విజయన్ సర్కారు 120 నెలలుగా అధికారంలో ఉందని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి కేవలం 28 నెలలే అయ్యిందని పేర్కొన్నారు. 70 ఏళ్ల కేరళ మిగతా..2లో

## సీఎం చంద్రబాబు అధ్యక్షతన 16వ ఎస్ఐపీబీ సమావేశం...



ఆమోదం పొందిన ప్రాజెక్టుల జాబితా ఇదిగో!

క్లీన్ రెన్యువబుల్ ఎనర్జీ హైబ్రిడ్ సిక్స్ ప్రైవేట్ లిమిటెడ్: కడప, అనంతపురం జిల్లాల్లో రూ.1,391 కోట్ల పెట్టుబడితో 190 ఉద్యోగాలు.

క్లీన్ రెన్యువబుల్ ఎనర్జీ హైబ్రిడ్ సిక్స్ ప్రైవేట్ లిమిటెడ్: కడప జిల్లాలో రూ.1,391 కోట్ల పెట్టుబడితో 190 ఉద్యోగాలు.

ఎస్సార్ రెన్యువబుల్స్ సోలార్ టు లిమిటెడ్: కర్నూలు జిల్లాలో రూ.1,327 కోట్ల పెట్టుబడితో 1,035 ఉద్యోగాలు.


ఎస్సార్ రెన్యువబుల్స్ హైబ్రిడ్ వన్ లిమిటెడ్: కర్నూలు జిల్లాలో రూ.2,714 కోట్ల పెట్టుబడితో 1,240 ఉద్యోగాలు.

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో భారీ పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మిగతా..2లో




## దేశం కోసం నేను, నా ప్రజలు ప్రాణత్యాగానికి సిద్ధం: ఇరాన్ అధ్యక్షుడు

- ఏదేమైనా పోరాటాన్ని ఆపే ప్రసక్తి లేదు
- ఇరాన్ కోసమే నిలబడ్డాను, ఇక ముందు కూడా నిలబడతా
- డెడ్‌లైన్ పొడిగింపు ఉండదని, ఇరాన్‌ను తమ బలగాలు ఒక్క రాత్రికే తుడిచి పెట్టేయగలవు




## హర్మూజ్ వద్ద ఇరాన్ అనుమతి నిరాకరణ.. ప్రపంచవ్యాప్తంగా ఎల్ఎన్జీ ఇబ్బందులు

- ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం ప్రారంభమై 39 రోజులవుతోంది
- యుద్ధం నేపథ్యంలో హర్మూజ్ జలసంధి నుంచి నౌకల రాకపోకలను ఇరాన్ అనుమతించడం లేదు
- పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఏ క్షణం ఎటువైపు వెళుతాయో అర్థంకాని పరిస్థితి నెలకొంది



## 55 ఏళ్ల క్రితం ఏం జరిగిందో ఆ దేశం గుర్తుంచుకోవాలి

- కోల్‌కతాను లక్ష్యంగా చేసుకుంటే పాకిస్థాన్ ఎన్ని ముక్కలవుతుందో దేవుడికే తెలియాలి

ఢిల్లీ: కోల్‌కతాను, పశ్చిమ బెంగాల్‌ను లక్ష్యంగా చేసుకుంటే పాకిస్థాన్ ఎన్ని ముక్కలవుతుందో ఆ దేవుడికే తెలియాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ హెచ్చరించారు. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు చోటు చేసుకుంటున్న నేపథ్యంలో పొరుగు దేశాలు భారత్‌పై దుస్సాహసానికి పాల్పడవద్దని కొన్ని రోజుల క్రితం ఆయన హెచ్చరించారు. దీనితో భారత్ ఏమైనా దాడులకు పాల్పడితే మిగతా..2లో

# రేవంత్‌తో చర్చకు దిగే ఉద్దేశం లేదు..పినరయి విజయన్

## మీ హయాంలో ఏం చేశారో చూపించండి: రేవంత్‌రెడ్డి

- రేవంత్‌తో చర్చకు దిగేందుకు తెలంగాణలో పార్టీలు ఉన్నాయి
- ఆయన ప్రభుత్వ పనితీరుపై అక్కడి ప్రజలే తీర్పునివ్వాలి
- నీతి ఆయోగ్ 2023-24 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్డీజీ) సూచీలో కేరళ తొలి స్థానంలో ఉంది
- కేరళ ప్రభుత్వ పనితీరుపై తన విమర్శలను ఎంతో గౌరవప్రదంగా, హుందాగా వ్యక్తం చేశా
- మీరు నా రాష్ట్రానికి వచ్చినప్పుడు, ఒక అతిథికి చేయాల్సిన అన్ని మర్యాదలు చేస్తాం



తిరువనంతపురం: తనతో చర్చకు రావాలన్న సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌పై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ స్పందించారు. ఆయనతో చర్చకు దిగే ఉద్దేశం తనకు లేదన్నారు. రేవంత్‌తో చర్చకు దిగేందుకు తెలంగాణలో పార్టీలు ఉన్నాయని, ఆయన ప్రభుత్వ పనితీరుపై అక్కడి ప్రజలే మిగతా..2లో

నేటి శుభోదయ
ప్రతి క్షణం - ప్రజల కోసం
తెలుగు దినపత్రిక



## దేశం కోసం నేను, నా ప్రజలు ప్రాణత్యాగానికి సిద్ధం: ఇరాన్ అధ్యక్షుడు

ఇరాన్ : ఇరాన్ రక్షణ కోసం తన ప్రాణాలను సైతం త్యాగం చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఆ దేశ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ అన్నారు. దేశానికి చెందిన 14 మిలియన్లకు పైగా ఇరాన్ ప్రజలతో పాటు తానూ దేశం కోసం ప్రాణాలను త్యాగం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. కాల్పుల విరమణకు పలు దేశాలు మధ్యవర్తిత్వం వహిస్తోన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పెజెష్కియాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఏదేమైనా పోరాటాన్ని ఆపే ప్రసక్తి లేదని అన్నారు. ఇరాన్ కోసమే నిలబడ్డాను, ఇక ముందు కూడా నిలబడతానని పేర్కొన్నారు. ఇరాన్ హర్మూజ్ జలసంధిని తెరవకపోతే ఆ దేశంలోని అనేక స్థావరాలను, మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటామని ట్రంప్ హెచ్చరించిన విషయం తెలిసిందే. ఈసారి డెడ్‌లైన్ పొడిగింపు ఉండదని, ఇరాన్‌ను తమ బలగాలు ఒక్క రాత్రికే తుడిచి పెట్టేయగలవని హెచ్చరించారు. ఈ నేపథ్యంలో ఇరాన్ అధ్యక్షుడు ధీటుగా స్పందించారు. అమెరికా తాత్కాలిక ఒప్పందాలకు అంగీకరించబోమని, తమ శాశ్వత డిమాండ్లు అంగీకరించాలని చెబుతోంది. తాను, తమ దేశ ప్రజలు ప్రాణత్యాగాలకు కూడా సిద్ధమని ఇరాన్ అధ్యక్షుడు ప్రకటించడం చూస్తుంటే పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## కేరళ ఆలయాలకు అనంత్ అంబానీ రూ.18 కోట్ల భారీ విరాళం

ఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అనంత్ అంబానీ కేరళలోని ప్రఖ్యాత ఆలయాల అభివృద్ధి, ఏనుగుల సంరక్షణ కోసం భారీ విరాళం ప్రకటించారు. మొత్తం రూ.18 కోట్లు అందించనున్నట్లు తెలిపారు. ఆయన ప్రసిద్ధ రాజరాజేశ్వరం, గురువాయూర్ ఆలయాలను సందర్శించారు. ఈ పర్యటనలో భాగంగా రాజరాజేశ్వరం ఆలయానికి రూ.3 కోట్లు, గురువాయూర్ ఆలయానికి రూ.3 కోట్లు విరాళంగా అందజేశారు. దీనికి అదనంగా, రాజరాజేశ్వరం ఆలయంలో 200 ఏళ్లుగా శిథిలావస్థలో ఉన్న పురాతన తూర్పు గోపురం పునరుద్ధరణ పనుల కోసం మరో రూ.12 కోట్లు కేటాయించనున్నట్లు వెల్లడించారు. రాజరాజేశ్వరం ఆలయంలో అనంత్ అంబానీ ప్రత్యేక పూజలు చేసి, సంప్రదాయ ఆచారాలు పాటించారు. ఆలయ అధికారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన రూ.3 కోట్ల చెక్కును టీటీకే దేవస్వోం అధ్యక్షుడు టీపీ వినోద్ కుమార్, ఈవో కేపీ వినయన్ వంటి అధికారులకు అందించారు. అనంతరం గురువాయూర్ ఆలయంలోనూ ప్రార్థనలు చేసి రూ.3 కోట్లు విరాళమిచ్చారు. అంతేకాదు, గురువాయూర్ ఆలయంలోని ఏనుగుల సంక్షేమానికి కూడా అనంత్ ప్రాధాన్యత ఇచ్చారు. తన వన్యప్రాణి సంరక్షణ కార్యక్రమం 'వంతార' ద్వారా ఏనుగుల కోసం ఆధునిక ఆసుపత్రి, గొలుసులు లేని ఆశ్రయాలు నిర్మించనున్నట్లు తెలిపారు. ఏనుగుల జీవన పరిస్థితులను మెరుగుపరచి, వాటికి శాస్త్రీయ పద్ధతుల్లో సంరక్షణ అందించడమే తమ లక్ష్యమని వివరించారు. "భారతదేశ ఆధ్యాత్మిక సంప్రదాయాలు కేవలం పూజా స్థలాలు మాత్రమే కాదు. అవి విశ్వాసం, సమాజం, కరుణ, ప్రకృతితో మనకున్న సంబంధాన్ని పోషించే జీవన సంస్థలు. ఈ పవిత్ర వారసత్వాన్ని భవిష్యత్ తరాల కోసం కాపాడటం మనందరి బాధ్యత" అని ఈ సందర్భంగా అనంత్ అంబానీ అన్నారు. తమ సేవల ద్వారా భక్తుల అనుభవాన్ని మెరుగుపరచడంతో పాటు, జంతువులకు గౌరవంతో కూడిన సంరక్షణ అందించాలని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## హర్మూజ్ వద్ద ఇరాన్ అనుమతి నిరాకరణ.. ప్రపంచవ్యాప్తంగా ఎల్‌ఎన్జీ ఇబ్బందులు

ఢిల్లీ: ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా యుద్ధం ప్రారంభమై 39 రోజులవుతోంది. యుద్ధం నేపథ్యంలో హర్మూజ్ జలసంధి నుంచి నౌకల రాకపోకలను ఇరాన్ అనుమతించడం లేదు. ఆ దేశం అనుమతితో కొన్ని చమురు, గ్యాస్ కంటైనర్లు మాత్రం ఈ జలసంధి మీదుగా ప్రయాణిస్తున్నాయి. హర్మూజ్ మీదుగా ఇరాన్ అనుమతి నిరాకరించడంతో గల్ఫ్ జలాల్లో సరుకు రవాణా నౌకలు పెద్ద మొత్తంలో ఉన్నట్లు షిప్ ట్రాకింగ్ డేటా వెల్లడిస్తోంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు ఏ క్షణం ఎటువైపు వెళుతాయో అర్థంకాని పరిస్థితి నెలకొంది. శాశ్వత శాంతి కోసం ఇరాన్ డిమాండ్ చేస్తుండగా, అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీరు అందుకు భిన్నంగా ఉంది. దీంతో యుద్ధం ఇప్పుడప్పుడే ముగిసే పరిస్థితులు కనిపించడం లేదు. ఇది అంతర్జాతీయంగా ఇంధన సంక్షోభానికి కారణమవుతోంది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి హర్మూజ్ మీదుగా ఇరాన్ ఒక్క ఎల్‌ఎన్జీ ట్యాంకర్‌కు కూడా క్లియరెన్స్ ఇవ్వలేదు. ఇటీవల ఖతార్ నుంచి వచ్చిన రెండు ట్యాంకర్లను కూడా ఇరాన్ అనుమతించలేదు. దీంతో అవి వెనక్కి మళ్ళినట్లు తెలుస్తోంది. జలసంధి వద్ద ఇరాన్ అనుమతి నిరాకరించడంతో ప్రపంచవ్యాప్తంగా ఎల్‌ఎన్జీకి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

## ఇది భారత్ గర్వించదగిన క్షణం: సీఎం చంద్రబాబు

అమరావతి: కల్పక్కంలో స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ప్రోటోటైప్ ఫాస్ట్ బ్రీడర్ అణు రియాక్టర్ క్రిటికాలిటీని సాధించడంపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రతి భారతీయుడు గర్వించదగ్గ క్షణమని, దేశ పౌర అణు ప్రస్థానానికి ఇదొక గొప్ప ప్రోత్సాహమని ఆయన అన్నారు. ఈ చరిత్రాత్మక విజయం సాధించిన శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు చంద్రబాబు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన సోషల్ మీడియాలో స్పందిస్తూ, "భారత అణు కార్యక్రమం రెండో దశలో ఇది ఒక కీలక ముందడుగు. ఈ విజయంతో మన దేశంలో ఉన్న విస్తారమైన థోరియం నిల్వలను మూడో దశలో వినియోగించుకోవడానికి మరింత చేరువయ్యాం" అని వివరించారు. ఈ పరిణామం దేశ దీర్ఘకాలిక ఇంధన భద్రతకు మార్గాన్ని బలోపేతం చేస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోనే ఇంధన భద్రత దిశగా దేశం బలమైన అడుగులు వేస్తోందని చంద్రబాబు ప్రశంసించారు. శాస్త్ర, సాంకేతిక రంగాలలో స్వయం సమృద్ధి సాధించడంలో ఇటువంటి విజయాలు ఎంతో స్ఫూర్తినిస్తాయని ఆయన పేర్కొన్నారు.

## తెలంగాణ కూతురుగా చెబుతున్నా..!

హైదరాబాద్: ఆరు గ్యారెంటీల పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీని విశ్వసించవద్దని, పినరయి విజయన్ నేతృత్వంలోని ఎల్డీఎఫ్ కూటమిని గెలిపించాలంటూ తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కేరళ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆమె ఒక వీడియోను విడుదల చేశారు. "జై తెలంగాణ, జై కేరళ" అంటూ ప్రారంభించారు. "తెలంగాణ కూతురిగా కేరళ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నాను" అంటూ వీడియోను విడుదల చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేరళలో కాంగ్రెస్ పార్టీకి ప్రచారం చేశారని, ఇచ్చిన హామీలు అమలు చేశామని నమ్మించే ప్రయత్నం చేశారని అన్నారు. ఎన్నికల సమయంలో వారు ఆరు గ్యారెంటీలు ఇచ్చారని, కానీ కేవలం సగం గ్యారెంటీ 'ఉచిత బస్సు'ను మాత్రమే అమలు చేశారని పేర్కొన్నారు. తాను తెలంగాణ బిడ్డనని, త్వరలో రాజకీయ పార్టీని కూడా ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో కేరళ ప్రజలను మోసగిస్తున్నారని ఆరోపించారు. ఆడపడుచులకు నెలకు రూ.2,500, యువతకు ఉద్యోగాలు, రైతులకు బోనస్, పెన్షన్ పెంపు వంటి హామీలు ఇచ్చి కూడా వాటిని అమలు చేయలేదని విమర్శించారు. తెలంగాణ ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్, అవినీతిలో కూరుకుపోయిందని విమర్శించారు. ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రం కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంగా మారిందని ఆరోపించారు. అవినీతి ద్వారా తెలంగాణ నుంచి వచ్చిన సొమ్మును కాంగ్రెస్ కేరళలో ఖర్చు చేస్తోందని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎల్డీఎఫ్‌కు ఓటు వేయాలని కోరారు.

## ఒక్కరోజే శ్రీవారి హుండీకి కానుకల రూపంలో రూ. 4.75 కోట్ల ఆదాయం

తిరుపతి: తిరుమల పుణ్యక్షేత్రంలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. శ్రీవారి సర్వదర్శనానికి కేవలం 6 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు. ముందు రోజుతో పోలిస్తే రద్దీ కాస్త తగ్గడంతో భక్తులు త్వరగా స్వామివారిని దర్శించుకోగలుగుతున్నారు. టీటీడీ వెల్లడించిన వివరాల ప్రకారం, సోమవారం (ఏప్రిల్ 6) శ్రీ వేంకటేశ్వర స్వామిని మొత్తం 77,294 మంది భక్తులు దర్శించుకున్నారు. వీరిలో 26,796 మంది తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఒక్కరోజే శ్రీవారి హుండీకి కానుకల రూపంలో రూ. 4.75 కోట్ల ఆదాయం వచ్చినట్లు అధికారులు ప్రకటించారు. ప్రస్తుతం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని 7 కంపార్ట్‌మెంట్లలో భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు. టైమ్‌స్లాట్ టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు దర్శనానికి సుమారు 6 గంటల సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. రద్దీ తగ్గడంతో సామాన్య భక్తులకు దర్శనం వేగంగా జరుగుతోంది.

## ఎన్నికలు ఎప్పుడొచ్చినా కాంగ్రెస్ పార్టీ సింగిల్ డిజిట్‌కు పరిమితం

హైదరాబాద్: ఎన్నికలు ఎప్పుడొచ్చినా కాంగ్రెస్ పార్టీ గెలవబోదని, సింగిల్ డిజిట్‌కు పరిమితమవుతుందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే హరీశ్ రావు అన్నారు. పరిగి ఇండస్ట్రియల్ పార్క్ బాధితులను కలవడానికి బయలుదేరడంతో పోలీసులు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, ఎర్రబెల్లి దయాకర్ రావు సహా పలువురు బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేశారు. శంషాబాద్ పోలీసు స్టేషన్‌కు తరలించిన పోలీసులు, ఆ తర్వాత వారిని విడుదల చేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ, తెలంగాణలో కాంగ్రెస్ మరోసారి అధికారంలోకి వస్తుందని, తాను మళ్లీ ముఖ్యమంత్రి అవుతానని రేవంత్ రెడ్డి పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కనీసం ప్రతిపక్ష హోదా కూడా రాదని వ్యాఖ్యానించారు. గత రెండున్నరేళ్ల పాలనలో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాంటి కాంగ్రెస్ పార్టీ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సింగిల్ డిపాజిట్‌కు పరిమితమవుతుందని అన్నారు. ప్రతిపక్షాలు ప్రశ్నించకూడదని, ఆందోళనలు, ధర్నాలు నిర్వహించరాదని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతోందని మండిపడ్డారు. ప్రశ్నిస్తే కేసులు, విచారణలు అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అసలు తమను అరెస్టు చేయాల్సిన అవసరం ఏమొచ్చిందని నిలదీశారు. రైతులను పరామర్శించేందుకు వెళుతుంటే అరెస్టు చేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల తర్వాత తెలంగాణలో రామరాజ్యం లాంటి కేసీఆర్ రాజ్యం వస్తుందని అన్నారు.

# రూ.39,436 కోట్ల ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్



అమరావతి: ఆంధ్రప్రదేశ్‌ను పారిశ్రామిక ప్రగతి పథంలో పరుగులు పెట్టించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో వివిధ రంగాల్లో భారీ పెట్టుబడులకు మార్గం సుగమం చేస్తూ, రూ.39,436.84 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) ఆమోదముద్ర వేసింది. ఈ ప్రాజెక్టుల ద్వారా రాష్ట్రంలో ప్రత్యక్షంగా 1,11,278 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. మంగళవారం నాడు సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన 16వ ఎస్ఐపీబీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సమావేశంలో మంత్రులు నారా లోకేశ్, కె. అచ్చెన్నాయుడు, పి. నారాయణ, కందుల దుర్గేశ్, టీజీ భరత్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ సహా పలువురు మంత్రులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

రూ.39,436 కోట్ల పెట్టుబడులకు ఆమోదం

పరిశ్రమలు, విద్యుత్, ఐటీ, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి కీలక రంగాల్లో ఈ కొత్త పెట్టుబడులు రానున్నాయి. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి దోహదపడే ఈ ప్రాజెక్టులపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ముఖ్యంగా, అమరావతి క్వాంటం వ్యాలీలో మూడు ప్రతిష్ఠాత్మక సంస్థల ఏర్పాటుకు కూడా ఎస్ఐపీబీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం విశేషం. ఈ నిర్ణయంతో రాజధాని ప్రాంతంలోనూ పారిశ్రామిక కార్యకలాపాలు ఊపందుకోనున్నాయి. రాష్ట్రానికి వస్తున్న పెట్టుబడులు, వాటి ద్వారా లభించే ఉద్యోగాల వివరాలను ఎప్పటికప్పుడు వెబ్‌సైట్‌లో పొందుపరచడం ద్వారా ప్రజలకు పారదర్శకంగా సమాచారం అందించాలని సీఎం అధికారులను ఆదేశించారు.

సౌర విద్యుత్ హబ్‌గా రాయలసీమ

పునరుత్పాదక ఇంధన రంగంలో ఆంధ్రప్రదేశ్‌ను దేశంలోనే అగ్రగామిగా నిలపాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా, రాయలసీమ జిల్లాల్లో సౌర విద్యుత్ ఉత్పత్తికి అపారమైన అవకాశాలు ఉన్నాయని, ఈ ప్రాంతాన్ని 'సోలార్ హబ్'గా తీర్చిదిద్దాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం 325 గిగావాట్ల సౌర విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందని అధికారులు వివరించగా, ఈ సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని సీఎం సూచించారు. ఉత్పత్తి అయిన విద్యుత్‌ను రాష్ట్ర, జాతీయ గ్రిడ్‌లకు అనుసంధానించాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఇతర రాష్ట్రాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు వీలుగా శక్తిమంతమైన ట్రాన్స్‌మిషన్ లైన్లను ఇప్పటి నుంచే సిద్ధం చేసుకోవాలని చంద్రబాబు స్పష్టం చేశారు.

ఎలక్ట్రానిక్స్ తయారీ రంగంపై ప్రత్యేక దృష్టి

ఎలక్ట్రానిక్స్ రంగంలో, ముఖ్యంగా కన్స్యూమర్ ఉత్పత్తుల తయారీలో ఆంధ్రప్రదేశ్‌ను ఒక కీలక కేంద్రంగా మార్చాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. శ్రీసిటీ, కొప్పర్తి, అనంతపురం వంటి ప్రాంతాలలో ఎలక్ట్రానిక్స్ కాంపోనెంట్ పరిశ్రమల ఏర్పాటుకు పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షించాలని ఆదేశించారు. దీనితో పాటు, రాష్ట్రంలో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఏర్పాటుపైనా ప్రత్యేకంగా దృష్టి సారించాలని, ఏపీని జీసీసీలకు కేంద్రంగా మార్చాలని సూచించారు. ఇది రాష్ట్రంలో నైపుణ్యం కలిగిన యువతకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తుంది.

వ్యవసాయ వ్యర్థాల సద్వినియోగం

వ్యవసాయాధారిత రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో వ్యవసాయం, ఉద్యాన, ఆక్వా రంగాల్లో వెలువడుతున్న వ్యర్థాలను సంపదగా మార్చే ప్రాజెక్టులను ప్రోత్సహించాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పర్యావరణానికి హాని కలగకుండా, కాలుష్య రహితంగా ఇథనాల్ వంటి ఉప ఉత్పత్తులను తయారు చేసే యూనిట్ల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ అంశంపై పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి, అవసరమైతే కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇది రైతులకు అదనపు ఆదాయం కల్పించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుంది.

పారిశ్రామిక భద్రతకు పెద్దపీట

రాష్ట్రంలో ఏర్పాటు కానున్న పరిశ్రమల్లో ఆధునిక, అత్యున్నత భద్రతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు తేల్చి చెప్పారు. భవిష్యత్తులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా ఎదుర్కొనేలా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు ఉండాలన్నారు. ముఖ్యంగా ఫార్మా, స్టీల్, గ్రీన్ ఎనర్జీ వంటి రంగాల్లో ఏర్పాటు చేసే ప్రాజెక్టుల కోసం విపత్తు నిర్వహణ నిబంధనలకు అనుగుణంగా ఒక ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక (ఎస్ఓపీ) సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇటీవల బాణాసంచా తయారీ యూనిట్లలో జరిగిన ప్రమాదాలను ప్రస్తావిస్తూ, భద్రతా ప్రమాణాల విషయంలో ఎలాంటి రాజీ పడరాదని స్పష్టం చేశారు.

ప్రాజెక్టుల వేగవంతం.. పెట్టుబడుల సమీక్ష

ఎస్ఐపీబీ ఆమోదం పొందిన ప్రాజెక్టులు కేవలం కాగితాలకే పరిమితం కాకుండా, నిర్దేశిత గడువులోగా కార్యరూపం దాల్చాలని సీఎం చంద్రబాబు గట్టిగా ఆదేశించారు. ప్రాజెక్టుల గ్రౌండింగ్ ప్రక్రియను వేగవంతం చేసే బాధ్యతను సంబంధిత శాఖలు తీసుకోవాలన్నారు. భారీ ప్రాజెక్టుల పురోగతిని ప్రతి ఎస్ఐపీబీ సమావేశంలోనూ సమీక్షిస్తామని స్పష్టం చేశారు. గత 22 నెలల్లో ఎస్ఐపీబీ ద్వారా రూ.9.36 లక్షల కోట్ల విలువైన 264 ప్రాజెక్టులకు ఆమోదం లభించిందని, వీటి ద్వారా 9.60 లక్షల ఉద్యోగాలు రానున్నాయని అధికారులు తెలిపారు. విశాఖ భాగస్వామ్య సదస్సు ఒప్పందాలను కూడా కలుపుకుంటే రాష్ట్రానికి మొత్తం రూ.20.74 లక్షల కోట్ల పెట్టుబడులు, 23.55 లక్షల ఉద్యోగాలు రానున్నాయని వెల్లడించారు.

## సీఎం చంద్రబాబు అధ్యక్షతన 16వ ఎస్ఐపీబీ సమావేశం...

అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో భారీ పెట్టుబడులకు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంగళవారం సచివాలయంలో జరిగిన 16వ రాష్ట్రస్థాయి పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎస్ఐపీబీ) సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. పరిశ్రమలు, విద్యుత్, ఐటీ, పర్యాటకం, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి పలు రంగాల్లో మొత్తం రూ.39,436.84 కోట్ల విలువైన 31 ప్రాజెక్టులకు బోర్డు ఆమోదం తెలిపింది. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో ప్రత్యక్షంగా 1,11,278 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఈ సమావేశానికి మంత్రులు నారా లోకేశ్, అచ్చెన్నాయుడు, పి. నారాయణ, కందుల దుర్గేశ్, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్ధన్ రెడ్డి, వాసంశెట్టి సుభాష్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు.

విద్యుత్ రంగం (8 ప్రాజెక్టులు): మొత్తం పెట్టుబడి రూ.12,552 కోట్లు, ఉద్యోగాలు 69,070. 1. క్లీన్ రెన్యువబుల్ ఎనర్జీ హైబ్రిడ్ సిక్స్ ప్రైవేట్ లిమిటెడ్: కడప, అనంతపురం జిల్లాల్లో రూ.1,391 కోట్ల పెట్టుబడితో 190 ఉద్యోగాలు. 2. క్లీన్ రెన్యువబుల్ ఎనర్జీ హైబ్రిడ్ సిక్స్ ప్రైవేట్ లిమిటెడ్: కడప జిల్లాలో రూ.1,391 కోట్ల పెట్టుబడితో 190 ఉద్యోగాలు. 3. ఎస్సార్ రెన్యువబుల్స్ సోలార్ టు లిమిటెడ్: కర్నూలు జిల్లాలో రూ.1,327 కోట్ల పెట్టుబడితో 1,035 ఉద్యోగాలు. 4. ఎస్సార్ రెన్యువబుల్స్ హైబ్రిడ్ వన్ లిమిటెడ్: కర్నూలు జిల్లాలో రూ.2,714 కోట్ల పెట్టుబడితో 1,240 ఉద్యోగాలు. 5. ఎస్సార్ రెన్యువబుల్స్ హైబ్రిడ్ వన్ లిమిటెడ్: అనంతపురం జిల్లాలో రూ.1,714 కోట్ల పెట్టుబడితో 220 ఉద్యోగాలు. 6. పేస్ డిజిటెక్ ప్రైవేట్ లిమిటెడ్: కడప జిల్లాలో రూ.745 కోట్ల పెట్టుబడితో 345 ఉద్యోగాలు. 7. ఎస్ఏఈఎల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్: పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి, కృష్ణా, గుంటూరు, బాపట్ల, ఏలూరు, విజయనగరం జిల్లాల్లో రూ.3,200 కోట్ల పెట్టుబడితో 65,000 ఉద్యోగాలు. 8. హెచ్‌హెచ్‌పీ ఎయిట్ ప్రైవేట్ లిమిటెడ్: తిరుపతి జిల్లాలో రూ.70 కోట్ల పెట్టుబడితో 850 ఉద్యోగాలు. ఐటీ, ఎలక్ట్రానిక్స్ (11 ప్రాజెక్టులు): మొత్తం పెట్టుబడి రూ.18,210.36 కోట్లు, ఉద్యోగాలు 36,411. 9. ఇన్ఫోసిస్ లిమిటెడ్: విశాఖ యండాడలో రూ.750 కోట్లతో 7,000 ఉద్యోగాలు. 10. క్రెడెన్స్ రియాలిటీ: విశాఖ తాళ్లవలసలో రూ.386.88 కోట్లతో 6,500 ఉద్యోగాలు. 11. ఫ్యూజీ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్: విశాఖ కాపులుప్పాడలో రూ.425 కోట్లతో 2,500 ఉద్యోగాలు. 12. శ్రీటెక్ డేటా లిమిటెడ్: విశాఖ కాపులుప్పాడలో రూ.1,800 కోట్ల పెట్టుబడి. 13. పీజీ టెక్నోప్లాస్ట్: తిరుపతి జిల్లా శ్రీసిటీలో రూ.1,305 కోట్లతో 2,910 ఉద్యోగాలు. 14. ఎన్‌పీఎస్‌పీఎల్ స్పెషాలిటీ కెమికల్స్: చిత్తూరు జిల్లా కుప్పంలో రూ.2,550 కోట్లతో 400 ఉద్యోగాలు. 15. ఐస్ప్రౌట్ బిజినెస్ సెంటర్: విశాఖపట్నంలో రూ.626.90 కోట్లతో 12,500 ఉద్యోగాలు. 16. ఆర్ఆర్‌పీ ఎలక్ట్రానిక్స్: శ్రీ సత్యసాయి జిల్లాలో రూ.10,239.78 కోట్లతో 3,017 ఉద్యోగాలు. 17. సీ డాక్: అమరావతి క్వాంటం వ్యాలీలో రూ.17 కోట్లతో 12 ఉద్యోగాలు. 18. పీక్యూ స్టేషన్ ప్రైవేట్ లిమిటెడ్: అమరావతి క్వాంటం వ్యాలీలో రూ.1.8 కోట్లతో 20 ఉద్యోగాలు. 19. క్వాంటం ఏఐ గ్లోబల్: అమరావతి క్వాంటం వ్యాలీలో రూ.108 కోట్లతో 1,552 ఉద్యోగాలు. పర్యాటక రంగం (2 ప్రాజెక్టులు): పెట్టుబడి రూ.200.15 కోట్లు, ఉద్యోగాలు 270. 20. సన్ రే గ్రీన్ స్పేస్: విజయనగరంలో రూ.117.66 కోట్లతో 150 ఉద్యోగాలు. 21. రవిప్రియ హాస్పిటాలిటీస్: ఒంగోలులో రూ.82.49 కోట్లతో 120 ఉద్యోగాలు. ఫుడ్ ప్రాసెసింగ్ (2 ప్రాజెక్టులు): పెట్టుబడి రూ.1,222.73 కోట్లు, ఉద్యోగాలు 550. 22. ఇండస్ కాఫీ ప్రైవేట్ లిమిటెడ్: తిరుపతిలో రూ.233.73 కోట్లతో 100 ఉద్యోగాలు. 23. రెడ్ బెర్రీ ఫుడ్ లాజిస్టిక్స్: చిత్తూరులో రూ.989 కోట్లతో 450 ఉద్యోగాలు. పరిశ్రమలు, వాణిజ్యం (8 ప్రాజెక్టులు): పెట్టుబడి రూ.7,251.6 కోట్లు, ఉద్యోగాలు 4,977. 24. మెట్రో డెకరేటివ్ లిమిటెడ్: నాయుడుపేటలో రూ.1,032 కోట్లతో 400 ఉద్యోగాలు. 25. ఆర్సెల్లార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా: విశాఖలో రూ.1,400 కోట్లతో 250 ఉద్యోగాలు. 26. శ్యామ్ మెటాలిక్స్ అండ్ ఎనర్జీ: నెల్లూరులో రూ.3,678 కోట్లతో 3,200 ఉద్యోగాలు. 27. బాల్ బెవరేజెస్ ప్యాకేజింగ్: శ్రీసిటీలో రూ.633 కోట్లతో 117 ఉద్యోగాలు. 28. సాన్సో ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్: ఏలూరులో రూ.80 కోట్లతో 210 ఉద్యోగాలు. 29. ఆర్ఎస్‌బీ ట్రాన్స్‌మిషన్ లిమిటెడ్: శ్రీసిటీలో రూ.143.99 కోట్లతో 350 ఉద్యోగాలు. 30. వెంకటేశ్వర పేపర్ ప్రోడక్ట్స్: కృష్ణా జిల్లాలో రూ.63.61 కోట్లతో 100 ఉద్యోగాలు. 31. అనాడ్రోన్ సిస్టమ్స్: నెల్లూరులో రూ.221 కోట్లతో 350 ఉద్యోగాలు.

## అమరావతికి రాష్ట్రపతి ఆమోదం .. గెజిట్‌పై మంత్రి నారా లోకేశ్ భావోద్వేగ పోస్టు

మరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధానిపై నెలకొన్న అనిశ్చితికి తెరపడింది. ఏపీ ఏకైక రాజధానిగా అమరావతిని గుర్తిస్తూ ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) చట్టం-2026కు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏప్రిల్ 6న ఆమోదముద్ర వేశారు. రాష్ట్రపతి ఆమోదం అనంతరం కేంద్ర న్యాయ మంత్రిత్వ శాఖ సోమవారం రాత్రి అధికారిక గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. దీంతో అమరావతి చట్టబద్ధంగా ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా మారింది. అమరావతిని రాజధానిగా గుర్తించాలని మార్చి 28న ఏపీ అసెంబ్లీ చేసిన తీర్మానం మేరకు కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టింది. ఏప్రిల్ 1న లోక్‌సభ, ఏప్రిల్ 2న రాజ్యసభ ఈ బిల్లును ఆమోదించాయి. ఈ సవరణతో 2014 పునర్వ్యవస్థీకరణ చట్టంలోని సెక్షన్ 5(2)లో మార్పులు చేసి "కొత్త రాజధాని ఉంటుంది" అనే పదం స్థానంలో "అమరావతి కొత్త రాజధానిగా ఉంటుంది" అని చేర్చారు. ఈ పరిణామంపై ఏపీ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. 'ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ ఇది చారిత్రాత్మక రోజు. రాష్ట్రపతి ఆమోదంతో రాజధాని కల అధికారికంగా సాకారమైంది. రాష్ట్ర భవిష్యత్తు కోసం మద్దతుగా నిలిచిన ప్రధాని నరేంద్ర మోదీకి, బిల్లుకు మద్దతిచ్చిన ఎంపీలకు హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ చారిత్రాత్మక ఘట్టానికి మార్గం సుగమం చేసిన అమరావతి రైతుల ఓర్పు, త్యాగాలకు ప్రత్యేక వందనాలు' అని ఆయన ట్వీట్ చేశారు. ఈ నిర్ణయంతో రాజధాని మార్పుపై భవిష్యత్తులో ఎలాంటి సవరణ చేయాలన్నా అది పార్లమెంటు పరిధిలోనే ఉంటుంది.

## బీఆర్ఎస్ నేతలను నిర్బంధించడంపై కేటీఆర్ ఫైర్..

పరిగి నియోజకవర్గంలో తమ భూములను కాపాడుకోవడానికి పోరాడుతున్న రైతులకు మద్దతు తెలపడం నేరమా? అని కేటీఆర్ ప్రశ్నించారు. మాజీ మంత్రులు హరీశ్ రావు, సబితా ఇంద్రా రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మహేశ్ రెడ్డి, నరేందర్ రెడ్డి, వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ వంటి నేతలను అక్రమంగా నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని ఆయన అన్నారు. రైతుల ఆవేదనను వినాల్సింది పోయి, వారికి మద్దతుగా వస్తున్న విపక్ష నేతలపై ఆంక్షలు విధించడం ద్వారా ప్రభుత్వం తన బలహీనతను బయటపెట్టుకుంటోందని కేటీఆర్ విమర్శించారు. "అరెస్టులు, జైళ్లు, అక్రమ కేసులు బీఆర్ఎస్ నాయకులకు కొత్తేమీ కాదు. తెలంగాణ ఉద్యమ కాలం నుండి ఇలాంటి ఎన్నో ఆంక్షలను ఎదుర్కొన్నాం. ఎల్లప్పుడూ ప్రజల పక్షానే నిలబడతాం" అని స్పష్టం చేశారు. పరిగిలో ఇండస్ట్రియల్ పార్క్ పేరుతో రైతుల అనుమతి లేకుండా సాగిస్తున్న బలవంతపు భూసేకరణను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రైతుల ప్రయోజనాల కోసం బీఆర్ఎస్ ఎంతటి పోరాటానికైనా సిద్ధమని, బాధితులకు అండగా ఉంటామని చెప్పారు. అక్రమంగా నిర్బంధించిన నేతలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

## 'నీ పో, మోనే విజయన్!' అంటూ కేరళం సీఎంకు రేవంత్ కౌంటర్

మొదటి పేజి తరువాయి

70 ఏళ్ల కేరళ ప్రస్థానాన్ని తమ 28 నెలల పాలనతో పోల్చడం విజయన్ వంటి సీనియర్ నేత స్థాయికి తగదని హితవు పలికారు. గత 60 ఏళ్లుగా అన్ని ప్రభుత్వాల కృషి, గల్ఫ్ దేశాల నుంచి వస్తున్న విదేశీ మారకద్రవ్యం వల్లే కేరళంలో పేదరికం తగ్గిందని, ఆ ఘనత కేవలం ఎల్డీఎఫ్ ప్రభుత్వానిది కాదని రేవంత్ స్పష్టం చేశారు. తెలంగాణ ఏర్పడి 12 ఏళ్లే కాగా, అందులో 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలన, కేంద్రంలో బీజేపీ సృష్టించిన ఆర్థిక విధ్వంసం వల్లే రాష్ట్రంలో పేదరికం 5.88 శాతంగా నమోదైందని వివరించారు. తాను ఏప్రిల్ 7న తిరువనంతపురం వచ్చి, తమ ప్రభుత్వ 28 నెలల విజయాలను వ్యక్తిగతంగా వివరిస్తానని రేవంత్ తెలిపారు. కేరళం ఎదుర్కొంటున్న మేధోవలసలు, పారిశ్రామిక స్తబ్దత వంటి సమస్యలను రేవంత్ ప్రస్తావించారు. "కేరళం ప్రజలు నాకు నేర్పిన మాటను ఇప్పుడు పూర్తి ఆప్యాయతతో మీకు చెబుతున్నాను.. నీ పో, మోనే విజయన్! (వెళ్లు అబ్బాయ్ విజయన్!)" అంటూ రేవంత్ తన లేఖను ముగించారు.

## స్వర్ణాంధ్ర 2047 విజన్ దిశగా రాష్ట్రాన్ని నడిపిద్దాం

మొదటి పేజి తరువాయి

పార్లమెంటులో బిల్లు ఆమోదం పొంది, భారత ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసిన తర్వాత, గౌరవ రాష్ట్రపతి ఆమోద ముద్ర వేయడంతో ఆంధ్రప్రదేశ్ ప్రజల దశాబ్ద కాలపు నిరీక్షణకు తెరపడిందని పవన్ కల్యాణ్ అన్నారు. ఇకపై ఆంధ్రప్రదేశ్ రాజధాని విషయంలో ఎలాంటి సందిగ్ధత లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ చారిత్రక నిర్ణయం సాధ్యమవడానికి సహకరించిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబులకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ విజయం తమ భూములను త్యాగం చేసిన రైతులకు, పట్టుదలతో పోరాడిన ప్రజలకు చెందుతుందని కొనియాడారు. రాష్ట్ర విభజన జరిగిన 12 ఏళ్ల తర్వాత అధికారికంగా రాజధాని గుర్తింపు లభించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. గతంలో ఎదురైన అడ్డంకులు, అనిశ్చితిని విస్మరించి, అందరం కలిసి ప్రజల రాజధాని అమరావతిని నిర్మించుకుందామని పిలుపునిచ్చారు. భావి తరాల కోసం బలమైన పునాది వేసి, 'స్వర్ణాంధ్ర 2047' విజన్ దిశగా రాష్ట్రాన్ని నడిపిద్దామని అన్నారు. ఈ అధికారిక ప్రకటనతో అమరావతి నిర్మాణ పనుల్లో మరింత వేగం పుంజుకోనుందని, ఏపీ రాజకీయాల్లో ఇదొక కీలక మలుపు అని విశ్లేషకులు భావిస్తున్నారు.

## 55 ఏళ్ల క్రితం ఏం జరిగిందో ఆ దేశం గుర్తుంచుకోవాలి

మొదటి పేజి తరువాయి

కోల్‌కతాను లక్ష్యంగా చేసుకుంటామని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ హెచ్చరించారు. ఆయన వ్యాఖ్యలపై రాజ్‌నాథ్ సింగ్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ మేరకు ఆయన బెంగాల్‌లో ఒక మీడియా ఛానల్‌తో మాట్లాడుతూ, పాకిస్థాన్ రక్షణ మంత్రి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకుండా ఉండాల్సిందని అభిప్రాయపడ్డారు. 55 ఏళ్ల క్రితం ఏం జరిగిందో ఆ దేశం గుర్తుంచుకోవాలని హితవు పలికారు. 1971లో జరిగిన యుద్ధంలో పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ విడిపోయిన విషయం గుర్తుంచుకోవాలని అన్నారు. నాడు బంగ్లాదేశ్‌కు భారత సైన్యం అండగా నిలిచిందని గుర్తు చేశారు. ఆ సమయంలో పాకిస్థాన్ ఎన్నో పర్యావసనాలు ఎదుర్కొందని అన్నారు. ఇరుదేశాల మధ్య ఉద్రిక్తతలు పెంచే ప్రకటనలు చేయడం సరికాదని అన్నారు. బెంగాల్ లేదా కోల్‌కతాపై కన్నేస్తే పాకిస్థాన్ ఇంకెన్ని ముక్కలవుతుందోనని హెచ్చరించారు.

## రేవంత్‌తో చర్చకు దిగే ఉద్దేశం లేదు: పినరయి విజయన్ మీ హయాంలో ఏం చేశారో చూపించండి: రేవంత్‌రెడ్డి



తిరువనంతపురం: తనతో చర్చకు రావాలన్న సీఎం రేవంత్‌రెడ్డి సవాల్‌పై కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ స్పందించారు. ఆయనతో చర్చకు దిగే ఉద్దేశం తనకు లేదన్నారు. రేవంత్‌తో చర్చకు దిగేందుకు తెలంగాణలో పార్టీలు ఉన్నాయని, ఆయన ప్రభుత్వ పనితీరుపై అక్కడి ప్రజలే తీర్పునివ్వాలని వ్యాఖ్యానించారు. నీతి ఆయోగ్ 2023-24 సుస్థిరాభివృద్ధి లక్ష్యాల (ఎస్డీజీ) సూచీలో కేరళ తొలి స్థానంలో ఉందని పినరయి విజయన్ అంటున్నారని, ఇది కేరళలో ఏడు దశాబ్దాల ప్రభుత్వాలన్నింటి కృషి అని సోమవారం సీఎం రేవంత్ పేర్కొన్న సంగతి తెలిసిందే. అందులో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూడా ఉందని గుర్తించాలన్నారు. అందరి కష్టాన్నీ సొంత ఖాతాలో వేసుకోవడం సరికాదని హితవు పలికారు. ఈ అంశంపై చర్చించేందుకు సిద్ధంగా ఉన్నానని, చర్చకు రావాలని పినరయి విజయన్‌కు సవాల్ విసిరారు.

మీ హయాంలో ఏం చేశారో చూపించండి: రేవంత్‌రెడ్డి

తెలంగాణ ప్రభుత్వ పనితీరును విమర్శిస్తూ కేరళ సీఎం పినరయి విజయన్ రాసిన లేఖపై సీఎం రేవంత్‌రెడ్డి మరోసారి స్పందించారు. కేరళ ప్రభుత్వ పనితీరుపై తన విమర్శలను ఎంతో గౌరవప్రదంగా, హుందాగా వ్యక్తం చేశానని అన్నారు. విజయన్ మాత్రం తక్కువ స్థాయి భాషను ఉపయోగించాలని నిర్ణయించుకున్నట్లు చెప్పారు. " మీ అసహనపూరిత వ్యాఖ్యలకు నేను అదే రీతిలో స్పందించను. మీరు నా రాష్ట్రానికి వచ్చినప్పుడు, ఒక అతిథికి చేయాల్సిన అన్ని మర్యాదలు చేస్తానని మాట ఇస్తున్నా. ప్రస్తుత తెలంగాణ పరిస్థితికి మీరు నీతి ఆయోగ్ ఎస్డీజీ ఇండెక్స్ 2023-24ని ప్రామాణికంగా చూపిస్తున్నారు. ఆ సూచీ డిసెంబర్ 2023తో ముగిసిన బీఆర్ఎస్ పదేళ్ల దుష్పరిపాలనను ప్రతిబింబిస్తుంది. మా ప్రభుత్వం 28 నెలలు పూర్తి చేసుకుంది. 2024-25లో తెలంగాణ జీఎస్డీపీ రూ.16.12 లక్షల కోట్లుగా ఉండి.. 10.7 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఇది జాతీయ సగటు 9.9 శాతం కంటే ఎక్కువ. కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, కేరళలను అధిగమించి భారత్‌లోనే అత్యధిక తలసరి ఆదాయం ఉన్న రాష్ట్రంగా తెలంగాణ నిలిచింది. కేరళ ప్రజలకు మీ హయాంలో ఏం జరిగిందో చూపించండి" అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

## ఏబీఎన్-ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీ దాడి దుర్మార్గం

పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్

-అమరావతిపై జగన్ వైఖరిని ప్రశ్నించినందుకు మీడియాపై దాడి




పెనమలూరు, ఏప్రిల్ 7 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) :రౌడీ మూకలతో కలిసివైసీపీ మాజీ మంత్రులు మీడియా సంస్థలపైకి వెళ్లడం ఆ పార్టీ విష సంస్కృతికి నిదర్శనమని పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. హైదరాబాద్‌లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీ దాడి యత్నాన్ని పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బోడే ప్రసాద్ తీవ్రంగా ఖండించారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీ నేతలు,రౌడీలు దాడికి దిగడం మీడియా స్వేచ్ఛపై దాడిగా ఎమ్మెల్యే అభివర్ణించారు. సొంతగా మీడియా సంస్థలను నడుపుతూ మీడియాను అడ్డుపెట్టుకుని అనైతిక చర్యలకు పాల్పడుతోన్న వైసీపీ తమను ప్రశ్నించిన ఆంధ్రజ్యోతిపై ఆరోపణలు, దూషణలు చేయడం అసంబద్ధం అన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో మీడియా సంస్థలపై,ఆంధ్రజ్యోతిపై అనేక వేధింపులకు, కుట్రలకు పాల్పడినా నిబ్బరంగా నిలిచాయి తప్ప భయపడలేదని ఎమ్మెల్యే గుర్తు చేశారు. రౌడీ మూకలను వెంటేసుకుని స్వయంగా ఎమ్మెల్యేలు,మాజీ మంత్రులు మీడియా కార్యాలయంపైకి వెళ్లడం వైసీపీ రౌడీ సంస్కృతికి నిదర్శం అని వ్యాఖ్యానించారు. ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ దశాబ్ధాలుగా కేసులకు,దాడులకు, ఒత్తిళ్లకు భయపడకుండా పత్రికను,ఛానెల్‌ను నడుపుతున్నారన్నారు.దాడులు,నిరసనలు, బెదిరింపులతో మీడియాను భయపెట్టాలనే వైసీపీ రాజకీయాలకు కాలం చెల్లిందని బోడే ప్రసాద్ స్పష్టం చేశారు. అధికారంలో ఉండగా మహిళల పట్ల,సొంత కుటుంబ సభ్యుల పట్ల వైసీపీ నాయకులు,ఆ పార్టీ అధ్యక్షుడు వ్యవహరించిన తీరును మహిళా సమాజం ఎప్పటికీ మర్చిపోదన్నారు. రాజధానిపై వైసీపీ కుట్రలను ప్రశ్నించిన ఆంధ్రజ్యోతి సంపాదకీయానికి సమాధానం చెప్పలేక దాడులు,నిరసనలతో వైసీపీ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతోందని పెనమలూరు శాసనసభ్యులు బోడే ప్రసాద్ దుయ్యబట్టారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి శివరామ ప్రసాద్ గౌడ్ రాష్ట్ర అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పితా గోపీచంద్ మండల పార్టీ అధ్యక్షులు కోయ ఆనందప్రసాద్ తెలుగు రైతు కార్యదర్శి కుర్ర నరేంద్ర బిసి సెల్ అధ్యక్షులు సంగేపు రంగారావు బొంగరాల అబ్రహం జయరాజు మోరం భరద్వాజ్ నాగుల్ మీరా షేక్ సలీం కొక్కిలిగడ్డ నాగేశ్వరరావు కూటమి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## రుషికొండ భవనాల వినియోగంపై నివేదిక సిద్ధం



అమరావతి, ఏప్రిల్ 7 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) విశాఖ రుషికొండ భవనాల వినియోగంపై ఏర్పాటైన కేబినెట్ సబ్ కమిటీ తమ అధ్యయన తుది నివేదికను సిద్ధం చేసింది. సచివాలయంలోని మంత్రి కందుల దుర్గేశ్ కార్యాలయంలో సబ్ కమిటీ ఐదోసారి భేటీ అయ్యింది. మంత్రులు పయ్యావుల కేశవ్, డోలా బాలవీరాంజనేయస్వామి వర్చువల్గా హాజరయ్యారు. గత నాలుగు భేటీల్లో తీసుకున్న నిర్ణయాలపై చర్చించిన మంత్రులు.. పరిగణనలోకి తీసుకోవాల్సిన అంశాలపై తుది నివేదిక సిద్ధం చేశారు.రుషికొండ ప్యాలెసను ప్రజల సందర్శనకు అనుమతించడంతోపాటు ప్రభుత్వానికి ఆదాయ వనరుగా మార్చే దిశగా చర్చలు జరిగాయి. ఈ భవనాల నిర్వహణకు తాజ్, అట్మాస్ఫియర్ కోర్, లీలా, ఫెమా వంటి అంతర్జాతీయ హోటల్ గ్రూపులు ఆసక్తి చూపుతున్న దృష్ట్యా.. వాటికి అవకాశం కల్పించే అంశంపై కమిటీ చర్చించింది. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు, రాష్ట్ర కేబినెట్లో చర్చించి, తుది నిర్ణయం తీసుకుంటామని మంత్రి దుర్గేశ్ తెలిపారు.

## దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఇళ్లలో ఏసీబీ సోదాలు



గుంటూరు, ఏప్రిల్ 7 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) విజయవాడ, గుంటూరు జిల్లాలో అవినీతి నిరోధక శాఖ అధికారులు చేస్తున్న ఆకస్మిక దాడులు కలకలం రేపుతున్నాయి. తాడేపల్లిలో నివాసం ఉంటున్న ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ కలిగిరి శాంతి ఇళ్లలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం ఆమె నివాసానికి చేరుకున్న ఏసీబీ బృందాలు పలు కీలక పత్రాలు, ఆస్తుల వివరాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఆదాయానికి మించిన ఆస్తుల ఆరోపణల నేపథ్యంలో ఈ సోదాలు జరుగుతున్నాయి. విజయవాడ, తాడేపల్లిలోని శాంతికి చెందిన మూడు ఇళ్లలో కూడా సోదాలు కొనసాగుతున్నాయి.

## కందుల కొనుగోలు గడువు మే 4 వరకు పొడిగింపు

-మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు



అమరావతి, ఏప్రిల్ 7 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) రాష్ట్రంలో కందుల కొనుగోలు గడువు మే 4 వరకు పొడిగించడం జరిగిందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వెల్లడించారు. ఖరీఫ్ 2025-26 సీజన్‌కు సంబంధించి కందులు (రెడ్ గ్రామ్/తూర్) కొనుగోలు గడువును కేంద్ర ప్రభుత్వం పొడిగించడం రైతులకు ఎంతో ఊరటనిచ్చే నిర్ణయం అని అన్నారు. రాష్ట్రంలో ధర మద్దతు పథకం కింద కొనుగోలు కొనసాగుతుందని మంత్రి తెలిపారు. కొనుగోలు గడువును పొడిగించాలన్న ముఖ్యమంత్రి చంద్రబాబు విజ్ఞప్తిని పరిశీలించిన కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ, మే 4 వరకు పొడిగింపునకు ఆమోదం తెలిపిందన్నారు. రైతులు తమ పంటను నష్టపోకుండా విక్రయించుకునేలా చూడటం కూటమి ప్రభుత్వ బాధ్యత. రైతు పండించిన ప్రతి గింజకు గిట్టుబాటు ధర అందేలా ముఖ్యమంత్రి నిరంతరం కృషి చేస్తున్నారు అని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ప్రభుత్వం వెంటనే స్పందిస్తోంది. పంటల కొనుగోలు, గిట్టుబాటు ధర, మార్కెటింగ్ వంటి అన్ని అంశాల్లో రైతులకు న్యాయం జరిగేలా చర్యలు కొనసాగిస్తాము అని మంత్రి అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

## గుడివాడలో 17వ అదనపు జిల్లా కోర్టు ఏర్పాటు

గుడివాడ, ఏప్రిల్ 7,( అజయ్ నారగాని - నేటి శుభోదయ) గుడివాడ పట్టణంలో నూతనంగా 17వ అదనపు సెషన్సు జిల్లా కోర్టును ఏర్పాటు చేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ న్యాయశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గుడివాడలో ఇప్పటికే 11వఅదనపు జిల్లా కోర్టు ఉంది. నూతనంగా ఏర్పడిన పోస్టుల ద్వారా గుడివాడకు మరో కోర్టుఅనగా 17వ అదనపు జిల్లా సెషన్సు కోర్టు రావడంతో గుడివాడ న్యాయవాదులు, ప్రజలుహర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సుబ్బారాయుడికి విరాళంగా వెండి బిస్కెట్లు



మోపిదేవి, ఏప్రిల్ 7 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) మోపిదేవి గ్రామంలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానానికి ఉయ్యూరు మండలం, ఆకునూరు గ్రామానికి చెందిన వెలగపూడి లక్ష్మీప్రసాద్ భక్తిశ్రద్ధలతో వెండి బిస్కెట్లు ఐదు (మొత్తం బరువు సుమారు 1 కిలో, అంచనా విలువ రూ. 3,25,000ల ను) స్వామివారికి కానుకగా సమర్పించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు కి ఈ కానుకలను అందజేశారు. అనంతరం దాతలకు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ మర్యాదలతో సత్కరించారు.

# నీటి సంరక్షణకు 'జలధార' ఉద్యమం

-రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

-రాష్ట్ర వ్యాప్తంగా వంద రోజుల కార్యాచరణ

-కాలువలు, చెరువుల్లో పూడికతీతలు, మరమ్మతులు

-ప్రతి ఎకరాకూ నీరందిస్తాం

-నీటి బొట్టుతో సంపద సృష్టి.. ఇదే చంద్రబాబు లక్ష్యం




సోమందేపల్లి, ఏప్రిల్ 7 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) నీటితోనే సంపద సృష్టించొచ్చాలనేది సీఎం చంద్రబాబు సంకల్పమని, అందుకనే ప్రతి నీటి బొట్టునూ సద్వినియోగం చేసుకోవాలన్న లక్ష్యంతో జలధార కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెరువులు, సాగునీటి కాలువల్లో పూడికతీత, మరమ్మతులు, ఇంకుడు గుంతల నిర్మాణం వంటి పనులను ఈ కార్యక్రమంలో చేపట్టనున్నారు. రాష్ట్రంలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదలకు రైతులు, సాగునీటి సంఘాల భాగస్వామ్యంతో కలిసి వంద రోజుల ప్రణాళికలను రూపొందించారన్నారు. శ్రీసత్యసాయి జిల్లా సోమందేపల్లి మండలం చాలకూరు గ్రామం సమీపంలోని చెరువులో సోమవారం ఏర్పాటు చేసిన జలధార కార్యక్రమంలో మంత్రి సవిత పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలో నీటి సంరక్షణకు పెద్ద ఎత్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా నీటి సంరక్షణకు 100 రోజుల పాటు జలధార ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ కార్యాచరణ ద్వారా రాష్ట్రంలో నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుదలతో ప్రతి ఎకరాకూ సాగునీరందించాలన్నది ప్రధాన ఉద్దేశమన్నారు. వంద రోజుల పాటు సాగే ఈ కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెరువులు, సాగునీటి కాలువల్లో పూడికతీతలతో పాటు మరమ్మతులు, ఇంకుడు గుంతలు తవ్వుతామన్నారు. ప్రతి నీటి బొట్టునూ ఒడిసిపట్టి, భూగర్భ జలాలను పెంచడం, తక్కువ నీటితో ఎక్కువ పంట పండించే విధానాన్ని (డ్రిప్ ఇరిగేషన్) ప్రోత్సహించడం, చెరువుల్లోని మట్టిని పొలాలకు తరలించడం, పంట కుంటల నిర్మించడం వంటి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. నీటి సంరక్షణను ఉద్యమం చేపట్టామని, రైతులు, సాగునీటి సంఘాల భాగస్వామ్యంతో నీటి సంరక్షణ ఉద్యమం చేపట్టామన్నారు. రాష్ట్రాన్ని కరవు రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వం ప్రధాన ఉద్దేశమన్నారు.

### పెట్రేగిపోతున్న వైసీపీ బ్యాచ్

అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ పార్లమెంట్ ఆమోదించడం, ఆ వెంటనే రాష్ట్రపతి గెజిట్ నోటిఫికేషన్ విడుదల కావడంతో జగన్, ఆయన పార్టీ నేతలు సహించలేకపోతున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. మావిగన్ అంటూ అమరావతిపై జగన్ మరోసారి విషం కక్కారన్నారు. రాజధానిపై పూటకో మాట, గంటకో మాట ఆడుతుండడంతో ప్రజలు జగన్ పై తీవ్రంగా విరుచుకువడుతున్నారన్నారు. అమరావతిపై కుట్రలు పన్నడం తప్పు అని చెప్పడంతో, వైసీపీ బ్యాచ్ సహించలేకపోతోందన్నారు. మీడియా సంస్థలపైనా, ప్రజలపైనా దాడులకు దిగుతున్నారని మండిపడ్డారు. ప్రజాభీష్టానికి అనుగుణంగా వ్యవహరించాల్సిందిపోయి, జగన్, ఆయన అనుచరులు చేస్తున్న దౌర్జన్యాలను, దాడులను చూస్తూ ఊరుకునేది లేదని మంత్రి సవిత హెచ్చరించారు.

### వేరుశెనగ రైతులతో ముచ్చట

జలధార కార్యక్రమం అనంతరం చెరువు పక్కనే ఉన్న వేరు శనగ పంట భూములను మంత్రి సవిత పరిశీలించారు. ఎంతమేర సాగు చేశారు.పంట దిగుబడి గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. రైతుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు అధిక ప్రాధాన్యమిస్తున్నారన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా చర్యలు తీసుకొంటున్నారన్నారు. అన్నదాత సుఖీభవ నిధులతో డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు అందజేస్తున్నారన్నారు. రూ.30 వేల కోట్లతో రాయలసీమను హార్టీకల్చర్ హబ్ గా అభివృద్ధి చేస్తున్నారని, రాయసీమలో సాగునీటి ప్రాజెక్టులకు నిధులు వెచ్చిస్తున్నారని మంత్రి సవిత వెల్లడించారు. కూటమి ప్రభుత్వ పాలనపై రైతులు సంతృప్తి వక్తంచేయడంతో మంత్రి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# పత్రికా కార్యాలయాలపై దాడులు ప్రజాస్వామ్యానికే గొడ్డలిపెట్టు

- విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

-ఏబీఎన్, ఆంధ్రజ్యోతి కార్యాలయాలపై దాడులను తీవ్రంగా ఖండించిన ఏపీ ప్రభుత్వ విప్

గత ప్రభుత్వంలో నాపై అక్రమంగా హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టారు : యార్లగడ్డ

-లోకేష్ పాదయాత్రలో పాల్గొన్నందుకే నాపై కక్షసాధింపు చర్యలు : యార్లగడ్డ

-అక్రమ కేసుల వల్ల 18 నెలల పాటు నా పాస్‌పోర్ట్ నిలిచిపోయింది : యార్లగడ్డ




మచిలీపట్నం, ఏప్రిల్ 7 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) పత్రికా కార్యాలయాలపై దాడులు ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు అని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. మచిలీపట్నం కోర్టుకు వచ్చిన ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆంధ్రజ్యోతి, ఏబీఎన్ కార్యాలయాలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. గతంలో పార్టీ కార్యాలయాలపై దాడులు చేసిన వైఎస్సార్సీపీ శ్రేణులు ఇప్పుడు పత్రికా కార్యాలయాలపై కూడా దాడులకు దిగడం సిగ్గుచేటని పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో ముట్నూరి కృష్ణారావు మచిలీపట్నం కేంద్రంగా ఆంధ్ర పత్రికను నడిపినప్పుడు బ్రిటిష్ పాలకులు కూడా ఇలాంటి చర్యలకు పాల్పడలేదని గుర్తు చేశారు. ఎడియాను ఫోర్త్ ఎస్టేట్‌గా గౌరవించాలే తప్ప కార్యాలయాల ధ్వంసం అనాగరికమని, ఇలాంటి చర్యల వల ప్రజల్లో విశ్వాసం కోల్పోతారని హెచ్చరించారు. ఏబీఎన్ యాజమాన్యానికి తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.గత వైఎస్సార్సీపీ పాలనలో తనపై అక్రమంగా హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ వంటి తప్పుడు కేసులు బనాయించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. లోకేష్ పాదయాత్రలో పాల్గొన్నందుకు ఈ కేసులు పెట్టారని, దీని కారణంగా 18 నెలల పాటు తన పాస్‌పోర్ట్ రాక అమెరికాలో ఉన్న వ్యాపారాలను చూసుకోవడానికి వెళ్లలేకపోయానని తెలిపారు. ఇటీవల హైకోర్టు ఆదేశాల మేరకు పాస్‌పోర్ట్ లభించిందని... దిగువ కోర్టు ఆదేశాల ప్రకారం నడవాలని సూచించారని తెలిపారు. అమెరికా ప్రయాణానికి సంబంధించిన తేదీలు, వివరాలు ఇవ్వాలని విజయవాడ కోర్టు, మచిలీపట్నం కోర్టు కోరిందని తెలిపారు. అవసరమైన పత్రాలు సమర్పించిన అనంతరం, కోర్టు అనుమతితో 18 నెలల తర్వాత అమెరికా వెళ్లే అవకాశం లభించిందని వెల్లడించారు. కేడీసీసీ బ్యాంక్ చైర్మన్‌గా ఉన్న సమయంలో బ్యాంకును గణనీయంగా అభివృద్ధి చేశానని పేర్కొన్నారు. బ్యాంకు టర్నోవర్‌ను 5,200 కోట్ల నుండి 9,000 కోట్లకు పెంచడమే కాకుండా, 15 కోట్ల లాభాల నుండి 115 కోట్లకు తీసుకువెళ్లానని తెలిపారు. సుమారు 150 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించి, 4 లక్షల మంది రైతులకు సేవలు అందించామని చెప్పారు. ఎమ్మెల్యే పదవి కంటే కేడీసీసీ చైర్మన్‌గా ప్రజలకు నేరుగా సేవ చేసే అవకాశం ఎక్కువగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. రైతు నేస్తం పథకం ద్వారా కృష్ణా జిల్లా రైతులకు 1200 కోట్ల రూపాయల మేర లబ్ధి చేకూర్చిన విషయాన్ని గుర్తు చేశారు.జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య, భోగరాజు పట్టాభి సీతారామయ్య, ముట్నూరి కృష్ణారావు, విశ్వనాథ సత్యనారాయణ, అయ్యదేవర కాళేశ్వరరావు వంటి మహనీయుల విగ్రహాలను జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహనీయులు తమ ఆస్తులు, జీవితాలను సమాజం కోసం అంకితం చేశారని, వారిని గౌరవించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని అన్నారు. వారి విగ్రహాలు ఏర్పాటు చేసే వరకు జిల్లా పరిషత్ సమావేశాలను బహిష్కరిస్తానని స్పష్టం చేశారు. భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనానికి కేడీసీసీ బ్యాంక్, ప్రభుత్వం ద్వారా నిధులు అందేలా ముఖ్యమంత్రితో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలను గౌరవించాలని, తప్పుడు కేసులతో రాజకీయ కక్షసాధింపులకు పాల్పడటం మానుకోవాలని ఆయన హితవు పలికారు.

## విద్యార్థుల వేసవి శిక్షణా శిబిరాలలో భాషాభివృద్ధికి కృషి చేయాలి

-సాహితీ మిత్రులు కన్వీనర్ వసుధ



గుడివాడ, ఏప్రిల్ 7 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) సాహిత్య సభలు సన్మాన సత్కార కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించే సాహితీ సంస్థలు భాషా సాహితీ రంగాలలో విద్యార్థులకు అవగాహన కలిగించేందుకు వేసవి శిక్షణా తరగతుల నిర్వహణకు ముందుకు రావాలని గుడివాడ సాహితీమిత్రులు సంస్థ కన్వీనర్ వసుధ బసవేశ్వర రావు సూచించారు. వేసవి సెలవులలో పాఠశాల, కళాశాల విద్యార్థులకుసంగీతం నృత్యం గానం చిత్రలేఖనం తదితర కళలలో శిక్షణ ఇస్తూ ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణ శిబిరాలను నిర్వహించడం ద్వారా వివిధ ప్రభుత్వ ప్రయివేటు సంస్థలు ఏటా కృషి చేస్తున్నాయన్నారు. మరి సాహిత్య రంగంలో విద్యార్థులకు పద్యాలు, కవితలు , కథలు,బాల కథలు,చిన్నారి కవితలు చిరు వ్యాసాలు వంటి వాటిని నేర్పించేందుకు ఏ సంస్థలు లేవు. ఈ దశ లో ఈ కొరత తీర్చేందుకు విద్యార్థులలో తెలుగు భాషా సాహిత్యాల పట్ల,తెలుగులో రచనలు చేయడం పట్ల ఆసక్తిని పుట్టించడానికి, వున్న ఆసక్తిని పెంపొందించి రచనలు చేయించడానికి సాహితీ సంస్థలు కృషి చేయాలన్నారు. విద్యార్థులు తెలుగు భాషకు దూరమవుతున్న తరుణంలో ఇటువంటి చర్యలు ప్రస్తుతం అవసరమని అభిప్రాయపడ్డారు. గుడివాడ సాహితీ మిత్రులు సంస్థ తన వంతు కృషి చేస్తుందని ఆ సంస్థ కన్వీనర్ వసుధ ప్రకటించారు. భాషా సాహిత్యాల పట్ల అభిరుచి ఆసక్తి కలవారు 9490832787 నెంబరు కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలని కోరారు.

## ఈనెల 16,17,18తేదీలలో జరిగే 17వ ఉరుసు గ్రంథ మహోత్సవాలను జయప్రదం చేయండి

- రాష్ట్ర లిమ్రా యూత్ ఆర్గనైజషన్ చైర్మన్ అసిఫ్ పాషా



పెదకాకాని, ఏప్రిల్ 7 (అజయ్ నారగాని - నేటి శుభోదయ ) పెదకాకాని లోని కరీముల్లా బాబా నిషాని వ్యవస్థాపకులు పఠాన్ మహబూబ్ సుభాని ఆధ్వర్యంలో కరీముల్లా బాబా 17వ ఉరుసు గ్రంథ మహోత్సవాలు ఈనెల 16,17,18వ తేదీలలో మూడు రోజుల పాటు జరుగుతాయని రాష్ట్ర లిమ్రా యూత్ ఆర్గనైజేషన్ చైర్మన్ ఎండి. అసిఫ్ పాషా తెలిపారు.16వ తేదీ గురువారం రాత్రి కంబల్ ఫాతేఫా, 17వ తేదీన గంధం మహోత్సవం , 18వ తేదీన దీపారాధన జరుగుతుందన్నారు. మూడు రోజుల పాటు జరిగే మహోత్సవాలల్లో అసిఫ్ అండ్ బ్రదర్స్ ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అందరు మహోత్సవాల్లో పాల్గొని జయప్రదం చేయాలనీ విజ్ఞప్తి చేశారు.



## నిరుపేదలకు అండగా మేమున్నాం సేవా సంస్థ ఉంటుంది తోడుగా




పెడన, ఏప్రిల్ 7 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) కృష్ణాజిల్లా పెడన పట్టణం ఒకటవ వార్డు కొత్త కాలనీలో నివాసముంటున్న రిక్షా కార్మికుడు సూరవరపు పేరయ్య గత కొన్ని రోజుల నుంచి ముక్కు సంబంధిత దీర్ఘ కాలిక అనారోగ్యం కారణం చేత బాధపడుతున్నారని తెలుపగా, తక్షణ సహాయం అందించే మేమున్నాం సేవా సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ శ్రీనివాస్ వీణం ఆధ్వర్యంలో కొంత ఉపశమనం మేరకు సహాయ చర్యలలో భాగంగా మందుల కోసం రూ 5000ల నగదు, రెండు నెలలకు సరిపడా పచారి సరుకులు పేషెంట్ కుటుంబ సభ్యులకు అందించి మనోధర్యం కల్పించడం జరిగింది. రిక్షా కార్మికులు పేరయ్య అనారోగ్య విషయం తెలిసిన వెంటనే స్పందించి ఇంతటి దయార్థ హృదయంతో సంస్థ నుండి సహాయం అందించి, చూపిన చొరవకు సంస్థ సభ్యులకు పేరయ్య కుటుంబ సభ్యులు,భంధువులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమానికి సంస్థ సభ్యులు శ్రీనివాస్ వీణం, పిచ్చుక సతీష్ పట్టిసపు పవన్ కళ్యాణ్, నల్ల సాయిబాబు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

## బిజెపి జెండా ఆవిష్కరించిన పార్టీ మండల అధ్యక్షుడు అడపా సుధీర్ కుమార్

- గ్రామ గ్రామాన బీజేపీ 'మన ఊరు.. మన జెండా'..!!



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి ( ఏ.కె.); భారతీయ జనతా పార్టీ వ్యవస్థాపక దినోత్సవం వేడుకలు ప్రతి కార్యకర్త ఘనంగా నిర్వహించాలని మండల పార్టీ అధ్యక్షులు అడపా సుధీర్ కుమార్ పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ, ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా పార్టీ జెండా ఆవిష్కరించినట్లు తెలియజేశారు. భారతీయ జనతా పార్టీ కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలో మూడుసార్లు ప్రధానమంత్రి బాధ్యతలు నిర్వర్తించారని తెలియజేశారు. సమర్థవంతంగా పాలన సాగిస్తూ, ప్రపంచ దేశాల సరసన అగ్రగామి దేశంగా ఉండేలా పని చేస్తున్నారని తెలియజేశారు. రాష్ట్ర పార్టీ అధ్యక్షులు మాధవ్ ఆదేశాల మేరకు మా ఊరు మన జెండా ఆవిష్కరించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. రెండు నెలల పాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా మండలంలో ప్రతి గ్రామంలో జెండా ఆవిష్కరించే విధంగా కార్యకర్తలు సేవలందించాలన్నారు. కొంతమంది వ్యక్తిగత అజెండాతో ముందుకు వెళ్తున్నారని అవి పార్టీకి సంబంధం లేదన్నారు. మండల పార్టీ అధ్యక్షుడిగా తాను, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర, సీనియర్ నాయకులు ఏపీ ఆర్ చౌదరి, నీరుకొండ వీరన్న చౌదరి ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ కార్యక్రమాలు మరింత ముమ్మరంగా జరుగుతాయని సుధీర్ కుమార్ తెలియజేశారు.

# గూగుల్ ఏఐ హబ్‌కు 28 న భూమిపూజ

అమరావతి, నేటి శుభోదయ ::: ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక రంగంలో ఒక చారిత్రాత్మక ఘట్టానికి తెరలేవ బోతోంది. ప్రపంచ టెక్ దిగ్గజం గూగుల్ ఆంధ్రప్రదేశ్‌లో తన భారీ ఏఐ హబ్ నిర్మాణానికి ముహూర్తం ఖరారు చేసింది. సుమారు 15 బిలియన్ డాలర్లు అంటే దాదాపు రూ 1.25 లక్షల కోట్ల భారీ పెట్టుబడితో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు ఈనెల ఏప్రిల్ 28న అధికారికంగా శంకుస్థాపన జరగనుంది. విశాఖపట్నం సమీపంలో మూడు వేర్వేరు ప్రాంతాల్లో ఈ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఇప్పటికే 601.4 ఎకరాల భూమిని కేటాయించింది. ఈ భారీ ప్రాజెక్టు ద్వారా రాష్ట్రంలో వేలాది మంది ఐటీ నిపుణులకు ఉపాధి అవకాశాలు లభించడమే కాకుండా, ఏపీ గ్లోబల్ టెక్ హబ్‌గా మారేందుకు దోహదపడనుంది. ఈ ప్రతిష్టాత్మక శంకుస్థాపన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేష్ పాల్గొననున్నారు. గూగుల్ ప్రతినిధుల తరపున గూగుల్ క్లౌడ్ సీఈవో థామస్ కురియన్ స్వయంగా హాజరై ప్రాజెక్టు పనులను ప్రారంభించ నున్నారు. గూగుల్ ప్రతినిధులతో మంత్రి లోకేష్ జరిపిన చర్చలు సఫలమవ్వడం, ప్రభుత్వం కల్పించిన వేగవంతమైన అనుమతుల వల్లే ఇంతటి భారీ పెట్టుబడి రాష్ట్రానికి వచ్చింది. ఈ ఏఐ హబ్ కేవలం ఏపీకే కాకుండా, దక్షిణ భారతదేశం మొత్తానికి డేటా స్టోరేజ్, క్లౌడ్ కంప్యూటింగ్ రంగంలో వెన్నెముకగా నిలవనుంది. ప్రభుత్వ అంచనాల ప్రకారం, ఈ ప్రాజెక్టు నిర్మాణం వేగంగా పూర్తి చేసి జూలై 2028 నాటికి అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఈ డేటా సెంటర్ వల్ల విశాఖ తీరం ఒక సరికొత్త డిజిటల్ కారిడార్ గా రూపుదిద్దుకోనుంది. ఏపీని ఐటీ రంగంలో అగ్రగామిగా నిలపాలన్న ప్రభుత్వ సంకల్పానికి గూగుల్ వంటి గ్లోబల్ బ్రాండ్ రాక పెద్ద ఊపునిస్తుందని ఐటీ వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి. శంకుస్థాపన ముగిసిన వెంటనే యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించేందుకు గూగుల్ తన ఇంజనీరింగ్ బృందాలను ఇప్పటికే రంగంలోకి దించింది. నిర్మాణ పనులను అదానీ సంస్థ చూస్తోంది.

## కోరుకొండ అల్లూరి సీతారామరాజు విగ్రహం జంక్షన్లో ఘనంగా భారతీయ జనతా పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం

**స్వీట్లు పంచి బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు జరిపిన నాయకులు, కార్యకర్తలు**




కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి (ఏ.కె.); భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కోరుకొండ అల్లూరి సీతారామరాజు విగ్రహం వద్ద ఉన్న భారతీయ జనతా పార్టీ స్థూపం వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమం వేడుకగా నిర్వహించారు. బిజెపి సీనియర్ నాయకులు పసుపులేటి బాపిరాజు చేతుల మీదగా జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం స్వీట్లు పంచి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు తగరంపూడి గణపతి, పచ్చారి నరసింహమూర్తి, బిజెపి సీనియర్ నాయకులు తిరుమల నాధుని వెంకటేశ్వరరావు, వైజర్చు రాందేవ్, చీర్ల ఆది విష్ణు, కోరుకొండ మండల కార్యదర్శి చింతల దేవి కన్నారావు, కొటికలపూడి సీతారాముడు, తోకాడ అడివి రాజు, మల్లి వెంకటేశ్వర్ల, తదితర బిజెపి కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు...

## టేకులూరులోసి.సి,రోడ్డు పనులు ప్రారంభం!..

**ఎం.పి.పి.కారం లక్ష్మి!..**



వి.ఆర్.పురం, ఏప్రిల్ 7(నేటి శుభోదయ ప్రతినిది)మండలంలో కుందలూరు,పంచాయతీ పరిధిలో గల టేకులూరు,గ్రామంలో మంగళవారంనాడు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. సుమారు 850 మీటర్ల పొడవునా నిర్మించనున్న సిమెంట్ కాంక్రీట్ (సీసీ) రోడ్డు పనులను మండల పరిషత్ అధ్యక్షురాలు,ఎం.పి.పి, కారం లక్ష్మి,సి.పి.ఎం,పార్టీ బృందంతో కలిసి అధికారికంగా ప్రారంభించారు.నాణ్యత విషయంలో రాజీ పడొద్దు ఈ సందర్భంగా ఎం.పి.పి కారం లక్ష్మి,మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనులు చేపడుతోందని తెలిపారు.ఈరోడ్డు నిర్మాణంలోఎటువంటిఅవకతవకలు జరగకూడదని,నిర్ణీత ప్రమాణాలప్రకారం పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.పనులు జరుగుతున్నతీరును ప్రజలు కూడా ఎప్పటికప్పుడు గమనించాలని,నాణ్యత లోపం లేకుండాచూడాలని ఆమె సూచించారు.ఈకార్యక్రమంలోసి.పి.ఎం,పార్టీ నాయకులు సోయం చిన్నబాబు,మండల కార్యవర్గ సభ్యులు వడ్లాది రమేష్,తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు బొర్రా నరేష్ కుమార్, మండల కార్యదర్శి పాయం రామారావు,ఎం.పి.డి.ఓ, ఇమ్మానుయేలు, సచివాలయం సిబ్బంది వివిధ పార్టీ నాయకులు గ్రామస్తులు భూమిరెడ్డి,నాగార్జున రెడ్డి,నరేందర్ రెడ్డి,రోడ్డుసౌకర్యం అందుబాటులోకి రానుండటంతో టేకులూరు, గ్రామస్తులు హర్షంవ్యక్తం చేస్తున్నారు..

## మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రాధాకృష్ణ వెంటనే క్షమాపణ చెప్పాలి

**వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి గుల్లా ఏడుకొండలు.**



గోకవరం-నేటిసుబోదయ.: మీడియా ముసుగులో చంద్రబాబుకు మొదటి నుంచి బ్రోకరిజం చేస్తున్న వ్యక్తి ఏబీఎన్ రాధాకృష్ణ అని వైఎస్ఆర్సిపి రాష్ట్ర కార్యదర్శి గుల్లా ఏడుకొండలు అన్నారు. మహిళలను కించపరిచేలా రాధాకృష్ణ వ్యక్తిగత దూషణలకు దిగటం తీవ్ర ఆక్షేపణీయమని ఆయన మండిపడ్డారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ రాధాకృష్ణ బ్రోకర్ పనులు చేసి ఎదిగారని గుర్తు చేశారు. పత్రికను అడ్డుపెట్టుకుని బ్రోకరిజం చేసేవారని ఏడుకొండలు అన్నారు. అలాంటి నీచ చరిత్ర ఉన్న రాధాకృష్ణ మహిళల గురించి వైఎస్ఆర్సిపి గురించి నీచంగా మాట్లాడుతున్నారన్నారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో కొత్త పలుకు పేరుతో రాధాకృష్ణ చెత్త పలుకులు పలికారని భార్యలు మహిళలు గురించి ఇలాంటి నీచమైన రాతలు రాయడం మహిళా లోకాన్ని మరింత అవమానం చేయడం నీకు తగునా అని నిలదీశారు. ఏబీఎన్ రాధాకృష్ణ ఇకనైనా బుద్ధి తెచ్చుకోవాలని మహిళలపై తప్పుడు రాతలు రాసినందుకు తక్షణమే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

## సర్వేపల్లిలో 57 మందికి రూ.75 లక్షల సీఆర్ఎంఎఫ్ సాయం




నేటిసుబోదయ.: నెల్లూరు వేదాయపాళెం కార్యాలయంలో నిర్వహించిన కార్యాలయంలో బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు అందజేసిన సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి కూటమి ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు 760 మందికి రూ.7.22 కోట్లు సాయం అందించాం ఎన్ని దరఖాస్తులు వచ్చినా సీఎం చంద్రబాబు నాయుడు ఉదారంగా స్పందిస్తున్నారు రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి నెలా రూ.100 కోట్ల చొప్పున పేదలకు సాయం అందుతోంది ముఖ్యమంత్రి గారికి అందరం రుణపడివున్నాం




# జల సంరక్షణకు కట్టుబడి పని చేద్దాం

**-ప్రజల్లోనూ చైతన్యం కలిగించాలి**
**-100 రోజుల స్పెషల్ డ్రైవ్ కు శ్రీకారం**
**-గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థలో జలవనరుల స్థిరత్వం'పై కృష్ణాజిల్లా కానూరులో వర్క్ షాపు ప్రారంభించి, ప్రసంగించిన ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్**



విజయవాడ, ఏప్రిల్ 7 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) జలమే జీవం... జీవమే జల సంరక్షణకు మూలం అనే చైతన్యం ప్రతి ఒక్కరిలో రావాలి. సాధారణ ప్రజలు ఇళ్లలో వాడే నీటిని తిరిగి భూమిలోకి పంపే చర్యలు నుంచి వాగులు, వంకలు, నదుల ద్వారా వృథాగా సముద్రంలో కలుస్తున్న నీటిని కాపాడుకునే వరకు ఈ చైతన్యం అందరిలో వెల్లివిరియాల'ని ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ ఆకాంక్షించారు. భూమి మీద మనిషికి అవసరం అయ్యే నీటి శాతం చాలా తక్కువగా ఉంది.. దాన్ని జాగ్రత్తగా కాపాడుకోకపోతే భవిష్యత్తు తరాలకు తీరని అన్యాయం చేసినట్లేనని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల



పరిధిలో గ్రామీణ తాగునీటి సరఫరా వ్యవస్థలో జలవనరుల స్థిరత్వంపై ఒక రోజు వర్క్ షాపు కానూరులోని ఏపీఎస్ఐఆర్డీ భవన్ లో మొదలైంది. ఈ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. అనంతరం పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "నీరు ఎక్కడుంటే అక్కడ అభివృద్ధి బాగుంటుంది. ప్రజల జీవన స్థితిగతులు మెరుగుపడతాయన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజల జీవన విధానం మెరుగవడానికి గోదావరి, కృష్ణా, పెన్నా, వంశధార వంటి నదులే జీవనాధారం. వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా దేశంలో ముందు వరుసలో ఉండటానికి మనకు సమృద్ధిగా ఉన్న నీటి వనరులే కారణం. అలాంటి నీటిని సంరక్షించుకునే పెద్ద సవాల్ ఇప్పుడు మన ముందుంది. ఉపరితల జలాలను జాగ్రత్తగా కాపాడుకోవడం, రానురాను తగ్గుతున్న భూగర్భ జలాలను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడింది. దీనిపై ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలి. భవిష్యత్తును సుందరంగా నిర్మించుకోవాలంటే ప్రతి నీటి చుక్క ఎంత విలువైందో తెలుసుకోవాలి. గ్రామీణ ప్రాంతాల్లో లభ్యమయ్యే నీటి సంరక్షణ చర్యలు, వృథా అయ్యే నీటిని కాపాడుకునే చర్యలను వేగవంతం చేయడం ద్వారా భవిష్యత్తు తరాలకు మనం భరోసానిచ్చినట్లు అవుతుంది.

### గ్రామీణ నీటి సరఫరా వ్యవస్థకు ఎన్నో అవరోధాలు

ప్రతి కుటుంబానికీ తగినంత తాగు నీరు అందించాలనే ఆశయానికి క్షేత్రస్థాయిలో ఎన్నో అవరోధాలు ఉన్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో తగినంతగా - ఉపరితలంలో లభించే నీరు లభ్యత లేకపోవడం, భూగర్భ జలాలు అడుగంటిపోవడం కీలకమైన సమస్యలుగా ఉన్నాయి. లభ్యతగా ఉన్న నీరు కూడా ఎక్కువగా కాలుష్యం బారిన పడుతోంది. ఏజెన్సీ ప్రాంతాల్లో గిరి శిఖర గ్రామాల్లో వేసవిలో నీటి సమస్యను తీర్చేందుకు వాటర్ షెడ్ల పునరుద్ధరణకు ప్రణాళికలు వేస్తున్నాం. మారుతున్న సాంకేతికను ఎప్పటికప్పుడు వినియోగించుకొని నీటి కొరత తీర్చేందుకు, నీటి సంరక్షణ చర్యలు చేపట్టేందుకు యంత్రాంగాన్ని సిద్ధం చేస్తున్నాం. ముఖ్యంగా నీటి సంరక్షణ చర్యల్లో ప్రజల భాగస్వామ్యం అవసరం. నీటి సంరక్షణకు ప్రాధాన్యం ప్రతి కుటుంబానికి తగినంత తాగునీరు అందించాలనే బృహత్ సంకల్పంతో జల్ జీవన్ మిషన్ కార్యక్రమాన్ని మొదలుపెట్టిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆశయానికి అనుగుణంగా ముందుకు వెళ్తామన్నారు. కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ , ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మార్గదర్శకంలో నీటి పొదుపు చర్యలు తీసుకుంటాం. జల్ జీవన్ మిషన్ 2.0 కార్యక్రమంలో భాగంగా నీటి సంరక్షణకు అధిక ప్రాధాన్యం ఇస్తాం. నీటిని జాగ్రత్తగా వినియోగించుకునేలా, వృథా నీటిని పునర్వినియోగించుకునేలా ప్రజల్లో అవగాహన తీసుకురావడం ప్రధానమని,

### 100 రోజుల ప్రణాళికకు శ్రీకారం

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా "100 రోజుల నీటి వినియోగ డ్రైవ్" అనే కార్యక్రమాన్ని ఈ ఏప్రిల్ 6వ తేదీ నుంచి జూలై 14వ తేదీ వరకు చేపట్టింది. దీనిలో ప్రజల్లో చైతన్యం కలిగించి భూగర్భ జలాల పెంపుదల, నీటి వృథాను అడ్డుకోవడం, నీటిని జాగ్రత్తగా వినియోగించుకోవడం, వర్షపు నీటిని ఒడిసి పట్టడం వంటి చర్యలను తీసుకుంది. ప్రకృతిలో మన జీవనం.. జీవితం ముడిపడి ఉందనేది భారతీయ సంస్కృతికి మూలం. ప్రకృతిని కాపాడుకుంటే, ప్రకృతి మనకు మంచి చేస్తుంది. జీవితాన్ని, ప్రకృతిని సమతుల్యం చేసుకుంటేనే భవిష్యత్తు అనేది ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలి. ప్రకృతి ఇచ్చిన నీటి వనరులను ఉపయోగించుకోవడంలో జాగ్రత్త వహించాలి" అన్నారు. ఈ వర్క్ షాపులో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శశిభూషణ్ కుమార్, కాలుష్య నియంత్రణమండలి ఛైర్మన్ డా.పి కృష్ణయ్య , ఏపీ ఎస్ఐఆర్డీ కమిషనర్ ముత్యాల రాజు , అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఆస్తి వల్ల ఎన్నో రక్త సంబంధాలు దూరం అవుతున్నాయి

**- ఆస్తి అది మన జీవిత హక్కు**
**- వైసిపి ప్రభుత్వ హయంలో తీసుకొచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ వల్ల రైతులు ఎన్నో ఇబ్బందులు పడ్డారు**
**- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి చంద్రబాబు ల్యాండ్ టైటిల్ యాక్ట్ రద్దు**
**- ప్రభుత్వ రాజముద్ర కలిగిన పట్టాదారు పాస్ పుస్తకాలు రైతులకు ఉచితంగా పంపిణీ**




ఓడి చెరువు, పుట్టపర్తి, నేటి శుభోదయ ::: మన పెద్దలు సంపాదించిన ఆస్తుల విషయాల్లో ఒకే కుటుంబంలో జన్మించిన సొంత రక్త సంబంధీకులే విబేధాలు తలెత్తి ఇలాంటి సంబంధాలు లేకుండా దూరమవుతున్నారని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఓడి చెరువు మండలం వీరఓబున పల్లి గ్రామంలో మండల రెవెన్యూ అధికారులు మంగళవారం రైతులకు ఏర్పాటు చేసిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో భాగంగా మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో కలిసిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడారు. ఆస్తి మన జీవిత హక్కు అన్నారు. గత వైసిపి ప్రభుత్వం హయాంలో తెచ్చిన ల్యాండ్ టైటిల్ యాక్ట్ వల్ల ఎంతో మంది రైతులు భూ సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఇప్పటికీ ఆ సమస్యలు అలాగే ఉన్నాయని వాటి పరిష్కారం కోసం కూటమి ప్రభుత్వం గ్రామాల్లో భూ రీసర్వే నిర్వహించి ప్రభుత్వ రాజముద్ర కలిగిన నూతన పట్టాదారు పాస్ పుస్తకాలను రైతులకు అన్ని హక్కులతో అందించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఇక గ్రామాల్లో భూమి వివాదాలకు తావు లేకుండా చేయాలన్నదే కూటమి ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే చాలా గ్రామాల్లో భూ రీసర్వేలు నిర్వహించి రైతులకు ఉచితంగా ప్రభుత్వ రాజముద్ర కలిగిన కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలను మంజూరు చేశామని పేర్కొన్నారు. రైతులు ఈ అవకాశాన్ని గ్రామాల్లో సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను దేశంలో ఏ రాష్ట్రంలో కూడా ఇంత పెద్ద ఎత్తున పెన్షన్ ,తల్లికి వందనం పథకం, అన్నదాత సుఖీభవ పథకం ద్వారా లబ్దిదారులకు నిధులు అందిస్తున్నట్లు తెలిపారు. మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో భూ సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని వీటి పరిష్కారం కోసం ప్రభుత్వం భూ రీ సర్వే నిర్వహించి తగిన పరిష్కారాన్ని చూపుతోందన్నారు. ఇంకా మండలాల్లో చుక్కల భూములు ఆన్లైన్ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని వీటిని కూడా త్వరగా పూర్తిచేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అభివృద్ధి పథకాలను చేపట్టి ప్రజలకు సుపరిపాలన అందిస్తోందని తెలిపారు. ప్రజలకు మంచి చేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ప్రజలు జీవితాంతం గుర్తు పెట్టుకోవాలని కోరారు. ఆర్డీవో సువర్ణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎంతో మంచి ఉద్దేశంతో గ్రామాల్లో భూ సమస్యలు తావు లేకుండా భూ రీసర్వే నిర్వహించి అన్ని హక్కులతో కలిగిన నూతన పట్టాదారు పాసు పుస్తకాలను మంజూరు చేస్తోందని తెలిపారు. ఇది ఎంతో మంచి అవకాశం ఉంది రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఓడి చెరువు మండలంలో స్వచ్ఛ రథాన్ని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ చర్చి వారి జయచంద్ర మాజీ జెడ్పిటిసి పిట్టా ఓబుల్ రెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్ రెడ్డి మాజీ ఎంపీటీసీ శ్రీనివాసులు రాష్ట్ర డైరెక్టర్ నారపరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఎంపీడీవో శివప్రసాద్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు నిజాం కంచి సురేష్ ,కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఏ గ్రామంలో కూడా త్రాగునీటి సమస్య రానివ్వొద్దు

**రెడ్డిపల్లి ప్రభుత్వ హై స్కూల్లో మధ్యాహ్నం భోజనాన్ని తనిఖీ చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**
**- నల్లమాడ మండలం లో పర్యటించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ,మాజీ మంత్రి డాక్టర్ రఘునాథరెడ్డి**
**వెళ్ళమద్దిలో టిడిపి సీనియర్ కార్యకర్త రమణ ను పరామర్శించిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి**



నల్లమాడ, పుట్టపర్తి, నేటి శుభోదయ ::: గ్రామాల్లో త్రాగునీటి సమస్య రాకుండా చూడాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అధికారులకు సూచించారు. నల్లమాడ మండలం వేళ్ల మద్ది గ్రామంలో మంగళవారం మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి తో కలిసి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పర్యటించారు. గ్రామంలో టిడిపి సీనియర్ కార్యకర్త రమణ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మంచంపై విశ్రాంతి తీసుకుంటున్న ఆ కుటుంబాన్ని వారు పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో వైద్యుల సలహా మేరకు మందులు వాడి ఆరోగ్య జీవితాన్ని పొందాలని సూచించారు. అదేవిధంగా వెళ్ళ మద్ది, కొండకింద తండా ,ఎర్రంకపల్లి గ్రామాల్లో సమస్య అధికంగా ఉందని స్థానిక ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించారు. ఈ గ్రామాల్లో త్రాగునీటి సమస్య రాకుండా ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసి ప్రజలకు నీటిని అందించాలని ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. రెండు రోజుల్లో మండలంలో త్రాగునీటి సమస్య లేకుండా గ్రామాలను గుర్తించి తక్షణ పరిష్కారం చూపాలని కోరారు. అదేవిధంగా కొండకింద తాండకు చెందిన హీరే నాయక్ క్యాన్సర్ వ్యాధితో వైద్యం కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమాచారాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి లు వెంటనే స్పందించి హైదరాబాదులోని బసవతారక క్యాన్సర్ ఆసుపత్రికి వెళ్లి మెరుగైన వైద్య చికిత్సలు పొందాలని ఎమ్మెల్యే స్వయంగా తన లెటర్ ద్వారా వైద్యులకు అందించారు. మెరుగైన వైద్యం పొంది ఆరోగ్య జీవితం తో త్వరగా కోలుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

### రెడ్డిపల్లి ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

నల్లమడ మండలం రెడ్డిపల్లి ప్రభుత్వ హైస్కూల్లో మధ్యాహ్నం భోజనాన్ని పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆహార నాణ్యతను విద్యార్థులతో అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో వండిన పొంగల్ కోడిగుడ్డు , శనక్కాయ చట్నీ ఆహారాన్ని స్వయంగా ఎమ్మెల్యే తిని రుచి చూశారు. వంట స్టోర్ రూమ్ లో విద్యార్థులకు అందించే ఆహార వస్తువులను ఎమ్మెల్యే నాణ్యతను పరిశీలించారు. ఆహారాన్ని మరింత రుచిగా విద్యార్థులకు అందించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు ఎమ్మెల్యే సూచించారు. అదేవిధంగా పాఠశాల ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచుకొని మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించుకోవాలని అక్కడున్న ఉపాధ్యాయులకు విద్యార్థులకు సూచించారు.



## కొత్తపల్లి లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం




గోకవరం -నేటిసుబోదయ :మండలంలోని జి. కొత్తపల్లి గ్రామము నందు ప్రాధమిక ఆరోగ్యం కేంద్రం జి. కొత్తపల్లి లో వైద్యాధికారి డా. నిఖిత ఆధ్వర్యంలో "ప్రపంచ ఆరోగ్య దినోత్సవం "సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఈ సంవత్సరము నినాదం "విజ్ఞానానికి అండగా నిలుద్దాం -ఆరోగ్యం కోసం కలసి పనిచేద్దాం "అని వైద్య సిబ్బంది తెలియజేస్తూ ఆరోగ్యమే మహాభాగ్యం అని ప్రతీ పౌరుడు మంచి ఆరోగ్య అలవాట్ల తోనే తమ తమ ఆరోగ్యలను చక్కదిద్దు కోవాలని షుగర్, బి. పి., కాన్సర్ వంటి వ్యాధుల బారిన పడకుండా ఉండాలంటే సరైన వ్యాయామం, సరైన ఆహారపు అలవాట్లు కలిగియుండాలన్నారు. ఈ కార్యక్రమం లో సి. హెచ్. సి దంత వైద్యులు డా. కె. మధు, టి . బి సూపర్ వైజర్ ఏస్ . టి. ఎస్ శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దంత పరిశుభ్రత కూడా తప్పని సరి అని పుగాకు, చుట్ట, ఖయిని, తశీబాకు సిగరెట్ లు వాటివలన క్యాన్సర్ వస్తుందని వాటి వినియోగం వద్దని ఆరోగ్యం పట్ల శ్రద్ధ కలిగి యుండాలన్నారు. టి.బి. సూపర్ వైజర్ త్వరలో హ్యాండ్ హోల్డ్ ఎక్సరే మీషీన్ ద్వారా వలనరబుల్ మరియు అనుమానిత కేసులకందరికి టి. బి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. టి. బి బారినపడకుండా అనుమానిత లక్షణాలు వున్నవారు విధిగా కళ్లే పరీక్షలు చేసుకోవాలన్నారు. ఆరోగ్యం పట్ల అందరూ శ్రద్ధకలిగి యుండా లన్నారు.ఈ కార్యక్రమం లో హెచ్. వి. రాజేశ్వరి, ఎమ్. ఎల్. హెచ్. పి. లు, హెల్త్ అసిస్టెంట్ లు, ఏ.ఎన్.ఎమ్. లు,ఆశాలు పాల్గొన్నారు.


## ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయాల పై దాడి దుర్మార్గం

**సీనియర్ జర్నలిస్ట్. టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ మండిపాటు...**



అమరావతి ఏప్రిల్ 7.( నేటి శు భోదయ): ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయం పై వైసీపీ దాడులు చేయటాన్ని సీనియర్ జర్నలిస్ట్. తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ తీవ్రంగా ఖండించారు అమరావతిలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నిజాలు నిర్భయంగా రాసే ఏబీఎన్ ఆంధ్రజ్యోతి పై వైసీపీ నేతలు అవాకులు చవాకులు పెడితే చూస్తూ ఊరుకోమన్నారు ఏబీఎన్ ఆంధ్రజ్యోతి ఎండి రాధాకృష్ణ ని విమర్శించే స్థాయి కాకాని కి లేదని ఆయన అన్నారు మావి గన్ ఊభి నుంచి బయటపడేందుకే వైసిపి నేతలు కుట్రతో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయం పై దాడులు చేయడం దుర్మార్గం అన్నారు ఏబీఎన్ ఆంధ్రజ్యోతి పై గరం ఎండి రాధాకృష్ణ ఏ పార్టీకి సంబంధం లేదని ఎవరు తప్పు చేసినా ఆయన ధైర్యంగా రాస్తారని ఆయన తెలిపారు కొత్త పలుకులో కూడా అదే రాశారని ఆ రాతలు వైసిపి వారు జీర్ణించుకోలేకే ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయం దాడులు పాల్పడ్డారని ఆయన తెలిపారు ఏబీఎన్ ఛానల్ పై వైసీపీ మూకల దాడి చేయటం సిగ్గు చెట్టు అని ఆయన అన్నారు

## భూగర్భజలాల స్థాయిని పెంపొందించడమే 'జలధార ప్రాజెక్ట్' లక్ష్యం



గుడివాడ, ఏప్రిల్ 7 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ) రాష్ట్రంలో భూగర్భ జలాల స్థాయిని పెంపొందించేందుకే ప్రభుత్వం జలధార ప్రాజెక్టును ప్రవేశపెట్టిందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. జలమట్టం పెంపునకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. జలధార ప్రాజెక్ట్ లో భాగంగా గుడివాడ రూరల్ మండలం సిద్ధాంతం గ్రామంలో జరుగుతున్న పూడిక తీత పనుల్లో మంగళవారం ఎమ్మెల్యే రాము పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో కలిసి పలుగు పారతో కాలువల్లో మట్టిని తొలగిస్తూ ఎమ్మెల్యే రాము స్వయంగా పూడిక తీశారు. జలధార ప్రాజెక్టు వంద రోజుల కార్యాచరణ వల్ల కలిగే ప్రయోజనాలను రైతులు, గ్రామస్తులకు ఎమ్మెల్యే రాము వివరించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ భూగర్భ జలమట్టాలను పెంచేందుకు, నీటి భద్రత కోసం వంద రోజుల పాటు కార్యచరణ చేపట్టామన్నారు. చెరువుల్లో పూడికతీత, కాలువల మరమ్మతులు, భూగర్భజలమట్టం పెంపు లక్ష్యంగా 4 దశల్లో కార్యక్రమాన్ని అమలు చేస్తామన్నారు. సాగునీటి భద్రత సాగునీటి సంఘాల బాధ్యతనే నినాదంతో పని చేయాలన్నారు. మండల, గ్రామస్థాయిలో చెరువుల పూడికతీతతో భూగర్భజలాల స్థాయిని పెంపొందించడమే 'జలధార ప్రాజెక్ట్' ఉద్దేశ మని అన్నారు. ఎండిఓ విష్ణు ప్రసాద్, మండల టిడిపి అధ్యక్షుడు వాసే మురళి, టిడిపి నాయకులు వంశీకృష్ణ,కట్టా శ్రీనివాసరావు, వక్కలగడ్డ కాశీ, తోట సురేష్, అన్నవరపు నాగరాజు, కోరుమిల్లి స్వామి, రషీద్ బేగ్, సుబ్బారావు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ఆవ భూముల్లో అక్రమ సాగుపై ఎమ్మెల్యే బలరామకృష్ణ సీరియస్

**- అక్రమార్కులు ఎంతటి వారైనా బైండోవర్ కేసులు నమోదు చేయాలి**



కోరుకొండ, నేటి శుభోదయ ప్రతినిధి ( ఏ.కె.);తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం బూరుపూడి గ్రామ పరిసరాల్లోని ప్రభుత్వ ఆవ భూముల వ్యవహారం మొదటినుంచి సంచలనం సృష్టిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన భూముల కొనుగోలు విషయం, అవినీతి ఆరోపణలు ఇప్పటికీ తేలలేదు. కొంత కాలం నుంచి ఈ భూముల్లో యదేశ్చగా జరుగుతున్న అక్రమ సాగు వెలుగులోకి వచ్చింది. విషయం తెలుసుకున్న రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ యుద్ధప్రాతిపదికన స్థానిక రెవెన్యూ, పోలీస్ శాఖలను అప్రమత్తం చేశారు. సోమవారం కోరుకొండ పర్యటన సందర్భంగా ఆవ భూముల్లో అక్రమ పంట సాగు జరుగుతున్నట్లు ఎమ్మెల్యే దృష్టికి రావడంతో, ఆయన వెంటనే స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు అత్యవసర ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మీడియాతో మాట్లాడుతూ.. మొత్తం 360 ఎకరాల నివాసయోగ్యం కాని ఆవ భూముల్లో 256 ఎకరాల విస్తీర్ణంలో 22 మంది రైతు దళారులు, అక్రమార్కులు మొక్కజొన్న, ఇతర పంటలను అక్రమంగా సాగు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వ భూమిని అక్రమంగా సాగు చేసే వారిపై బైండోవర్ కేసులు నమోదు చేయాలని, అక్రమ సాగుకు విత్తనాలు, ఎరువులు సరఫరా చేసిన దళారీ సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. మొక్కజొన్న పంట చేతికి వచ్చే దశలో ఉన్నందున, అక్రమార్కులు అడ్డదారుల్లో పంటను తరలించే అవకాశాలు ఉన్నాయని అధికారులను హెచ్చరించారు. అక్రమంగా పండించిన మొక్కజొన్న పంటను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని వేలం వేసి, వచ్చిన మొత్తాన్ని ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలని స్పష్టంగా ఆదేశించారు. గతంలో పల్లకడియం గ్రామంలో ఇదే తరహా అక్రమ సాగుపై చట్టప్రకారం చర్యలు తీసుకుని పంటను స్వాధీనం చేసుకున్న విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. అప్పటికప్పుడు జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడారు. అక్రమార్కులు ఎంతటి వారైనా విడిచిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ అక్రమ సాగు అంశాన్ని జిల్లా కలెక్టర్, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామని, అధికారులకు తమ పూర్తి మద్దతు ఉంటుందని బత్తుల బలరామకృష్ణ స్పష్టం చేశారు.

## సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాల్లో చుట్టూ అనవసరంగా తిప్పుకోవద్దు

**ఎమ్మెల్యే కార్యాలయంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**



పుట్టపర్తి, నేటి శుభోదయ ::: ప్రజా సమస్యలపై ప్రభుత్వ కార్యాలయాలకు విచ్చేసే అర్జీదారులను ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ అనవసరంగా తిప్పుకోవద్దని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అధికారులకు సూచించారు. పుట్టపర్తి ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం నియోజకవర్గ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లో త్రాగునీటి సమస్య , విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రజలకు త్రాగునీటి సరఫరాను అందించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా భూ సమస్యలపై అధిక ఫిర్యాదులు వస్తున్నాయని వీటి పరిష్కారం కోసం ఆర్డీవో కార్యాలయంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ క్లినిక్లను ఏర్పాటు చేశారని గుర్తు చేశారు అలాగే మండల తహశిసిల్దార్ కార్యాలయాల్లో సోమవారం గ్రీవెన్స్ ఏర్పాటు చేశారని అలాగే ప్రతి శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రజా గ్రీవెన్స్ ఏర్పాటు చేసి ఈ సమస్యలకు తగిన పరిష్కారం చూపే విధంగా అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రభుత్వ ధ్యేయం అన్నారు. గ్రామాల్లో విద్యుత్ రెవిన్యూ ఆర్డబ్ల్యూఎస్ వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పంచాయతీ సెక్రెటరీలు, వీఆర్వోలు సచివాలయ సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఒక సమస్య పైన సుదీర్ఘకాలంగా పరిష్కరించకుండా ప్రజలను అదేపనిగా కార్యాలయం చుట్టూ తిప్పుకుంటే సంబంధిత అధికారులపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని అందుకు క్షేత్రస్థాయిలో పంచాయతీరాజ్ తో పాటు సచివాలయ అధికారులు స్థానికంగా పర్యటించి సమస్యలను తక్షణ పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ అధికారులు ఆర్డిఓ సువర్ణ ఇరిగేషన్ అధికారులు గురుమూర్తి గంగాధర్ ,గంగాద్రి జమునాబాయి హౌసింగ్ అధికారులు, నియోజకవర్గ కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు శ్రీరామ్ రెడ్డి మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ ,సలాం ఖాన్, పాపారాయుడు, చాంద్ భాషా, వేణుగోపాల్, పలువురు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ హౌసింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని

పుట్టపర్తి ఎమ్మెల్యేని కోరిన పుట్టపర్తి నియోజకవర్గ హౌసింగ్ కాంట్రాక్టు ఉద్యోగులు

కొన్ని ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తూ ప్రభుత్వ సేవ కార్యక్రమాల్లో నిత్యం ప్రజల్లో మమేకమైన ప్రభుత్వ గృహ నిర్మాణ కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ఆ ఉద్యోగులు పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డిని కోరారు. ఈ మేరకు పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన గృహ నిర్మాణ శాఖ కాంట్రాక్టర్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డి నీ మంగళవారం ప్రత్యేకంగా కలిసి విన్నవించారు. ప్రభుత్వం ద్వారా అమలు చేస్తున్న కార్యక్రమాలను సకాలంలో దిగ్విజయం చేసి ప్రజలకు సేవలు అందిస్తున్న కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందర్నీ ప్రభుత్వం క్రమబద్ధీకరించేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని పుట్టపర్తి నియోజకవర్గానికి చెందిన గృహ నిర్మాణ శాఖ కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు పుట్టపర్తి ఎమ్మెల్యే శ్రీమతి పల్లె సింధూర రెడ్డిని ప్రత్యేకంగా కోరారు. తప్పకుండా మీ న్యాయమైన కోరికను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, సంబంధిత హౌసింగ్ మంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వారికి హామీ ఇచ్చారు.

## ఆంధ్రజ్యోతి కార్యాలయం పై వైసీపీ దాడిని తీవ్రంగా ఖండించిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

**- దాడి చేసిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి**

**- మీడియా స్వేచ్ఛను హరించడం ప్రజాస్వామ్యంలో మంచిది కాదు**

**- ఆంధ్రజ్యోతిపై దాడిని ఖండించిన పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ,మాజీ మంత్రిడాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి**






పుట్టపర్తి, నేటి శుభోదయ ::: హైదరాబాద్లో ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై దాడికి పాల్పడిన వ్యక్తులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డిలు మంగళవారం మీడియా ద్వారా వేర్వేరుగా తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ ఏబీఎన్ ఆంధ్రజ్యోతి కార్యాలయంపై వైసీపీ నేతలు, రౌడీ మూకలతో కలిసి దాడికి పాల్పడడం మీడియా స్వేచ్ఛపై దాడి చేయడమే అన్నారు.వైసీపీ ఐదేళ్ల పాలనలో మీడియా సంస్థలపై, ఆంధ్రజ్యోతిపై అనేక వేధింపులకు, కుట్రలకు పాల్పడినా ఎంతో నిబ్బరంగా ధైర్యంగా ప్రభుత్వం చేసిన తప్పులను ఎండగడుతూ ప్రజల హృదయాల్లో నిలిచిపోయిందని తెలిపారు. కొంత మంది రౌడీ మూకలను వెంటేసుకుని ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు మీడియా కార్యాలయం పైకి వెళ్లడం ప్రజాస్వామ్యంలో ఏ పార్టీకి మంచిది కాదన్నారు. ఇలాంటి దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాలని పేర్కొన్నారు. ఆంధ్రజ్యోతి కార్యాలయం పై దాడి చేసిన ఎంతటి వ్యక్తులైన వారిని గుర్తించి ప్రభుత్వం కఠినంగా శిక్షించేలా కేసులు నమోదు చేసి జైలుకు పంపాలని ఎమ్మెల్యే పల్లె సింధురారెడ్డి ఆ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రత్యేకంగా డిమాండ్ చేశారు. ఇలాంటి విష సంస్కృతికి పాల్పడే వ్యక్తులపై ప్రభుత్వం తగిన శిక్ష పడేలా చట్టం తీసుకురావాలని కోరారు. మీడియా సంస్థలపై దాడులకు పాల్పడే వారిపై పీడి యాక్ట్ నమోదు చేసి చట్ట ప్రకారం వారిని శిక్షించాలని కోరారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి డిమాండ్ చేశారు. మీడియా సంస్థలపై దాడి చేసే రౌడీలో గుండాలను కఠినంగా శిక్షించాలి అక్షరమే ఆయుధంగా పనిచేస్తున్న ఆంధ్రజ్యోతి పై వైసిపి వర్గీయులు దాడికి పాల్పడడం తీవ్రంగా ఖండిస్తున్నాం

**- మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి**

ఆంధ్రజ్యోతి మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ దశాబ్దాలుగా కేసులకు, దాడులకు, ఒత్తిళ్లకు భయపడకుండా అక్షరమే ఆయుధంగా ప్రజా గళంగా నిలిచే ఆంధ్రజ్యోతి పత్రికను, చానల్ ను ముందుకు తీసుకపోతూ జర్నలిజంలో ముద్రను వేసుకున్నారన్నారు. అలాంటి సంస్థ పై వైసీపీ నేతలు దాడికి పాల్పడితే భయపడతారనే ఇలాంటి దాడులకు దిగుతున్నారని పేర్కొన్నారు. రాజధాని అమరావతి పై వైసీపీ కుట్రలను ప్రశ్నించిన ఆంధ్రజ్యోతి సంపాదకీయానికి సమాధానం చెప్పలేకనే వైసిపి దాడులకు పాల్పడి తిరిగి మీడియా కార్యాలయాల వద్ద నిరసనలతో వైసీపీ డైవర్షన్ పాలిటిక్స్కు పాల్పడుతోందన్నారు. ఆంధ్రజ్యోతి సంస్థపై వైసీపీ దాడిని అన్ని వర్గాలు ముక్కుముడిగా ఖండించాలని మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి కోరారు.

## భారతీయ హోమియోపతికి పెరుగుతున్న ప్రజా ఆదరణ

**- ప్రపంచ వైద్య రంగంలో అగ్రగామిగా భారత్**

**- ఏఎస్ఆర్ హోమియోపతిక్ మెడికల్ కాలేజీలో ముగిసిన ప్రపంచ హోమియోపతి వారోత్సవాలు**





తాడేపల్లిగూడెం, ఏప్రిల్ 07 : తాడేపల్లిగూడెంలోని ఏఎస్ఆర్ ) హోమియోపతిక్ మెడికల్ కాలేజీలో వారం రోజులుగా జరుగుతున్న ప్రపంచ హోమియోపతి వారోత్సవాలు మంగళవారం అత్యంత ఘనంగా ముగిశాయి. ఉమర్ అలీషా రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ (ఖూా=ఖు) సహకారంతో కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ ఉచిత మెగా దయాగ్నోస్టిక్ క్యాంప్తో ఈ కార్యక్రమం ముగిసింది. విదేశీ మూలాలు - భారతీయతను పులుముకున్న వైద్యం - అధిక ఆదరణతో ఈ ముగింపు సభలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ ఆనంద కుమార్ పింగళి మాట్లాడుతూ హోమియోపతి వైద్యం జర్మనీలో డాక్టర్ శామ్యూల్ హానిమాన్ ద్వారా ప్రారంభమైనప్పటికీ, అది నేడు భారతీయ జీవనశైలిలో ఒక భాగమైందని అన్నారు. నేడు ఇది కేవలం విదేశీ శాస్త్రం కాదు. భారతీయులందరి ఆదరణ పొంది భారతీయ హోమియోపతిగా రూపాంతరం చెందింది. అతి తక్కువ ఖర్చుతో, ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా సామాన్యులకు సైతం నాణ్యమైన వైద్యాన్ని అందిస్తోందని డాక్టర్ పింగళి పేర్కొన్నారు. హోమియోపతికి ప్రపంచ కేంద్రంగా భారత్ భారతదేశం హోమియోపతి రంగంలో ప్రపంచానికే దిక్సూచిగా మారిందని చెబుతూ డాక్టర్ పింగళి పలు కీలక గణాంకాలను వెల్లడించారు. భారతదేశంలో ప్రస్తుతం 20 కోట్లకు పైగా ప్రజలు క్రమం తప్పకుండా హోమియోపతి వైద్యాన్ని వినియోగిస్తున్నారు. 3 లక్షలకు పైగా నమోదిత వైద్యులు, 300కు పైగా హోమియోపతి వైద్య కళాశాలలతో భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద వైద్య వ్యవస్థను కలిగి ఉంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా వినియోగించబడుతున్న రెండో వైద్య విధానంగా హోమియోపతి గుర్తింపు పొందిందని, దీని అభివృద్ధిలో భారత్ కీలక పాత్ర పోషిస్తోందని ఆయన వివరించారు.

**- ప్రజల కోసం అత్యాధునిక పరీక్షలు**

ముగింపు వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసిన క్యాంప్లో సైలెంట్ కిల్లర్స్గా పిలువబడే వ్యాధులపై ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఎముకల సాంద్రత పరీక్ష (దీవీణ ూవర్) నిర్వహించి ఆస్టియోపోరోసిస్ ప్రమాదాన్ని గుర్తించారు. డయాబెటిస్ (ఎపాూ1ఎ), లిపిడ్ ప్రొఫైల్, థైరాయిడ్ వంటి సమగ్ర మెటబాలిక్ పరీక్షలు నిర్వహించారు. ఊబకాయం, రక్తపోటు వంటి దీర్ఘకాలిక సమస్యలకు ఉచిత సంప్రదింపులు అందించారు.

**- భవిష్యత్ లక్ష్యాలు**

కేంద్ర ప్రభుత్వం ఆయుష్ (ూఖూ౧) విభాగం ద్వారా అందిస్తున్న ప్రోత్సాహాన్ని డాక్టర్ పింగళి కొనియాడారు. హోమియోపతి వైద్యం కోసం విదేశీయులు సైతం భారత్కు వస్తున్నారని, ఇది వైద్య పర్యాటక రంగానికి (వీవ౧ఊఝ్రీ ౧శీబతీఱం౨) ఎంతో దోహదపడుతుందని అన్నారు. వారమంతా నిర్వహించిన గ్రామీణ వైద్య శిబిరాలు ప్రజల ఆరోగ్యం కోసం హోమియోపతి అనే సందేశాన్ని ప్రతి ఇంటికీ చేరవేశాయని డాక్టర్ పింగళి సంతృప్తి వ్యక్తం చేశారు. నేషనల్ కమిషన్ ఫర్ హోమియోపతి సహకారానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కళాశాలలోని రెగ్యులర్ ఓపిడి (ూూణ), పెరిఫెరల్ ఓపిడిలు మరియు



ఇన్-పేషెంట్ విభాగం (ఖూణ) ద్వారా ప్రజలకు నిరంతరం అంకితభావంతో, అత్యంత ఖచ్చితత్వంతో కూడిన వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

## పిసి పిఎన్డిటి చట్టాన్ని ఖచ్చితంగా అమలు చేయాలి

**: ఖమ్మం జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

**- నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు**

**- అన్ని స్కానింగ్ యంత్రాలకు తప్పనిసరి రిజిస్ట్రేషన్**

**- ఫారం-ఎఫ్ అప్లోడ్, రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు**

**- క్లినికల్ సంస్థలకు నిబంధనల ప్రకారం అనుమతులు మంజూరు**

**- పిసి పిఎన్డిటి చట్టంపై జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అథారిటీ సమావేశాన్ని నిర్వహించిన జిల్లా కలెక్టర్**

ఖమ్మం, నేటి శుభోదయ ::: పిసి పిఎన్డిటి చట్టం 1994, రూల్స్ 1996 ను జిల్లాలో ఖచ్చితంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్లోని కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం పిసి పిఎన్డిటి చట్టంపై జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అథారిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, జిల్లా జడ్జిలు డి. రాం ప్రసాద రావు, వి.శ్రీనయ్య, అదనపు డిసిపి బి.రామానుజంలతో కలిసి నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ స్కానింగ్ కేంద్రాలకు సంబంధించి 10 కొత్త దరఖాస్తులు, 11 రెన్యువల్, మొత్తం 21 పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. తదుపరి సమావేశంలో పూర్తి వివరాలతో రిపోర్ట్ సమర్పించాలని ఆదేశించారు.ప్రతి స్కానింగ్ యంత్రం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్లో ఉండాలని, అర్హత కలిగిన వారు మాత్రమే స్కానింగ్ నిర్వహించాలని స్పష్టం చేశారు. ప్రతి స్కాన్కు సంబంధించిన వివరాలను ఫారం-ఎఫ్ లో నమోదు చేసి ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని, అన్ని రిఫరల్ వివరాలు సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు. మొబైల్ స్కానింగ్ యంత్రాలు అనుమతించబడవని తెలిపారు. ప్రతి స్కానింగ్ కేంద్రం ఫారం-ఎఫ్ వివరాలను ప్రతి నెలా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారికి సమర్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో పిసి పిఎన్డిటి కేసులు 5, ఎమ్టీపీ కోర్టు కేసులు 3 ఉన్నాయని సంబంధిత అధికారులు వెల్లడించారు.ఖమ్మం జిల్లాలో క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్స్ చట్టం 2010 క్రింద మొత్తం 658 సంస్థలు నమోదు అయ్యాయని రెన్యువల్, కొత్త అనుమతులు మంజూరు చేసే సమయంలో అన్ని నిబంధనలను తప్పనిసరిగా రెండు, మూడు సార్లు సమగ్రంగా పరిశీలించాలని, ఈ విషయంలో ఏ చిన్న అంశం కూడా విస్మరించకుండా, ప్రతి ప్రమాణాన్ని ఖచ్చితంగా ధృవీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఐ.ఎం.ఏ. అధ్యక్షులు డాక్టర్ ఎస్. రెహానా బేగం, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు, అదనపు డిఎంహెచ్ఓ డా. చందూ నాయక్, డిప్యూటీ డిఎంహెచ్ఓ డా. వేణుమాధవ్, కమిటీ సభ్యులు, ఎన్జీఓ ఎం. కుముదిని, డిసిపిఓ విష్ణు వందన, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**- గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**



గుడివాడ, ఏప్రిల్ 7( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) :విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల పిలుపునిచ్చారు. ప్రతీ ఇంటినీ సూర్యఘర్ వెలుగులతో నింపుకోవాలన్నారు.గుడివాడ 13వ వార్డు బాపూజీ నగర్ లో ఏర్పాటుచేసిన సోలార్ ప్యానల్ కనెక్షన్లను మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే రాము ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రభుత్వం అన్ని వర్గాలకు చేరువ చేస్తుందన్నారు. ముఖ్యంగా ఎస్సీ ఎస్టీ వర్గాలకు ఉచితంగా రెండు కిలోవాట్ల ప్యానల్స్ ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. కేంద్రం అందిస్తున్న రాయితీకి తోడు, లబ్ధిదారుల వాటాను ప్రభుత్వమే చెల్లించేలా నిర్ణయం తీసుకున్న సీఎం చంద్రబాబుకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. సోలార్ ప్యానల్ కనెక్షన్ల కోసం తక్షణమే పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. గుడివాడ నియోజకవర్గంలో 1700 కుటుంబాలు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ప్రతి ఇంటికి సోలార్ ప్యానల్ ఏర్పాటు చేయడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే రాము తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, మార్కెట్ యార్డ్ చైర్మన్ రవికుమార్, టిడిపి నాయకులు గోర్జీ సత్యనారాయణ, అంగడాల సతీష్, గోకవరపు సునీల్, మజ్జడ నాగరాజు, పంద్రాజు సాంబశివరావు, ఏసుపాదం,గద్దం ప్రకాష్ దాస్,పులపర్తి డేవిడ్, జబీన్, ఇర్ఫాన్, 13వ వార్డు నాయకులు కనకంబరం , మెరుగు మోజేష్, మెరుగు కుమారి, లారా, తుమ్మేటి ప్రసాద్, కిషోర్, మీనా, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ కనక దుర్గమ్మ వారికి బంగారు మంగళ సూత్రాల అందజేత



విజయవాడ, ఏప్రిల్ 7 (నేటి శుభోదయ):- ఇంద్రకీలాద్రిపై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ వారికి హైదరాబాద్ కు చెందిన టి. శ్రీనివాసరావు తన కుటుంబ సభ్యులతో కలిసి 20 గ్రాములు బరువు కలిగిన సుమారు 2,70,000/- విలువ గల బంగారు మంగళ సూత్రాలను ఆలయ సూపరెండెంట్ డివివి సత్యనారాయణ కి అందజేశారు. ఈ సందర్భంగా దాతకు అమ్మవారి దర్శనం చేయించి వేద పండితుల ఆశీర్వచనంతో పాటు అమ్మవారి చిత్రపటాన్ని, శేషవస్త్రాని, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

## ప్రతి డ్వాక్రా మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సోలార్ దీది సువర్ణ అవకాశం

**: వివిఎంసి కమిషనర్ ధ్యానచంద్ర**



విజయవాడ, ఏప్రిల్ 7 (నేటి శుభోదయ):- ప్రతి డ్వాక్రా మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు సోలార్ దీది సువర్ణ అవకాశం అని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం ఉదయం ప్రధాన కార్యాలయం నూతన భవనంలో స్వయం సహాయక బృందాల మహిళలతో ప్రధానమంత్రి సూర్యఘర్ బిజిలి యోజన పథకం పై సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కమిషనర్ ధ్యానచంద్ర మాట్లాడుతూ ప్రతి డ్వాక్రా మహిళ ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు విజయవాడ నగర పాలక సంస్థ ఎల్లప్పుడూ శిక్షణ కార్యక్రమాలు కల్పిస్తూ వారి ఆర్థిక అభివృద్ధిలో తోడ్పడుతుందని అన్నారు. అందులో భాగంగా ప్రధానమంత్రి సూర్యఘర్ బిజిలి యోజన పథకం ద్వారా ప్రజలు వారి ఇంటి పైన పెట్టుకునే సోలార్ ప్యానల్స్ ను ఫిట్టింగ్ చేయించేందుకు బయట టెక్నీషియన్లు తక్కువమంది ఉన్నందున డ్వాక్రా మహిళలకు సోలార్ ప్యానల్స్ ఫిట్టింగ్ చేసేందుకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి వారికి నైపుణ్యాన్ని కల్పించి వారు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం కల్పిస్తున్నామని అన్నారు.సోలార్ దీది పేరుతో ప్రధానమంత్రి మహిళలకు సోలార్ ప్యానల్స్ అమర్చేందుకు వారికి సరిపడా ఫిట్టింగ్, హెల్పింగ్, వెండింగ్ అను మూడు క్యాటగిరీలలో శిక్షణను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. కావున డ్వాక్రా మహిళలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి ఒక్కరూ ఈ శిక్షణ కార్యక్రమాల్లో దరఖాస్తు చేసుకొని తగిన శిక్షణ తీసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని కోరారు.ఈ సమావేశంలో అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్స్) డాక్టర్ డి.చంద్రశేఖర్, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యు సి డి) ఎం విజయలక్ష్మి, టెక్నికల్ ఎక్స్పర్ట్ రమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

## కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డొచ్చే ఆటంకాలను తొలగించండి

**వివిఎంసి కమిషనర్ ధ్యానచంద్ర**



విజయవాడ, ఏప్రిల్ 7 (నేటి శుభోదయ):- కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డొచ్చే ఆటంకాలను తొలగించాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం ఉదయం తన పర్యటనలో భాగంగా తిక్కల రోడ్డు నిర్మల కాన్వెంట్ రోడ్ పాలిటెక్నిక్ కాలేజ్ రోడ్ లో ఎలా కాలేజీ రోడ్ ఈఎస్ఐ హాస్పిటల్ గుణదల ప్రాంతాలన్నీ పర్యటించి క్షేత్రస్థాయిలో నగరంలో జరుగుతున్న డీసిల్టింగ్ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వర్షం కురిసినప్పుడు రోడ్డుపైన నీటి నిల్వలు ఉండే ప్రాంతాలలో నిర్మలా కాన్వెంట్ పెనమనేని పాలీ క్లినిక్ రోడ్ ఈఎస్ఐ హాస్పిటల్ తరచుగా ఉంటాయి కాబట్టి ముఖ్యంగా అటువంటి ప్రాంతాలలో డీసిల్టింగ్ పనులను పూర్తిస్థాయిలో చేయాలని, రానున్న వర్షాకాలంలో వర్షాలు పడిన రోడ్డుపైన నీటి నిల్వలు ఉండకుండా కాలువల్లో నీటి ప్రవాహంలో ఎటువంటి అంతరాయం ఉండకుండా అధికారులు అప్రమత్తంగా ఉంటూ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పిన్నమనేని పాలీ క్లినిక్ రోడ్ నుంచి పుల్లేటి కాలువ వరకు వెళ్లే నీటి ప్రవాహంలో అడ్డొచ్చే ఆటంకాలను తొలగిస్తూ నీటి ప్రవాహంలో ఎటువంటి అంతరాయం లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ షమ్మీ, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె. అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ ఇన్చార్జ్ పి. సత్యకుమారి, సూపరింటెంటింగ్ ఇంజనీర్ (వర్క్స్) చంద్రశేఖర్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ పి.మోహన్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపాల నాయక్ సిబ్బంది పాల్గొన్నారు.

# అమరావతికి రాజముద్రతో నెరవేరిన ఆంధ్రుల ఆకాంక్ష చంద్రబాబు విజన్, రైతుల త్యాగానికి దక్కిన విజయం

**: ఎంపి కేశినేని చిన్ని**



విజయవాడ, ఏప్రిల్ 7 (నేటి శుభోదయ):- ఆంధ్రప్రదేశ్ ప్రజల దశాబ్దాల కల సాకారమైందనీ, రాష్ట్ర రాజధానిగా అమరావతికి అధికారికంగా లిరాజముద్రలి పడటంతో ప్రజలంతా సంబరాలు చేసుకుంటున్నారని విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. పార్లమెంటు ఉభయ సభలు ఆమోదించిన అమరావతి బిల్లుపై గౌరవ రాష్ట్రపతి సంతకం చేయడంతో, కేంద్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్‌ను విడుదల చేసిందన్నారు. ఈ చారిత్రాత్మక నిర్ణయంతో గత ఐదేళ్లుగా సాగిన అనిశ్చితికి తెరపడి, నవ్యాంధ్ర నిర్మాణానికి మార్గం సుగమమైందనీ . ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు సంబరాలు జరుపుకుంటున్నారన్నారు. విజయవాడ గురునానక్ కాలనీలోని పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎంపీ కేశినేని శివనాద్ మాట్లాడారు. నేటి అమరావతి శాశ్వత రాజధాని రైతుల త్యాగం..అన్నారు.

అమరావతి నిలబడిందంటే అది కేవలం రాజకీయ నిర్ణయం కాదు, వేలాది మంది రాజధాని రైతులు ,మహిళల రక్తం, కన్నీరు, త్యాగ ఫలితమని కొనియాడారు . గత ప్రభుత్వ వైసిపి పాలనలో అమరావతి రాజధాని ప్రాంత ప్రజలను, రైతులను అనేక ఇబ్బందులు పెట్టారని, ఆ ఇబ్బందులను తట్టుకొని నిలబడిన ప్రతి ఒక్కరి త్యాగమే నేటి రాజధాని అమరావతి ప్రాంతం అన్నారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత చంద్రబాబు నాయుడుపై నమ్మకంతో పైసా తీసుకోకుండా 34 వేల ఎకరాల భూమిని 29 వేల మంది రైతులు రాజధాని కోసం ఇచ్చారన్నారు. ఆనాటి రైతుల త్యాగం దేశ చరిత్రలోనే అపూర్వ ఘట్టం అన్నారు. 2019- 24 మధ్య ఐదేళ్ల జగన్ రెడ్డి పాలనలో మహిళలు, రైతులు ఎన్నో హింసలు, చిత్రహింసలు అనుభవించినా, వెనకడుగు వేయకుండా పోరాడి విజయం సాధించారని తెలిపారు.అమరావతి అంటే కేవలం నాలుగు భవనాలు కాదని, అది రాష్ట్రాన్ని నడిపించే ఒక శక్తి అన్నారు. సమర్థవంతమైన శక్తియుత రాజధానిని నిర్మాణం చేయగలరని నమ్మకంతోనే ముఖ్యమంత్రి గా నారా చంద్రబాబు నాయుడు ను మొదటి నుంచీ నమ్మారన్నారు . ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌ను ఏ విధంగానైతే అభివృద్ధి చేశారో, అంతకు మించి అమరావతిని తీర్చిదిద్దుతారని దేశంలోని అన్ని రాజకీయ పక్షాలు ముక్తకంఠంతో చాటి చెప్తూ. లోక్‌సభలో అమరావతి శాశ్వత రాజధాని చట్టబద్ధత బిల్లు వచ్చినప్పుడు ప్రతిపక్షాలు సైతం చంద్రబాబు సామర్థ్యాన్ని వేనోళ్ల పొగిడాయన్నారు. ఇది ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ఇమేజ్‌కు నిదర్శనమని తెలిపారు. రాష్ట్ర రాజధానిగా అమరావతి చట్టబద్ధత పొందితే రాష్ట్ర ప్రజలంతా సంబరాలు చేసుకుంటుంటే వైసీపీ నాయకులు మాత్రం ఇప్పటికీ కూడా అమరావతి పై నిప్పులు కక్కుతూనే ఉన్నారన్నారు. అమరావతికి దేశమంతా మద్దతు తెలుపుతుంటే, సొంత రాష్ట్రానికి చెందిన వైసీపీ మాత్రం పార్లమెంటులో బిల్లును వ్యతిరేకిస్తూ వాకౌట్ చేయడం వారి హీన చరిత్రకు నిదర్శనమని విమర్శించారు. జగన్ రెడ్డి తన స్వార్థ ప్రయోజనాల కోసం 'మూడు రాజధానుల' పేరుతో ప్రజలను మభ్యపెట్టారని, అందుకే ప్రజలు ఆయనకు 11 సీట్లు ఇచ్చి 'లెవన్ రెడ్డి'గా మార్చారని ఎద్దేవా చేశారు . అమరావతి పేరును అపహాస్యం చేసేలా మావిగన్ అంటూ కొత్త కొత్త వింత పేర్లతో జగన్ చేసిన వ్యాఖ్యలుఎ బాధ్యతారాహిత్యమని మండిపడ్డారు. రాజధాని నోటిఫికేషన్‌తో పాటు విజయవాడ, గుంటూరు నగరాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. వచ్చే ఏడాది మార్చిలో సెన్సస్ పూర్తి కాగానే గ్రేటర్ విజయవాడ ఏర్పాటు జరుగుతుందన్నారు. రాష్ట్రాన్ని సర్వతోముఖాభివృద్ధి చంద్రబాబు నాయకత్వంలో జరుగుతుందని స్పష్టం చేశారు.అమరావతికి పడిన రాజముద్ర ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తుకు భరోసాగా నిలిచిందన్నారు. డబల్ ఇంజన్ సర్కార్ కృషితో రాజధాని నిర్మాణం శరవేగంగా పూర్తి చేస్తామని , రానున్న 30 సంవత్సరాలు కేంద్రంలోనూ రాష్ట్రంలోనూ డబుల్ ఇంజన్ సర్కార్ ఉంటుందన్నారు. అమరావతి రాజధాని ని అడ్డుకోవడం జగన్ తరం కాదన్నారు. ఇదే వైఖరి కొనసాగిస్తే ప్రస్తుతం 11 రెడ్డి గా ఉన్న జగన్ రెడ్డి జీరో రెడ్డి కావడం ఖాయం అన్నారు. ఏబీఎన్ ఆంధ్రజ్యోతి సంస్థపై వైసీపీ శ్రేణులు దాడి చేయటాన్ని ఎంపీ తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమానికి హాజరై ఆంధ్ర ప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ సైతం హర్షం వ్యక్తం చేయగా, టిడిపి నాయకులు బొప్పన భవకుమార్, షేక్ ఆశ, సొంగ సంజయ్ వర్మ, ఎస్.కె కరీముల్లా, కాకు మల్లికార్జున యాదవ్, చరణ్ సాయి యాదవ్, పొట్లూరి దర్శిత్, మాదిగాని గురునాదం, ఎర్నేని వేదవ్యాస్, నరసింహ చౌదరి, జీవన్ తదితరులు పాల్గొన్నారు

## ఎంపీ కేశినేని శివనాథ్ ను కలిసిన బార్ అసోసియేషన్ నాయకులు

**బార్ అసోసియేషన్ అభివృద్ధికి నిధులు కేటాయిస్తానని హామీ ఇచ్చిన ఎంపీ**



విజయవాడ, ఏప్రిల్ 7 (నేటి శుభోదయ):- విజయవాడ బార్ అసోసియేషన్ నాయకులు విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)ని గురునానక్ కాలనీలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులుగా అత్యధిక మెజారిటీతో ఎన్నికైన సీనియర్ న్యాయవాది చలసాని అజయ్ కుమార్ నేతృత్వంలో విజయవాడ బార్ అసోసియేషన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు వి లక్ష్మీనారాయణ, వీ కిరణ్ కుమార్, గవర్నింగ్ బాడీ సభ్యులు పలువురు ఎంపీ ని కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని చిన్ని ఇటీవల జరిగిన ఎన్నికలలో స్టేట్ బార్ కౌన్సిల్ సభ్యులు గా అత్యధిక మెజారిటీతో గెలిచిన చలసాని అజయ్ కుమార్ తో పాటుగా విజయవాడ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని అభినందించారు. విజయవాడ బార్ అసోసియేషన్ తరపున ఎంపీ చిన్ని ను అసోసియేషన్ ప్రతినిధులు సత్కరించారు. విజయవాడ బార్ అసోసియేషన్ సమస్యలను ఎంపీ కేశినేని కి అసోసియేషన్ నూతన అధ్యక్ష,కార్యదర్శులు వివరించారు. బార్ అసోసియేషన్ సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని, త్వరలోనే ఎంపీ ఫండ్స్ నుంచి నిధులను విడుదల చేస్తానని ఎంపీ హామీ ఇచ్చారు. న్యాయవాదులు తెలిపిన కొన్ని సమస్యలు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉండటంతో ఆయా సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎంపీ శివనాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు యెర్నేని వేదవ్యాస్, పిళ్ళ శ్రీనివాసరావు, బి. లెనిన్, ముష్టి శ్రీకాంత్, జి రమా తేజ, కె . ఇందిరా, ఇ. ఉషాజ్యోతి, వి. పద్మజ, చాట్ల రాజశేఖర్ తదితరులు ఉన్నారు.

## హోదా పెంచి జీతం తగ్గిస్తే ఎట్లా సార్

**డిడిఓ రవికుమార్ కు వినతి**



పులిచెర్ల, ఏప్రిల్ 7,(నేటి శుభోదయ) :పంచాయతీలలో ఎంతో కష్టపడుతున్నాం. ఎప్పుడు లేని విధంగా నూరు శాతం ఇంటి పనులు వసూలు చేశాం. కార్యదర్శి పంచాయతీ అభివృద్ధి అధికారి అయ్యారు సంతోషం గ్రేడ్ 5 నుంచి. గ్రేడు మూడుకు మార్పు చేశారు. శుభ పరిణామం అన్ని బాగున్నాయి చివరలో జీతం తగ్గిస్తూ జీవో ఇస్తే ఎట్లా సార్ అంటూ పులిచెర్ల మండలంలోని గ్రేడ్ 5 కార్యదర్శిలు ఆవేదన వ్యక్తం చేస్తూ డి డి ఓ రవికుమార్ కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వానికి మా ఆవేదనను సూచించాలని డిడిఓను కోరారు.

## పేదలకు సత్వరమే సీఎంఆర్ఎఫ్ ఆర్థికసాయం


**ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు**



విజయవాడ, ఏప్రిల్ 7 (నేటి శుభోదయ):- సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన ఆర్థిక సాయాన్ని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు మంగళవారం చెక్కులు, ఎల్.ఓ.సీల రూపంలో లబ్ధిదారులకు అందజేశారు. మైలవరం నియోజకవర్గ పరిధిలోని 83 మందికి రూ.53.19 లక్షల రీ ఎంబర్స్ మెంట్ చెక్కులు, 25 మందికి రూ.56.01 లక్షలు ఎల్.ఓ.సిల రూపంలో ఆర్థికసాయం తాజాగా మంజూరైంది. మొత్తం 109 మందికి రూ.1.09 కోట్లు మంజూరయ్యాయి.కొండపల్లి మున్సిపల్ కార్యాలయంలో (ఎల్.ఓ.సి)లను, చెక్కులను సీఎం చంద్రబాబు నాయుడు సందేశ పత్రాలను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు అందజేశారు. ఈ సందర్భంగా వసంత కృష్ణప్రసాదు మాట్లాడుతూ లబ్ధిదారుల ఆరోగ్య పరిస్థితిపై వాకబు చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ఎఫ్ నుంచి సత్వరం ఆర్థికసాయం అందుతుందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), ఎన్డీఏ కూటమి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు పొజిషన్ సర్టిఫికెట్లతో పక్కాగృహాలు

**ఐదు దశాబ్దాల పేదల కల సాకారం: ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు**




విజయవాడ, ఏప్రిల్ 7 (నేటి శుభోదయ):- పేదలకు పొజిషన్ సర్టిఫికెట్లను ఇవ్వడంతో పక్కాగృహ నిర్మాణాల మంజూరుకు ఇబ్బందులు తొలగనున్నాయని, దీంతో వారి సొంతింటి కల సాకారం అవుతుందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాదు పేర్కొన్నారు.మైలవరం మండలం కనిమెర్లతండాలో 24 మంది పేదల ఇంటి స్థలాలకు సంభందించి పొజిషన్ సర్టిఫికెట్లను ఎమ్మెల్యే కృష్ణప్రసాదు మంగళవారం అందజేశారు. దీనితో పేదల ఐదు దశాబ్దాల సమస్యకు విముక్తి కలిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణప్రసాదుకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయనకు ముందస్తు శుభాకాంక్షలు చెబుతూ గ్రామస్తులు కేకును కట్ చేయించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ పేదల సమస్యలు చిత్తశుద్ధితో పరిష్కరిస్తున్నాం. ఎక్కడా అవినీతికి ఆస్కారం లేకుండా పారదర్శకంగా సేవలు అందిస్తున్నాం. అధికారులు మరింత జవాబుదారీతనంతో పని చేయాలి." అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ),తదితరులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలోని డ్రైయినేజీ సమస్యల పరిష్కారంపై దృష్టి

**మంత్రి నారాయణ చొరవతో రోడ్ల నిర్మాణానికి రూ.100 కోట్లు మంజూరు:ఎమ్మెల్యే గద్దె**




విజయవాడ, ఏప్రిల్ 7 (నేటి శుభోదయ):- ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకోడానికి తాను ప్రతినిత్యం నియోజకవర్గంలోని ఏదో ఒక డివిజన్‌లో పర్యటిస్తున్నానని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామమోహన్ చెప్పారు. నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో రహదారులను నిర్మాణం చేశామని, త్వరలోనే డ్రైయినేజీ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. మంగళవారం ఉదయం తూర్పులోని 10వ డివిజన్ న్యూ పోస్టల్ కాలనీ 2వ లైన్‌లో తూర్పు ఎమ్మెల్యే గద్దె పర్యటించారు. స్థానికంగా ఉన్న డ్రైనేజీ సమస్యలపై అక్కడి నివాసితులను ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా గద్దె మాట్లాడుతూ విజయవాడ నగరానికి సంబంధించిన మూడు ప్రధాన రహదారులను మంత్రి నారాయణ చేతుల మీదుగా ప్రారంభించుకుంటున్నామని చెప్పారు. సుమారు రూ.100 కోట్లను మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణ చోరవ చూపించి సీఆర్‌డీఏ నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో మంజూరు చేయించారని చెప్పారు. డ్రైయిన్ల సమస్యను కూడా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వర్షాలు పడినప్పుడే కాకుండా వర్షం లేని సమయంలో కూడా డ్రైయిన్లు పొంగుతున్నాయని, అందుకు కారణం వైఎస్సార్‌సీపీ హాయంలో ఎల్అండ్‌టీ కంపెనీ వారు స్ట్రామ్ వాటర్ నిధులతో చేపట్టిన పనులను పూర్తి చేయనీయకుండా అడ్డుపడ్డారని, వారిని తరిమివేశారని, వైకాపా పాలనాకాలంలో డ్రెయిన్ కాలువల పూడికలు తీయించలేదని చెప్పారు. ఇప్పటికే నియోజకవర్గ పరిధిలో పలు ప్రధాన, అంతర్గత రోడ్లు నిర్మాణం చేశామని, త్వరలోనే డ్రైయిన్ల నిర్మాణం కూడా చేపడతామని శాసనసభ్యులు వివరించారు. డ్రైయినేజీ సమస్యను కూడా త్వరగా పరిష్కరించడానికి తమ ప్రభుత్వం పూర్తి స్థాయిలో చర్యలు తీసుకుంటుందని ఎమ్మెల్యే గద్దె తెలిపారు. ప్రతి నిత్యం నియోజకవర్గంలో ఏదో ఒక డివిజన్‌లో పర్యటిస్తూ ప్రజా సమస్యలను స్వయంగా తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటున్నానని, తన పర్యటనల్లో ప్రజలు తెలియజేసిన సమస్యలను ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సహకారంతో పరిష్కరించడానికి తన వంతుగా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే గద్దె తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవినేని అపర్ణ, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షులు చలసాని రమణ, మన్నే జయప్రకాష్, పొలగాని జగన్మోహనరావు, దండమూడి చంద్రశేఖర్, వీరపనేని రామారావు, అట్లూరి మోహన్ కుమార్, కొత్తూరు రాము, యార్లగడ్డ రంగారావు, బెజవాడ నజీర్, పర్వతనేని రాజేంద్ర ప్రసాద్, కొమ్మినేని శ్రీధర్ గల్లా రవి. తదదితరులు పాల్గొన్నారు.

# "పవర్" చుట్టే రాజకీయం

- బంధుప్రీతి దే గెలుపు
- ఖమ్మం లో మొదలైన కౌంట్ డౌన్
- ఇంటి ఓనర్లనే నిర్బంధించిన పోలీసు



ఖమ్మం , నేటి శుభోదయ ::: ఇరాన్ లాంటి చిన్న దేశం పై అమెరికా లాంటి అగ్రదేశం దాడి చేసిన విషయం పై ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది . అదే కోవలో తెలంగాణ రాష్ట్ర ఖమ్మం జిల్లా , ఖమ్మం నగరంలో గల 16 వ డివిజన్ ఓ యుద్ధం జరిగినట్లు ఆ ఏరియాలో ఇప్పుడు హాట్ టాపిక్ గా చర్చించు కోవడం కొసమెరుపు. అక్కడ మూడు, నాలుగు రోజులుగా అండర్ డ్రైనేజ్ కాలువల నిర్మాణం పై అధికార పార్టీకి చెందిన నేతలు, ప్రజాప్రతినిధులు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, రెవెన్యూ, పోలీసు అధికారులు సైతం పెద వర్గాలకు చెందిన భూమిని సైతం తమదే అని భావించి వారి నిర్ణయం కూడా తీసుకోకుండా వారి ఇష్టానుసారంగా ప్రవర్తించిన తీరు చూస్తే ఇప్పుడు అధికార పార్టీ పై ప్రజల్లో ఉన్న నమ్మకం పూర్తిగా కోల్పోయిన సందర్భం తీవ విమర్శలకు దారితీసింది. ఇదంతా ఖమ్మం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి తుమ్మల నాగేశ్వరరావు కి తెలిసే జరిగిందా లేదా అనేది కూడా ఇప్పుడు హాట్ టాపిక్ గా మారుతోంది. అధికార యంత్రాంగం మంత్రి ని తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారనే ఆరోపణలు సర్వత్ర వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా జరగాల్సిన నష్టం జరిగి పోయింది. చెతులు కాలిన తరువాత ఆకులు పట్టుకున్నట్లు ఉంది అధికారుల తీరు పట్ల ప్రజల్లో చులకన భావం కలుగుతుంది. "పవర్" చుట్టే రాజకీయం నడుస్తోంది అని ఖమ్మం జిల్లా తో పాటు తెలంగాణ రాష్ట్రంలో ప్రతి పక్ష పార్టీలు గుస గుస లాడుతున్నాయి. బంధు ప్రీతే గెలుపు దిశగా అడుగులు వేస్తోంది అనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు మరి. ఇదంతా చూస్తే ఖమ్మం నుంచే అధికార పార్టీకి ప్రజల్లో ఆదరణను ఒక్క సారి పరిశీలిస్తే కౌంట్ డౌన్ షురూ అయింది అని తెలుస్తోంది. ఈ కాలువ నిర్మాణం విషయంలో ఆ డివిజన్ కు చెందిన ఇద్దరు ఓనర్లనే టార్గెట్ చేసి పోలీసులు ఖమ్మం ఖానా పురం పోలీస్ స్టేషన్ లో గంటల కొద్దీ నిర్బంధం చేసి తమ పనిని ముగించుకొని తాము విజయం సాధించామని సక్కలు గుద్దు కున్న చందం గా ఉంది పరిస్థితి. అక్కడ ఉన్న భూస్వామి భూమి ని సెంటు కూడా నష్టం వాటిల్లికుండా చూడటం చూస్తే పలు అనుమానాలకు తావు ఇస్తోంది. మరోవైపు ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఏకపక్షంగా నిర్ణయం తీసుకొని ఇష్టానుసారంగా ప్రవర్తించిన తీరు చూస్తే ఇప్పుడు హాట్ టాపిక్ గా మారుతోంది. అధికారం కాంగ్రెస్ కు సొత్తు కాదు అనే అనుమానం కలగమానదు. భవిష్యత్తులో ఆ పార్టీ కి తగిన గుణపాఠం చెప్పాలనే భావనా ప్రజల్లో ఇప్పటి నుంచే వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి. అధికారం ముసుగులో ఏదైనా చేసేనా తమకు అనుకూలంగా ప్రజలు ఉంటారని భ్రమ లో కాంగ్రెస్ ఉంటే భవిష్యత్తులో ప్రజలే బుద్ధి చెబుతారనే భావనా ప్రజల్లో నేలకొంది. ఇది ఇలా ఉండగా గంగమ్మ గుడి ఎస్టిపి డ్రైనేజీ పనులపై అధికారులకు అక్కడి ప్రజలు వినతి పత్రం సమర్పించిన న్యాయం చేయకపోగా నష్టం చేశారనే ఆరోపణలు సర్వత్ర వినిపిస్తున్నాయి. ఖమ్మం నగరం 16వ డివిజన్ పరిధిలోని గంగమ్మ గుడి ప్రాంతంలో జరుగుతున్న ఎస్టిపి డ్రైనేజీ పనులపై అభ్యంతరం చెబుతూ స్థానికులు గ్రీవెన్స్ డే లో వివరించిన పట్టించుకోక పోవడం శోచనీయం. గంగమ్మ గుడి పక్క నుండి రావలసిన ఎస్టిపి పైపులైను శ్రీరామ్ నగర్ రోడ్డు నెంబర్ 13 లో ఉన్న ఇండ్లు మధ్య నుండి కొంతమంది ప్రభావంతో అధికారులు పనులలో మార్పులు చేసి కావాలనే తమ ఇండ్లు మధ్యన పైపులు వేశారని ఆరోపించారు. ఈ పైపులైను నిర్మాణాలను మార్చడంతో 16వ డివిజన్లోని రోడ్డు నెంబర్ 13 లో నివసిస్తున్న ప్రజలు తీవ్ర మనస్తాపం చెంది ఆందోళన చెందారు. ఇప్పటికే నిర్మించుకున్న ఇళ్ల మధ్య నుండి డ్రైనేజీ పైపులైను పోవటంతో తమ ఇల్లుకు నష్టం వాటిల్లింది అని ఆ ప్రాంత వాసులు ఉషా, నిర్మల ఆరోపించారు. మంగళవారం తమను పోలీసులు నిర్బంధం చేసి పోలీసు స్టేషన్ కు తరలించినట్లు తెలిపారు. ఈ కాలువ నిర్మాణం కారణంగా ఆ ప్రాంత ఇండ్లు కూలిపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పైపులైను లకారం డ్రైనేజీ కాలువ పక్క నుండి దంసలాపురం చెరువులో కలిపేందుకు నిర్మిస్తున్న ఎస్టిపి పైపులైను గంగమ్మ గుడి వరకు వచ్చి అక్కడ నుండి కొంత దూరం కొనసాగుతూ పొలాల మధ్య నుండి నివాసం ఉంటున్న ఇళ్ల మధ్య నుండి వెళ్ళటం అధికారులు కావాలనే ఇలా చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్ టి పి డ్రైనేజీ వ్యవస్థను నిర్మించడం కారణంగా భవిష్యత్తులో తమకు దీర్ఘ కాలిక జబ్బులు వచ్చే అవకాశం లేకపోలేదు అని చెప్పారు. ఇండ్ల మధ్య జరుగుతున్న పనులలో పెద్దపెద్ద బండరాళ్లను బాంబులు పెట్టి పేలుస్తున్నారని దీంతో సమీపంలోని ఇండ్లు బీటలు వారి ప్రమాదం పొంచి ఉంది అని తెలిపారు. ఈ కాలువ నిర్మాణం పై స్థానిక కార్పొరేటర్ ను స్వయంగా కలిసి విషయం వివరించిన తమకు హామీ ఇచ్చి వెంటనే నిర్మాణం పనులు చేసి తమకు అన్యాయం చేశారని ఆరోపించారు. ఆ సమీపంలోని భూస్వామి తమ భూమి కోల్పోతాడని దానినీ మార్చి తమ ఇళ్ల మధ్యలోకి తీసుకురావడం ఆందోళన కలిగిస్తుందని అన్నారు. స్థానిక ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గతంలో ఉన్న కాలువ ద్వారా పైపులైను పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేసినా తమ ఆవేదన ను పట్టించుకోక పోవడం శోచనీయం అని ఆ ప్రాంత రైతులు,ప్రజలు ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఇలా ఉండగా ఆ ప్రాంత రైతులు రామసంఘం, వరద నరసింహారావు, డాక్టర్ పి శ్యాం సుందర్, సంద్ర సత్యం లకు చెందిన భూమిని కూడా కోల్పోయిన సందర్భం గుర్తు చేశారు.

## పంచాయతీ అభివృద్ధిలో పిడిఓ, సిబ్బంది కార్మికుల సేవలు ప్రశంసనీయం



పులిచెర్ల, ఏప్రిల్ 7,(నేటి శుభోదయ) :పంచాయతీ అభివృద్ధిలో పంచాయతీ అభివృద్ధి అధికారి పంచాయతీ సిబ్బంది.. పంచాయతీ కార్మికుల సేవలు ప్రశంసనీయమని చిత్తూరు డివిజన్ అభివృద్ధి అధికారి రవికుమార్ అన్నారు. చిత్తూరు జిల్లా, పులిచెర్ల మండలం, కల్లూరు పంచాయతీ కార్యాలయంలో. పంచాయతీ అభివృద్ధి అధికారి రమణయ్య ఆధ్వర్యంలో. సమావేశం నిర్వహించారు. పంచాయతీలో 2025 ఏప్రిల్ ఒకటవ తేదీ నుంచి 2026 మార్చి 31వ తేదీ వరకు పంచాయతీకి రావలసిన ఇంటి పన్నులు. రూ 20 లక్షలు వసూలు చేసి నూరు శాతం రికార్డు సాధించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయంలో మంగళవారం. అభినందన సభ ఏర్పాటు చేశారు. డి డి వో రవికుమార్, అందర్నీ ప్రశంసించి పంచాయతీ అభివృద్ధి అధికారి రమణయ్య, జూనియర్ అసిస్టెంట్ కిరణ్ కుమార్, మధు, కంప్యూటర్ ఆపరేటర్స్ రమణి, ప్రసన్న, పూర్ణ, పంచాయతీ కార్మికులను సన్మానించి అభినందించారు.

## వేసవిలో నీటి యాజమాన్యం, ఎరువుల మోతాదు పై అవగాహన

ఖమ్మం, నేటి శుభోదయ ::: ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ లో

వేసవి కాలంలో నీటి యాజమాన్యం, ఎరువుల సమర్థ వినియోగంపై రైతులకు అవగాహన కల్పించే ఉద్దేశంతో ఉద్యాన విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో రైతు వేదికలలో "రైతు నేస్తం" వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు వేసవి పరిస్థితుల్లో పంటల సంరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ముఖ్యంగా నీటి పొదుపు పద్ధతులు, యూరియా అధిక వినియోగం వల్ల కలిగే ప్రతికూల ప్రభావాలు, యూరియా వినియోగాన్ని తగ్గిస్తూ నానో యూరియా వినియోగాన్ని పెంచుకోవాల్సిన అవసరాన్ని రైతులకు తెలియజేశారు. వేసవి కాలాన్ని తట్టుకునే పంట రకాలను ఎంపిక చేసుకోవడం, పంటల సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను కూడా వివరించారు.యూరియా బుకింగ్ యాప్పై రైతుల అభిప్రాయాలను సేకరించడంతో పాటు, దాని వినియోగంలో ఎదురవుతున్న సమస్యలను కూడా చర్చించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ కు వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని రైతులకు మార్గదర్శనం చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, ఉద్యాన శాఖ అధికారులు నగేష్, విష్ణు, వ్యవసాయ విస్తరణ అధికారిణి బాల బత్తుల శరణ్మయి, పలువురు రైతులు పాల్గొన్నారు.

## ఇల్లందు లో జీతాల పండుగ ఒక జాతర

- జీతాల పండుగ ఒక మధుర జ్ఞాపకం

ఖమ్మం, ఇల్లందు, నేటి శుభోదయ ::: నాలుగు దశాబ్దాల క్రితం ఇల్లెందు లో ప్రతినెల 8వ తేదీ సింగరేణి కార్మికులకు జీతాల పండుగగా ఉండేదని, ఆరోజు పట్టణంలో ఒక జాతరగా ఉండేదని సీనియర్ జర్నలిస్ట్ ఎస్ వి. సూర్యనారాయణ తెలిపారు. ఇల్లందు పరిధిలో అప్పట్లో పదివేల మంది కార్మికులు బొగ్గు గనుల వద్ద నగదు రూపంలో ప్రతినెలా ఎనిమిదవ తేదీన జీతాలు తీసుకునేవారని, అదే రోజు తమకు కావలసిన నిత్యావసర వస్తువులు, గృహోపకరణాలు కొనుగోలు చేసేవారని ఆయన తెలిపారు. అప్పట్లో ప్రస్తుతం ఆమ్ బజార్ గా పిలవబడుతున్న గాంధీ బజార్ కార్మికులతో ఎంతో రద్దీగా ఉండేదని, వ్యాపార కార్యకలాపాలు తారస్థాయికి చేరేవని ఆయన వివరించారు. జీతాల పండుగల విశేషాలు ఆయన ఈ పత్రికాప్రతినిధికి తెలియజేశారు. కిరాణా షాపులకు, బట్టల షాపులకు, స్వీట్ స్టాల్స్ కు, కూరగాయల మార్కెట్ కు ఎంతో గిరాకీ ఉండేది. ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇల్లెందుకు వచ్చి ఆరోజు దుకాణాలు పెట్టేవారు. పట్టణం ఒక జాతరను తలపించేది. వాణిజ్య షాపుల నుంచి క్రెడిట్ పై తీసుకున్న వస్తువులకు ఆరోజు కార్మికులు డబ్బు చెల్లించేవారు. ఇల్లెందులోని 24 ఏరియాలో సింగరేణి కార్మికుల సౌకర్యార్థం సంతను నిర్వహించేవారు. ఈ సంతలో కార్మికులకు అవసరమైన అన్ని వస్తువులు సరసమైన ధరలకు లభ్యమయ్యేవి.ఇందులో తట్టలు, బుట్టలు, చాటలు, తడికలు, దుప్పట్లు, మేకలు అన్నీ లభ్యమయ్యేవి. తాము కష్టపడి పనిచేసి సంపాదించిన వేతనాలను కొంతమంది కార్మికులు అప్పట్లో విపరీతంగా ఖర్చు చేసేవారు. డబ్బులు దుర్వినియోగం చేయకుండా ఉండటానికి కొంతమంది కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులు కూడా మైన్స్ కౌంటర్ల దగ్గరకు వచ్చేవారు. భూగర్భగనులలో ఎంతో కష్టపడి పనిచేసిన తమ శ్రమ కు ఫలితంగా జీతాలు అందుకునే రోజు కార్మికులు ఎంతో ఆనందంగా, ఉత్సాహంగా ఉండేవారు. గతంలో రెగ్యులర్ గా విధులకు హాజరై సంవత్సరంలో అత్యధిక మస్టర్లను పొందిన కార్మికులకు కంపెనీ యాజమాన్యం సైకిళ్లను, రిస్ట్ వాచీలను బహుకరించేది. రిటైరైన కార్మికులకు సూట్ కేసులను ఇచ్చేవారు. ఇల్లెందులో పదివేల మంది కార్మికులతో కళకళలాడిన బొగ్గుగనులకు ప్రతినెల ఒక జాతరగా ఉండే జీతాల పండుగ ( 8 వ తేదీ ) ను ప్రజలు ఎప్పటికీ మరువలేరని సీనియర్ జర్నలిస్ట్ సూర్యనారాయణ అభిప్రాయపడ్డారు.

## త్రివేణి లో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు

ఖమ్మం, నేటి శుభోదయ ::: ఖమ్మం నగరంలో గల త్రివేణి ఉన్నత పాఠశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ ఆహారపు అలవాట్లు వాటి పర్యవసానాలు గురించి వివరిస్తూ పిల్లలు అంతా కూడా జంక్ ఫుడ్ కు దూరంగా ఉండాలని మనం తీసుకునే కూరగాయలు కానీ పండ్లు గాని ఒకటికి రెండుసార్లు కడిగి వాడుకోవాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జంక్ ఫుడ్ కు దూరంగా ఉంటూ ఇంటి భోజనాన్ని తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిల్లలు వివిధ రకాల ఆహార పదార్థాలను ప్రదర్శించారు. పిల్లలు ఇకనుంచి జంక్ ఫుడ్ కు దూరంగా ఉంటామని అందుబాటులో ఉండే పండ్లు కూరగాయలు, ఆకుకూరలు వాడతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ ముస్తఫా, స్వప్న, క్యాంపస్ ఇంచార్జ్ విక్టర్ చార్లెస్, ట్రాన్స్పోర్ట్ ఇంచార్జ్ సందీప్, ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## గన్నవరం నియోజకవర్గంలో రూ. 34.95 కోట్ల ఏ.పీ.సీ.ఆర్. డి. ఎ.నిధులతో బల్లెం వారి వీధి జంక్షన్ నుండి నిడమానూరు మెయిన్ రోడ్డు వరకు రహదారి విస్తరణ పనులకు శంకుస్థాపన

-జనాభా లెక్కల ప్రక్రియ పూర్తయ్యాక విజయవాడ మరియు తిరుపతి నగరాలను 'గ్రేటర్' నగరాలుగా ప్రకటిస్తామని మంత్రి పి. నారాయణ వెల్లడి

-విజయవాడ రూరల్ గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేయాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు విజ్ఞప్తి





విజయవాడ, ఏప్రిల్ 7 ( అజయ్ నారగాని - నేటి శుభోదయ ) మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం రూ. 105 కోట్ల వ్యయంతో చేపట్టిన మూడు ప్రధాన రహదారుల అభివృద్ధి పనులకు మున్సిపల్ శాఖ మంత్రి పి. నారాయణ శంకుస్థాపన చేశారు. గన్నవరం నియోజకవర్గానికి రూ. 34.95 కోట్ల ఏపీసీఆర్ డి ఎ నిధులతో బల్లెం వారి వీధి జంక్షన్ (హిస్టరీ లైన్ రోడ్) నుండి నిడమానూరు మెయిన్ రోడ్ వరకు రోడ్డు విస్తరణ, అత్యాధునిక బీటీ (హాట్ మిక్స్) రోడ్డు నిర్మాణం, సెంటర్ డిజైనింగ్, లైటింగ్ ఏర్పాట్లతో కూడిన ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్ ,విజయవాడ ఎంపీ కేశినేని శివనాద్ (చిన్ని), మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఏపీ ప్రభుత్వ విప్ గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బోడే ప్రసాద్ తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ విజయవాడతో పాటు తిరుపతి నగరాలను గ్రేటర్ నగరాలుగా మార్చే ప్రతిపాదన ప్రభుత్వం వద్ద ఉందని, దేశవ్యాప్తంగా జరుగుతున్న జనాభా లెక్కల ప్రక్రియ పూర్తయ్యాక విజయవాడను 'గ్రేటర్'గా ప్రకటిస్తామని తెలిపారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు మాట్లాడుతూ తన నియోజకవర్గం విజయవాడ రూరల్ మండలం పరిధిలోని 9 గ్రామాల ప్రజలు చెత్త సేకరణ, తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కేవలం పైప్‌లైన్ పొడిగింపుతోనే పరిష్కారం అయ్యే తాగునీటి సమస్యను గత పాలకులు విస్మరించారని అన్నారు. ఈ గ్రామాలను విజయవాడ మున్సిపాలిటీలో విలీనం చేసి శాశ్వత పరిష్కారం చూపాలని ఆయన మంత్రిని కోరారు.

## జన్ శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో ఘనంగా ఖమ్మం (తెలంగాణ) ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

: సంస్థ ఖమ్మం జిల్లా జె యస్ యస్ డైరెక్టర్ వై రాధాకృష్ణ




ఖమ్మం, నేటి శుభోదయ ::: జన్ శిక్షణ సంస్థాన్, ఖమ్మం ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని ఖమ్మం పట్టణంలోని రాధాకృష్ణ నగర్ పార్క్, చైతన్య నగర్, సాంబాని నగర్ ప్రాంతాలలో మంగళవారం ఘనంగా నిర్వహించామని జె యస్ యస్ ఖమ్మం జిల్లా డైరెక్టర్ వై రాధాకృష్ణ తెలిపారు.ఈ కార్యక్రమంలో మొత్తం 120 మంది లబ్ధిదారులు పాల్గొన్నారు.తెలంగాణ లోని ఖమ్మం లో గల జన శిక్షణ సంస్థ, "ప్రపంచ ఆరోగ్య దినోత్సవం-2026" సందర్భంగా ప్రజల కోసం "ఉచిత ఆరోగ్య పరీక్షా శిబిరాన్ని" నిర్వహించి, ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించింది.ఈ సందర్భంగా డైరెక్టర్ రాధాకృష్ణ మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం, మన ఆరోగ్యం మన చేతుల్లో ఉన్నది అనేది సత్యం. ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి.ఆరోగ్య పరిరక్షణ, శుభ్రత, సమతుల్య ఆహారం, వ్యాయామం వంటి ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. అందరు మంచి ఆరోగ్యం కోసం రోజువారీ జీవితంలో పాటించాల్సిన అలవాట్లను వివరించారు.పరిసరాల పరిశుభ్రత, మురుగు నీరు నిల్వ లేకుండా ఇంటి ముందు ఇంకుడు గుంత తియ్యటం మంచిది, దోమల కాటునుండి మనలను మనమే కాపాడుకోవాలి, పిల్లలు, పెద్దలు జంకు ఫుడ్ కు దూరంగా ఉండాలి, మంచి పోషకాలున్న ఆహార పదార్థాలను తినాలి, అంటువ్యాధులు రాకుండా జాగ్రత్త పడాలి, ప్రతి ఒక్కరూ విధిగా యోగ, వాకింగ్, వ్యాయామం చేయాలి అని డైరెక్టర్ రాధాకృష్ణ సూచించారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ముఖ్యాంశాలు జన్ శిక్షణ సంస్థాన్, ఖమ్మం ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించబడింది. కార్యక్రమం ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం లక్ష్యంగా జరిగింది. రిసోర్స్ పర్సన్స్ ఆరోగ్య పరిరక్షణ, శుభ్రత, పోషకాహారం, వ్యాయామం గురించి వివరించారు. రోజువారీ జీవితంలో ఆరోగ్యకరమైన అలవాట్ల ప్రాముఖ్యతను తెలియజేశారు. స్థానిక మహిళలు చురుకుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. సమాజంలో ఆరోగ్యంపై చైతన్యం పెంచడంలో ఈ కార్యక్రమం ముఖ్య పాత్ర పోషించింది. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో ఆరోగ్యంపై మంచి అవగాహన కలిగింది. విజయవంతంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమం లో జె యస్ యస్ ఖమ్మం జిల్లా డైరెక్టర్ వై రాధాకృష్ణ, స్టాఫ్, రిసోర్స్ పర్సన్స్ శాంతి, స్రవంతి, నవిత, బెనెఫిషరీస్, స్థానిక మహిళలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో మెగా జాబ్ మేళా కీలకం

జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి స్టాఫ్ రిపోర్టర్ , ఏప్రిల్-07, నేటి శుభోదయ:యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో మెగా జాబ్ మేళా కీలకమని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో మెగా జాబ్ మేళా నిర్వహణపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ.....99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం సందర్భంగా మెగా జాబ్ మేళాలను నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం చేయడానికి టాస్క్, డీట్ , జిల్లా ఉపాధి కార్యాలయ అధికారులు సమన్వయంతో పని చేసి జాబ్ మేళాలను నిర్వహించాలని సూచించారు. మే 1 నుండి 13 వరకు ఉమ్మడి జిల్లాల ప్రధాన కేంద్రాలలో జాబ్ మేళాలను నిర్వహించాలని, మే 14 నుండి 24 వరకు ఇతర ప్రాంతాలలో మెగా జాబ్ మేళాలను నిర్వహించాలని తెలిపారు. మే 25 లేదా 26 తేదీలలో ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను కలెక్టర్ లేదా ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అందజేయాలని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లాలో మెగా జాబ్ మేళా నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు సమగ్రంగా చేయాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమం నిర్వహణ స్థలం, పాల్గొనే సంస్థల సంఖ్య, కల్పించనున్న ఉద్యోగ అవకాశాలు, అభ్యర్థుల సౌకర్యాలు వంటి ప్రతి అంశాన్ని సూక్ష్మంగా ప్రణాళిక చేయాలని సూచించారు. టాస్క్, ఇతర శిక్షణ కేంద్రాల ద్వారా నిరుద్యోగ యువతకు సరైన శిక్షణ అందించి, జాబ్ మేళాలో పాల్గొనేందుకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించాలని తెలిపారు. మంచి ఉపాధి అవకాశాలను పొందేందుకు యువతను సిద్ధం చేయడం ముఖ్యమని పేర్కొన్నారు. టాస్క్ ప్రాంతీయ కేంద్రం ద్వారా నిరుద్యోగ యువతకు నిరంతరం నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ, నైపుణ్యాలతో పాటు అవసరమైన ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తున్నట్లు తెలిపారు. యువత టాస్క్ వంటి సదుపాయాలను పూర్తి స్థాయిలో వినియోగించుకొని తమ భవిష్యత్తును మెరుగుపరుచుకోవాలని సూచించారు. అలాగే జిల్లా లోని అన్ని డిగ్రీ, ప్రొఫెషనల్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమన్వయ సమావేశం నిర్వహించాలని సూచించారు. ప్రస్తుత విద్యార్థులతో పాటు పూర్వ విద్యార్థులను కూడా సంప్రదించి, జాబ్ మేళా ద్వారా లభించే ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించాలని, అవసరమైన నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధి కల్పనాధికారి ,తిరుపతిరావు జిల్లా పరిశ్రమల అధికారి, కీర్తి కాంత్, టాస్క్ సెంటర్ అధికారి కౌసల్య, మార్కెటింగ్ అధికారి ప్రవీణ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏఐ.. 2025..ఉమెన్ రైజింగ్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)లో భారతీయ మహిళలకు సంబంధించి 2025 కీలక సంవత్సరంగా నిలిచింది. జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌డబ్ల్యూసీ) యశోద ఏఐ అభియాన్ కార్యక్రమం వల్ల క్షేత్రస్థాయిలో ఏఐ కోర్సులు చదివే మహిళల సంఖ్య బాగా పెరిగింది. టెక్నాలజీలో మహిళలకు సంబంధించిన ట్రెండ్‌లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) కోర్సులు కీలకంగా మారాయి. మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్), ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సులలో మహిళల పెరుగుదల నాలుగు రెట్లు పెరిగింది. ఈ సంవత్సరం ప్రారంభమైన జాతీయ మహిళా కమిషన్ (ఎన్‌డబ్ల్యూసీ) యశోద ఏఐ అభియాన్‌లాంటి ప్రభుత్వ కార్యక్రమాలు, ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్, రైజింగ్ 2025 సమ్మిట్‌లాంటి సదస్సుల ప్రభావం వల్ల ఏఐ కోర్సులు చేసే మహిళల సంఖ్య పెరుగుతోంది. మరోవైపు మహిళల నేతృత్వంలోని ఏఐ స్టార్టప్‌ల సంఖ్య పెరగడం శుభసూచకం.

### డీప్-టెక్ డొమైన్‌లలో...

2024తో పోల్చితే 2025లో ఏఐ/ఎంఎల్ మాస్టర్ ప్రోగ్రామ్స్‌లో మహిళల సంఖ్య 20 శాతం పెరిగింది. 'ఏఐ, ఎంఎల్‌లలో మాస్టర్స్ చదువుతున్న ప్రతి ఐదుగురు విద్యార్థులలో ఒకరు మహిళ. సంవత్సరం క్రితం వరకు ఇరవైమందిలో ఒకరు ఉండేవారు' అని తెలియజేసింది యూజీసీకి సంబంధించిన 'కాలేజి విద్య' ప్లాట్‌ఫామ్ రిపోర్ట్. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ప్రాంప్ట్ ఇంజినీరింగ్, సైబర్ సెక్యురిటీ, రోబోటిక్స్, డాటా సైన్స్‌లాంటి డీప్%-%టెక్ డొమైన్‌లలో మహిళల ప్రాతినిధ్యం పెరిగిందని రిపోర్ట్ తెలియజేసింది. ఈ సంవత్సరం ఏఐ ప్రోగ్రామ్‌లకు సంబంధించి మహిళల ఆసక్తి గణనీయంగా పెరిగిందని, ఎంసిఏ సైబర్ సెక్యూరిటీ ఎన్‌రోల్‌మెంట్స్‌లో మహిళలు 25 శాతం, జనరేటివ్ ఏఐలో డాక్టోరల్ క్యాండిడేట్స్ 15 శాతం మంది ఉన్నారని నివేదిక వెల్లడించింది.

మార్పు మంచిదే కదా!

'మనలో వచ్చిన మార్పుకు ఈ అభివృద్ధి రేటు అద్దం పడుతుంది. ఫ్లెక్సిబుల్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్, ఇండస్ట్రీ రోల్ మోడల్స్ విజయగాథలు తెలుసుకునే అవకాశం ఈ పెరుగుదలకు కారణం. భారతదేశ సాంకేతిక భవిష్యత్తుకు సంబంధించి మహిళలు కీలకపాత్ర పోషించబోతున్నారని ఈ మార్పును చెబుతుంది' అంటున్నారు 'కాలేజి విద్య' చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ రోహిత్ గుప్తా. పెద్ద పెద్ద నగరాలలో మాత్రమే కాదు ద్వితీయ శ్రేణి, తృతీయ శ్రేణి పట్టణాలలో కూడా మహిళలు ఏఐ కోర్సులపై అమిత ఆసక్తి చూపిస్తున్నారు. సైబర్ భద్రతా నైపుణ్యాలపై మహిళలు దృష్టి సారించేలా యశోద ఏఐ అభియాన్ కార్యక్రమాలు చేపట్టింది.

### స్టాన్‌ఫోర్డ్ ఏఐ ఇండెక్స్ 2025


స్టాన్‌ఫోర్డ్ ఏఐ ఇండెక్స్ 2025 ప్రకారం ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఏఐ నైపుణ్యం కలిగిన వారిలో భారతీయ మహిళలు ఉన్నారు.'ఎనాలటిక్స్' ఇండియా మ్యాగజైన్ సమ్మిట్ ఏఐలో మహిళల భాగస్వామ్యంపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించింది. మొత్తంమీద, ఏఐకి సంబంధించి 2025 సంవత్సరం మహిళలకు కీలకమైన సంవత్సరం నిలుస్తుంది.

### యశోద ఏఐ అంటే?

డిజిటల్ రంగంలో లింగ అంతరాన్ని తగ్గించడానికి ఈ సంవత్సరం మే 22న యశోద ఏఐ అభియాన్ ముందుకు వచ్చింది.

యువర్ ఏఐ సాక్షి ఫర్ షేపింగ్ హోరిజన్స్ విత్ డిజిటల్ అవేర్‌నెస్‌కు సంక్షిప్తరూపం... యశోద ఏఐ.

ఎన్‌సీడబ్ల్యూ, ఫ్యూచర్ షిఫ్ట్ ల్యాబ్స్ (ఎఫ్‌ఎస్‌ఎల్) సహకారంతో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ ప్రచార కార్యక్రమం బరేలీలోని మహాత్మా జ్యోతిబా పూలే రోహిల్‌ఖండ్ విశ్వవిద్యాలయంలో ప్రారంభమైంది. 'భారతదేశం అంతటా ఒక కోటిమంది మహిళలకు డిజిటల్ నైపుణ్యం' అనే దీర్ఘకాలిక లక్ష్యంతో ప్రయాణం మొదలు పెట్టింది యశోద ఏఐ అభియాన్. మొదటి దశలో రెండు లక్షల మందికి పైగా మహిళలకు శిక్షణ ఇవ్వడాన్ని లక్ష్యంగా నిర్ణయించుకుంది. మొబైల్ యాప్, శిక్షణ కార్యక్రమాల ద్వారా మహిళలకు ఏఐ సాధనాలు, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ అక్షరాస్యతలో ఆచరణాత్మక జ్ఞానాన్ని అందిస్తోంది. ఏఐ సాంకేతికతను సులభతరం చేయడానికి స్థానిక భాషలలో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తోంది.



### మహిళలకు ఏఐ, సైబర్ సెక్యూరిటీ ఎందుకు కీలకం?

హ్యాకింగ్, ఆన్‌లైన్ వేధింపులలాంటి సైబర్ నేరాల నుంచి తమను తాము రక్షించుకోవడానికి, ఏఐ రంగంలో అద్భుతమైన ఉద్యోగాలు సాధించడానికి, సాధికారతకు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లను సురక్షితంగా నావిగేట్ చేయడానికి, కొత్త అవకాశాలను అన్వేషించడానికి, లింగ వివక్ష లేకుండా ఉండడానికి మహిళలకు ఏఐ, సైబర్ సెక్యూరిటీ ముఖ్యం అని యూఎన్ నివేదిక తెలియచేసింది. కాలేజీ స్టూడెంట్. సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ (ఎస్‌హెచ్‌జీ), ఆశావర్కర్, టీచర్, పంచాయతీ వార్డు మెంబర్ ఇలా ఎవరైనా కావచ్చు... యశోద ఏఐ అభియాన్‌లో చేరవచ్చు.

'ఇది కేవలం శిక్షణా కార్యక్రమం మాత్రమే కాదు. ఏఐ, సైబర్ సెక్యూరిటీకి సంబంధించి మహిళా సాధికారతను ఉన్నతస్థాయిలో తీసుకువెళ్లే ఉద్యమం' అనే ప్రశంసలు అందుకుంటోంది యశోద ఏఐ అభియాన్.

### ఏఐ బై హర్...గ్లోబల్ ఇంపాక్ట్ చాలెంజ్

గ్లోబ్ ఇంపాక్ట్ ఛాలెంజెస్...'ఏఐ బై హర్' 'ఏఐ ఫర్ ఆల్' 'యువ్ ఏఐ'ల కోసం భారత ప్రభుత్వం దరఖాస్తులను ఆహ్వానించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)కి సంబంధించి నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి మహిళా సాంకేతిక నిపుణులను ఆహ్వానిస్తుంది. మహిళల నేతృత్వంలో ఏఐ ఆవిష్కరణలకు ప్రోత్సాహం అందించడానికి, వ్యవసాయం. సైబర్‌సెక్యూరిటీ, విద్య, డిజిటల్ వెల్‌బీయింగ్, ఆరోగ్యసంరక్షణ, ఎనర్జీ అండ్ క్లైమేట్ రంగాలలో, ఏఐకి సంబంధించి నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, నీతి అయోగ్, ఇతర సంస్థల భాగస్వామ్యంతో గ్లోబల్ ఇంపాక్ట్ చాలెంజ్ 'ఏఐ బై హర్'కు శ్రీకారం చుట్టారు. 'ఏఐ-ఫర్-గుడ్ అప్లికేషన్స్' లక్ష్యంతో ఫిబ్రవరి 2026లో న్యూ ఢిల్లీలో ఇండియా-ఏఐ ఇంపాక్ట్ సదస్సు జరగనుంది.

### ఎన్ని స్టార్టప్‌లో!

ఈ సంవత్సరం మహిళల నేతృత్వంలోని స్టార్టప్‌ల సంఖ్యలో పెరుగుదల కనిపించింది. ట్రాక్షన్ డేటా ప్రకారం...అక్టోబర్ 2025 నాటికి దేశవ్యాప్తంగా మహిళల నేతృత్వంలో 7,000 కంటే ఎక్కువ స్టార్టప్‌లు పనిచేస్తున్నాయి. ఫండింగ్‌కు సంబంధించి వీటికి మంచి స్పందన వచ్చింది. మహిళల నేతృత్వంలోని ఏఐ వెంచర్‌లలో కొన్ని... డా.గీతా మంజునాథ్-నిరామయి హెల్త్ ఎనాలిటిక్స్, అశ్వినీ అశోకన్-మ్యాడ్ స్ట్రీట్ డెన్, చంద్రాలిక హజారిక-బిగ్ థింక్స్, ప్రాంజలీ అవస్థీ-డెల్వ్.ఏఐ, కృష్ణప్రియ ఆకెళ్ల-స్టార్‌బజ్.ఏఐ, నిధి-నెమా ఏఐ, రిత్వికా చౌదరి-అన్‌స్క్రిప్ట్.ఏఐ, లైనా ఇమ్మాన్యుయేల్, రింజిమ్ అగర్వాల్-బ్రెయిన్‌సైట్.ఏఐ.

# వేసవిలో కోకుమ్ జ్యూస్ లేదా ఉసిరి కాయ జ్యూస్.. రెండింటిలో దేన్ని తీసుకుంటే ఎక్కువ ఫలితం ఉంటుంది..?

వేసవి వేడి ఎక్కువగా పెరుగుతున్న సమయంలో ప్రజలు శరీరాన్ని చల్లగా ఉంచుకోవడానికి అనేక రకాల ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. ముఖ్యంగా శరీరాన్ని చల్లబరిచే పానీయాలను ఎక్కువగా తీసుకుంటూ ఉంటారు. వేసవిలో బయట మార్కెట్ లో లభించే శీతల పానీయాలకు బదులుగా సంప్రదాయ జ్యూస్ లను తీసుకోవడం మంచిది. వేసవిలో తీసుకోదగిన సహజ పానీయాల్లో కోకుమ్ జ్యూస్, ఉసిరి జ్యూస్ లు ముందు వరుసలో ఉంటాయని చెప్పవచ్చు. ప్రజలు కూడా వేసవిలో కోకుమ్ జ్యూస్, ఆమ్లా జ్యూస్ వంటి పానీయాలను ఎక్కువగా తీసుకుంటూ ఉంటారు. ఈ సంప్రదాయ సూపర్‌ఫుడ్స్‌తో తయారయ్యే ఈ జ్యూసులు శరీరానికి లోపల నుంచి చల్లదనం కలిగించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి. కోకుమ్ పండ్లు, మొత్తం ఉసిరి కాయలు పోషకాలను అధికంగా కలిగి ఉంటాయి.

### తాజా జ్యూస్‌లను తీసుకోవడం శ్రేయస్కరం..

అయితే ప్రస్తుతం మార్కెట్లో సిరప్స్, పౌడర్ రూపంలో లభిస్తున్న జ్యూసులతో పోలిస్తే తాజా కోల్డ్-ప్రెస్డ్ జ్యూస్ లను తీసుకోవడం ఎక్కువ ప్రయోజనకరమని వైద్యులు చెబుతున్నారు. రెడీమేడ్ జ్యూసుల్లో కృత్రిమ రంగులు, రుచులు, రసాయనాలు ఉండే అవకాశం ఉంది. ఇవి ఆరోగ్య ప్రయోజనాలను తగ్గించవచ్చని కనుక తాజా జ్యూస్ లనే తీసుకునే ప్రయత్నం చేయాలని చెబుతున్నారు. అసలు వేసవిలో జ్యూస్ లను ఎందుకు తీసుకోవాలి.. కోకుమ్, ఉసిరి జ్యూస్ లలో ఏది శరీరానికి మేలు చేస్తుంది.. వంటి విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం. వేసవిలో జీర్ణవ్యవస్థ నెమ్మదిస్తుంది. అందుకే ఆహారాన్ని తక్కువగా తీసుకుంటారు. ఈ సమయంలో కోకుమ్ లేదా ఆమ్లా జ్యూస్ వంటి పానీయాలను తీసుకోవడం వల్ల శరీరానికి నీరు అందుతుంది. అవసరమైన పోషకాలు లభిస్తాయి. శరీరం లోపల నుంచి చల్లగా ఉంటుంది.

### కోకుమ్ జ్యూస్‌తో కలిగే లాభాలు..



ఇక కోకుమ్ జ్యూస్ ను కోకుమ్ పండుతో తయారు చేస్తారు. దీనిలో విటమిన్ సి అధికంగా ఉంటుంది. దీనిని తీసుకోవడం వల్ల శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అలాగే దీనిలో ఆంథోసైనిన్లు వంటి శక్తివంతమైన యాంటీ ఆక్సిడెంట్లు కూడా ఉంటాయి. ఇందులో గార్సినాల్ కూడా ఉంటుంది. ఇది యాంటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలను, శోథ నిరోధక లక్షణాలను కలిగి ఉంటుంది. అలాగే దీనిలో హైడ్రాక్సీసిట్రిక్ యాసిడ్ వంటి ఆమ్లాలు కూడా ఉంటాయి. ఇవి జీర్ణశక్తిని మెరుగుపరచడంలో దోహదపడతాయి. అలాగే కొద్ది మొత్తంలో కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు కూడా ఇందులో ఉంటాయి. కోకుమ్ జ్యూస్ జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. వేసవిలో వచ్చే అలసటను తగ్గిస్తుంది.



### ఉసిరికాయ జ్యూస్ అయితే..

ఉసిరి జ్యూస్ కూడా పోషకాలను కలిగి ఉంటుంది. మార్కెట్లో లభించే ప్యాక్డ్ జ్యూసుల్లో ఆమ్లా శాతం తక్కువగా ఉండే అవకాశం ఉంది. కాబట్టి లేబుల్ చూసి తీసుకోవడం మంచిది. తాజా ఆమ్లా జ్యూస్‌లో విటమిన్ సి 600-700 ఎమ్జ వరకు ఉంటుంది. అలాగే పాలీఫెనాల్స్, ఫ్లేవనాయిడ్స్ బలమైన యాంటీ ఆక్సిడెంట్ చర్యను అందిస్తాయి. ఆక్సీకరణ ఒత్తిడి నుండి రక్షిస్తాయి. ఇందులో కాల్షియం, ఐరన్, ఫాస్ఫరస్, పొటాషియం వంటి ఖనిజాలు కూడా ఉంటాయి. ఈ జ్యూస్ లో ఉండే అమినో యాసిడ్లు శరీర జీవక్రియకు మద్దతును ఇస్తాయి. ఉసిరి జ్యూస్ లో ఉండే ఫైబర్ జీర్ణక్రియకు మద్దతును ఇస్తుంది. ఇందులో క్యాలరీలు తక్కువగా ఉంటాయి కనుక రోజూ తీసుకోవడానికి అనుకూలంగా ఉంటుంది. ఉసిరి జ్యూస్ రోగనిరోధక శక్తిని పెంచి, శరీరానికి శక్తినిస్తుంది.

### దేన్ని తీసుకోవాలి..

కోకుమ్ జ్యూస్, ఉసిరి జ్యూస్ రెండూ కూడా ఆరోగ్యానికి మేలు చేస్తాయి. కోకుమ్ జ్యూస్ శరీరాన్ని బాగా చల్లబరుస్తుంది. వేసవిలో వచ్చే జీర్ణ సమస్యలను తగ్గిస్తుంది. జీరా, ఉప్పు కలిపి ఈ జ్యూస్ ను తీసుకోవడం ఇంకా ప్రయోజనకరంగా ఉంటుంది. అదే విధంగా ఆమ్లా జ్యూస్ శరీరాన్ని హైడ్రేట్ చేస్తుంది. కొలెస్ట్రాల్ తగ్గించడంలో సహాయపడుతుంది. మెటబాలిజాన్ని మెరుగుపరుస్తుంది. రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. కోకుమ్ జ్యూస్ శరీరాన్ని చల్లగా ఉంచడంలో కొంచెం ఎక్కువ ప్రభావం చూపిస్తుంది. ఆమ్లా జ్యూస్ మొత్తం ఆరోగ్యానికి ఎక్కువ ప్రయోజనాలను అందిస్తుంది. ఈ రెండు జ్యూసులు కూడా ఆరోగ్యానికి మంచివే. ఏ జ్యూస్ తీసుకోవాలన్నది సొంత నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని వైద్యులు సూచిస్తున్నారు.

# పచ్చి ఉల్లిపాయలను రోజూ ఆహారంలో భాగంగా తింటే కలిగే అద్భుతమైన లాభాలు ఇవే..!



భారతీయుల వంటగదుల్లో సర్వ సాధారణంగా కనిపించే వాటిల్లో ఉల్లిపాయ కూడా ఒకటి. ఇది దాదాపు అందరి వంటగదుల్లో ఉంటుందని చెప్పవచ్చు. వంటల్లో దీనిని విరివిగా ఉపయోగిస్తూ ఉంటారు. పకోడి, సలాడ్స్, సాండ్‌విచ్ వంటి వాటిల్లో కూడా ఉల్లిపాయను ఎక్కువగా వాడుతూ ఉంటారు. అలాగే చాలా మంది దీనిని భోజనంతో పాటు వివిధ రకాల చిరుతిండ్లతో నేరుగా తీసుకుంటారు. ముఖ్యంగా వేసవి కాలంలో పచ్చి ఉల్లిపాయలను నేరుగా తీసుకుంటూ ఉంటారు. ఇలా చేయడం వల్ల శరీరం చల్లగా ఉంటుంది. భోజనంతో పాటు పచ్చి ఉల్లిపాయలను తీసుకోవడం వల్ల రుచిగా ఉండడంతో పాటు మన ఆరోగ్యానికి కూడా మేలు కలుగుతుంది. పచ్చిఉల్లిపాయలల్లో ఉండే పోషకాలు, వీటిని తీసుకోవడం వల్ల మనకు కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి పోషకాహార నిపుణులు వివరిస్తున్నారు.

### బీపీ తగ్గేందుకు..

ఉల్లిపాయలో క్వెర్సెటిన్ ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడుతుంది. అంతేకాకుండా శరీరంలో వాపులను, అలర్జీ లక్షణాలను కూడా ఇది తగ్గిస్తుంది. ఇవి యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలను కూడా కలిగి ఉంటాయి. భోజనంతో పాటు పచ్చి ఉల్లిపాయలను తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరగడంతో పాటు అధిక రక్తపోటు కూడా అదుపులో ఉంటుంది. ఉల్లిపాయల విటమిన్ సి, బి విటమిన్లు, పొటాషియం వంటి పోషకాలు కూడా ఉంటాయి. అధిక రక్తపోటుతో బాధపడే వారు ఉల్లిపాయలను తీసుకోవడం వల్ల రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. ఉల్లిపాయల్లో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ లక్షణాలు కూడా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. ఇక చక్కెర వ్యాధితో బాధపడే వారికి కూడా ఉల్లిపాయలు ప్రయోజనకరంగా ఉంటాయి. ఉల్లిపాయలను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. డయాబెటిస్, ప్రీ డయాబెటిస్ తో బాధపడే వారు ఉల్లిపాయలను తీసుకోవడం వల్ల మంచి ఫలితాలను పొందవచ్చు.


### ఎముకల దృఢత్వానికి..

ఉల్లిపాయలల్లో ప్రీబయోటిక్స్ తో పాటు ఫైబర్ కూడా ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల పేగు ఆరోగ్యం మెరుగుపడుతుంది. జుట్టు పెరుగుదలకు కూడా ఉల్లిపాయ సహాయపడుతుంది. ఉల్లిపాయలల్లో సల్ఫర్ అధికంగా ఉంటుంది. ఇది జుట్టు ఒత్తుగా, పొడవుగా పెరగడానికి తోడ్పడతాయి. ఎముకలను ధృడంగా చేయడంలో కూడా ఉల్లిపాయలు ఉపయోగపడతాయి. వయసు పైబడిన వారు వీటిని తీసుకోవడం వల్ల ఎముకలు బలంగా తయారవుతాయి. దీంతో వారిలో ఎముకలు విరగడం వంటి సమస్యలు తక్కువగా వచ్చే అవకాశం ఉంది.

### క్యాన్సర్ రాకుండా..

పచ్చి ఉల్లిపాయలను తీసుకోవడం వల్ల చర్మ ఆరోగ్యం మెరుగుపడుతుంది. అధిక కొలెస్ట్రాల్ స్థాయిలు తగ్గుతాయి. శరీర బరువు అదుపులో ఉంటుంది. ఊపిరితిత్తుల ఆరోగ్యం మెరుగుపడుతుంది. క్యాన్సర్ వంటి వ్యాధుల బారిన పడే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ఈ విధంగా ఉల్లిపాయలు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వీటిని భోజనంతో పాటు పచ్చిగా తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. వీటిని క్రమం తప్పకుండా తీసుకునే ప్రయత్నం చేయాలని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.

# రోజూ మీరు తినే తెల్ల బియ్యానికి బదులుగా ఈ రెడ్ రైస్‌ను తినండి.. ఎంతో మేలు జరుగుతుంది..!



భారతీయుల ఆహారంలో బియ్యం ముఖ్య పాత్ర పోషిస్తాయని చెప్పవచ్చు. బియ్యంతో అన్నాన్ని వండుకుని వివిధ కూరలతో తింటూ ఉంటాం. సాధారణంగా మనం రోజూ వండుకునే బియ్యమే కాకుండా బియ్యంలో కూడా వివిధ రకాలు ఉంటాయి. వాటిలో ఎర్రబియ్యం కూడా ఒకటి. వీటిని రెడ్ రైస్ అని కూడా అంటారు. ఈ బియ్యం కొద్దిగా పొడవుగా, గుండ్రంగా ఉంటాయి. ఇవి నీటిలో కరిగే వర్ణద్రవ్యం ఆంథోసైనిన్ తో పాటు ఎరుపు రంగును కలిగి ఉంటాయి. ఈ బియ్యం సాధారణ బియ్యం కంటే కొద్దిగా వగరు రుచిని కలిగి ఉంటాయి. అయినప్పటికి వీటిలో పోషకాలు అధికంగా ఉంటాయి. రెడ్ రైస్ ను ఎక్కువగా ఆసియా దేశాల్లో పండిస్తారు. ముఖ్యంగా భారతదేశం, శ్రీలంక, ఇండోనేషియాలలో దీనిని అధికంగా సాగు చేస్తారు. సాధారణంగా ఈ బియ్యం వాటిపై ఉండే పొట్టు నుండి ఎరుపు రంగును పొందుతాయి. రెడ్ రైస్ లో కూడా అనేక పోషకాలు ఉంటాయి కనుక ఇవి కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

### మలబద్ధకం తగ్గేందుకు..

రెడ్ రైస్ ను కూడా మన ఆహారంలో భాగం చేసుకోవాలని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. రెడ్ రైస్ ను మన ఆహారంలో అసలు ఎందుకు చేర్చుకోవాలి.. వీటిని తీసుకోవడం వల్ల మనకు కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఏమిటి.. అన్న వివరాలను వారు తెలియజేస్తున్నారు. రెడ్ రైస్ లో యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి శరీరంలోని ఫ్రీరాడికల్స్ తో పోరాడతాయి. దీంతో క్యాన్సర్, గుండె జబ్బులు, డయాబెటిస్ వంటి అనారోగ్య సమస్యల బారిన పడకుండా ఉంటాం. రెడ్ రైస్ లో ఫైబర్ ఎక్కువగా, కొవ్వులు తక్కువగా ఉంటాయి. శరీర బరువును అదుపులో ఉంచడంలో ఇవి మనకు ఎంతో సహాయపడతాయి. ఈ బియ్యాన్ని ఆహారంగా తీసుకోవడం వల్ల దీనిలో ఉండే ఫైబర్ మలబద్ధకం సమస్యను తగ్గించడంలో దోహదపడుతుంది. అంతేకాకుండా ఈ బియ్యాన్ని ఆహారంగా తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు అదుపులో ఉంటాయి. తద్వారా టైప్ 2 డయాబెటిస్ వచ్చే అవకాశాలు కూడా తక్కువగా ఉంటాయి.

### ఎముకల దృఢత్వానికి..

రెడ్ రైస్ లో మన శరీరానికి అవసరమయ్యే విటమిన్లు, ఖనిజ లవణాలు అనేకం ఉన్నాయి. ఈ బియ్యంలో విటమిన్ బి6 ఎక్కువగా ఉంటుంది. ఇది శరీరంలో ఎర్ర రక్తకణాల ఉత్పత్తిని పెంచడంలో, మానసిక స్థితిని మెరుగుపరిచే న్యూరోట్రాన్సిటర్లను ఉత్పత్తిని పెంచడంలో సహాయపడుతుంది. ఈ రైస్ లో ఉండే విటమిన్ ఇ చర్మ ఆరోగ్యాన్ని మెరుగు పరచడంలో దోహదపడుతుంది. ఎర్రబియ్యంలో పొటాషియం, మెగ్నీషియం, ఐరన్ వంటి పోషకాలు కూడా ఉంటాయి. ఇవి రక్తపోటును అదుపులో ఉంచడంలో, ఎముకలను ధృడంగా ఉంచడంలో , జీవక్రియలను మెరుగుపరచడంలో ఉపయోగపడతాయి. రెడ్ రైస్ లో గ్లూటెన్ ఉండదు. సెలియాక్ వ్యాధి, గ్లూటెన్ అలర్జీ, వీట్ ఎలర్జీ ఉన్న వారికి ఇవి ఒక అద్భుతమైన ఎంపికగా చెప్పవచ్చు. గ్లూటెన్ ఉన్న ఆహారాలను తీసుకోవడం వల్ల కొందరిలో కడుపు నొప్పి, విరేచనాలు వంటి జీర్ణ సమస్యలు వస్తూ ఉంటాయి. అలాంటి వారికి రెడ్ రైస్ ఒక చక్కటి ప్రత్యామ్నాయం అని చెప్పవచ్చు.

### క్యాన్సర్లు రాకుండా..

రెడ్ రైస్ ను నేరుగా తీసుకోవడంతో పాటు ఇతర రకాల వంటకాలతో కూడా కలిపి తీసుకోవచ్చు. దీనిని సలాడ్, సూప్ లతో కూడా తీసుకోవచ్చు. అంతేకాకుండా రైస్ పుడ్డింగ్, రైస్ ఫ్లోర్ టోర్టిల్లాలు వంటి వంటకాల్లో సాధారణ బియ్యానికి బదులుగా ఈ రెడ్ రైస్ ను ఉపయోగించవచ్చు. దీంతో ఆయా వంటకాల రుచితో పాటు పోషకాల విలువ కూడా పెరుగుతుంది. పెద్దపేగు క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, ప్రోస్టేట్ క్యాన్సర్ వంటి కొన్ని రకాల క్యాన్సర్ ల బారిన పడే అవకాశాలను తగ్గించడంలో రెడ్ రైస్ మనకు సహాయపడుతుంది. ఈ బియ్యంలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్‌ఫ్లామేటరీ సమ్మేళనాలే ఇందుకు కారణం. ఈ సమ్మేళనాలు క్యాన్సర్ కణాల పెరుగుదలను వాటి వ్యాప్తిని నిరోధించి శరీర ఆరోగ్యాన్ని కాపాడడంలో సహాయపడతాయి. ఇలా అనేక రకాలుగా ఎర్రబియ్యం మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని వీటిని తీసుకోవడం వల్ల మన మొత్తం శరీరానికి మేలు కలుగుతుందని పోషకాహార నిపుణులు తెలియజేస్తున్నారు.

# కృత్రిమ గర్భాశయం!

## నెలలు నిండని శిశువులకు వరప్రసాదమే కొన్నేళ్లలో అందుబాటులోకి

నెలలు నిండకుండానే జననం. నవజాత శిశు మరణాలకు ప్రధాన కారణాల్లో ఒకటి. ఈ సమస్యకు సైంటిస్టులు తాజా వినూత్న పరిష్కారం కనిపెట్టారు. అదే... కృత్రిమ గర్భాశయం! 37 వారాలు నిండకముందే పుడితే నెల తక్కువ శిశువు అంటారు. అదే 23 నుంచి 27వ వారం మధ్యలోనే, అంటే ఆరు లేదా ఏడు నెలలకే కాన్పు జరిగితే అలాంటి శిశువు బతకడం చాలాసార్లు కష్టమవుతుంది. అంత లేత ఊపిరితిత్తులు బయటి ప్రపంచపు పరిస్థితులను తట్టుకునేందుకు అనువుగా ఉండవు. మిగతా కీలక శరీరాంగాలదీ అదే పరిస్థితి. ఆస్పత్రుల్లో ఇంక్యూబేటర్లలో ఉంచినా, ఎంత వైద్య చికిత్స అందించినా చాలాసార్లు లాభముండదు. అలాంటి శిశువుల్లో ఎక్కువమంది మృత్యువాత పడుతుంటారు. సైంటిస్టులు రూపొందించిన కృత్రిమ గర్భాశయం ఇందుకు పరిష్కారంగా కనిపిస్తోంది. ఇందులో ఉమ్మ నీటితో సహా అన్నీ అచ్చం అమ్మ గర్భంలో లాంటి పరిస్థితులే ఉండటం విశేషం!



### సంక్లిష్టమే

కృత్రిమ గర్భాశయం ఆలోచన వినేందుకు సింపుల్ గానే ఉన్నా దాని రూపకల్పన మాత్రం చాలా సంక్లిష్టం. అది పరిమాణంలో దాదాపు ఇళ్లలో పెట్టుకునే సాధారణ అక్వేరియాల మాదిరిగా ఉంటుంది. సిజేరియన్ ద్వారా పుట్టిన నెలలు నిండని శిశువును వెంటనే ఉమ్మనీటితో నిండిన సంచీలో పెడతారు. అక్కడ శిశువుకు వెచ్చదనంతో పాటు తల్లి గర్భంలోని అన్ని పరిస్థితులూ అమరుతాయి. మరి పుట్టిన క్షణం నుంచీ అతి కీలకంగా మారే శ్వాసక్రియ పరిస్థితి ఏమిటంటారా? దానికీ మార్గం కనిపెట్టారు. బొడ్డుతాడుకు అనుసంధానించి సింథటిక్ ఉమ్మసంచీ ద్వారా శిశువుకు నిరంతరం ఆక్సిజన్ అందుతూ ఉంటుంది. ఈ కృత్రిమ గర్భాశయంలో అవసరాన్ని బట్టి కొద్ది రోజులు, వారాల నుంచి నెల, ఆపైన కూడా ఉంచే వెసులుబాటు ఉందంటున్నారు దీన్ని రూపొందించిన సైంటిస్టులు. అయితే ఈ కృత్రిమ గర్భాశయం పూర్తిస్థాయిలో అందుబాటులోకి రావడానికి ఒకటి రెండేళ్ల కన్నా ఎక్కువే పట్టవచ్చట. కానీ ఈ పద్ధతిపై ఇప్పటికే నైతిక తదితర సందేహాలు తలెత్తుతుండటం విశేషం! అవన్నీ తీరి, నెలలు నిండకుండా పుట్టే ప్రతి పాపాయీ బతికి బట్ట కట్టే రోజు వస్తే బాగుంటుంది కదా అన్నది సైంటిస్టుల మాట.

NETI SHUBHODAYA Publisher, Editor and Owned by GONGURA SRINIVASA RAO, D No : 41-29/6-76, RANIGARI THOTA, KRISHNALANKA,VIJAYAWADA, KRISHNA, ANDHRA PRADESH - 520013. PRGI Reg No -"APTEL/26/A1193 .. Cell No - 9696571571 ..... Printed At SUNDAY PRINTING PRESS,"D No : 1-17-18, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006 .